స్వర్ణాంధ్ర

తెలుగు దినపత్రిక

సంపాదకుడు : కె.బి.జి. తిలక్

ఢిల్లీలో దడ పుట్టిస్తున్న వాయు కాలుష్యం

ఢిల్లీలో వాయు కాలుష్యం పెరుగుతోంది. గత కొన్ని రోజులుగా పెరుగుతున్న కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. కొందరు ఆసుపత్రుల్లో చేరుతుండగా, మరికొందరు అవుట్ పేషెంట్ సేవలను అందుకుంటున్నారు. ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 179 పాయింట్లుగా నమోదు అయింది. కాలుష్యాన్ని అరికట్టేందుకు ఢిల్లీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బొగ్గు, కలప వంటి వాటిని వినియోగించవద్దని కోరింది. కాలుష్యం బారిన పడకుండా ప్రజలు బయటకు వచ్చినప్పుడు మాస్క్ లు ధరించాలని కోరుతున్నారు.

ఆర్టీసీ - జేఏసీ

యాజమాన్యం చర్చలు విఫలం


ఆంధ్రప్రదేశ్ లో ఆర్టీసీ జేఏసీ యాజమాన్యం మధ్య చర్చలు విఫలమయ్యాయి. గత కొన్ని రోజులుగా తమ డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు ఆందోళన చేస్తున్నారు. స్ట్రయిక్ నోటీసు కూడా ఇచ్చారు. దీంతో ఆర్టీసీ యజమాన్యం కార్మికులతో చర్చలు జరుపుతోంది. ఆర్టీసీ కార్మిక సంఘాలు 1,450 విద్యుత్ బస్సుల ప్రైవేటు టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తుంది. విద్యుత్ బస్సులను ఆర్టీసీ సొంత సిబ్బందితోనే నడపాలని కోరుతుంది. ప్రజారవాణా వ్యవస్థను ప్రైవేటుపరం చేయవద్దని జేఏసీ స్పష్టం చేసింది. అయితే యాజమాన్యం తో చర్చలు విఫలమయ్యాయని కార్మిక సంఘాలు తెలిపాయి.

R.N.I.No.APTEL/1999/1614 సంపుటి : 28 సంచిక 184 విజయవాడ 26 అక్టోబర్ 2026 సోమవారం 10 పేజీలు వెల : 2 రూపాయలు swarna_tilak@rediffmail.com´

ఆరేడు శాఖల్లో మంత్రులను నియంత్రిస్తున్న ప్రైవేట్ వ్యక్తులు

కీలకశాఖలో కొంతమందిఉన్నతాధికారులపెత్తనం...కొన్నిప్రైవేట్‌కంపెనీలపెత్తనంతో పాటు గుత్తాధిపత్యం

(వాసిరెడ్డి శ్రీనివాస్)




ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంలోని పలు కీలక శాఖల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు చూసి టీడీపీ నేతలే అవాక్కు అవుతున్నారు. కొంత మంది మంత్రులను ప్రైవేట్ వ్యక్తులు పూర్తిగా నియంత్రిస్తున్నారు అనే చర్చ అటు ప్రభుత్వ అధికారులతో పాటు రాజకీయ నేతల్లో కూడా పెద్ద ఎత్తున సాగుతోంది. ఈ తరహా బరితెగింపు గతంలో ఎప్పుడూ లేదు అని చెపుతున్నారు అధికారులు. ముఖ్యంగా కీలక శాఖల్లోని ఈ వ్యవహారం అడ్డగోలుగా సాగుతోంది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంలో భారీ ఎత్తున అవినీతి ఆరోపణలు..విమర్శలు వచ్చే శాఖలో అయితే మంత్రి ఒక కవికి కీలక బాధ్యతలు అప్పగించినట్లు చెపుతున్నారు. కవి అంటే అయన ఏదో కవిత్వాలు రాస్తాడు అనుకుంటే పొరపాటే. ఆయన ఆ కీలక మంత్రికి చెందిన అవినీతి వ్యవహారాలతో పాటు ఇతర అన్ని విషయాలు చూసుకుంటాడు అని ఆయన కేబినెట్ సహచరులే చర్చించుకుంటున్నారు. ఒక్కో పనికి ఒక్కొక్కరులా ఇలా కొంత మంది ప్రైవేట్ వ్యక్తులను నియమించుకుని ఆ మంత్రి తమ శాఖ వ్యవహారాలు నడిపిస్తున్నారు అని...వసూళ్లతో పాటు అన్ని పనులు వీళ్ళే చేసుకుంటున్నట్లు ఆ శాఖ వర్గాలు చెపుతున్నాయి. మంత్రి మాత్రం రిలాక్స్ గా తనకు నచ్చిన పనులు చేసుకుంటూ ఉంటే...శాఖ వ్యవహారాలు వీళ్ళు చక్కబెడుతున్నారు అని అధికారులు చెపుతున్నారు. ఆ శాఖ పరిధిలోకి వచ్చే అప్రిల్స్ తో పాటు ఇతర వ్యవహారాల కోసం ప్రత్యేక టీం పెట్టుకున్నారు అని...ఆ టీం గ్రీన్ సిగ్నల్ ఇస్తే తప్ప ఫైనల్ గా నిర్ణయం బయటకు రాదు అని ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి వెల్లడించారు. ఇది ఒక వ్యవహారం అయితే మరో కీలక..పవర్ ఫుల్ శాఖలో కూడా ఢిల్లీ లో ఒకరిని పెట్టి కథ నడిపించటంతో పాటు అమరావతిలో కూడా అసలు ఆ శాఖకు ఏ మాత్రం సంబంధము లేని వ్యక్తులకు కీలక బాధ్యతలు అప్పగించి ప్రభుత్వ శాఖలను ప్రైవేట్ వ్యవహారంలాగా మార్చివేసినట్లు చెపుతున్నారు. ఈ కీలక శాఖలో కొంత మంది ఉన్నతాధికారుల పెత్తనం...కొన్ని ప్రైవేట్ కంపెనీల పెత్తనంతో పాటు గుత్తాధిపత్యం సాగుతోంది. మరో కీలక మంత్రి ఇన్వాల్వ్స్ మెంట్ అయితే ఇక చెప్పేపనిలేదు. ఆయన ఫైల్స్ మీద సంతకాలు చేయరు కానీ..నిర్ణయాలు అన్ని ఆయనవే అని చెపుతారు. తన శాఖలో ఎవరో పనులు చేయించుకుంటుంటే తాను మాత్రం ఖాళీ గా ఎందుకు ఉండాలి అని ఆ మంత్రి కూడా ప్రైవేట్ వ్యక్తులను రంగంలోకి దింపి భారీ ఎత్తున పనూళ్లు చేస్తున్నట్లు ఆ శాఖ వర్గాలు చెపుతున్నాయి. ' దగ్గర దగ్గర ఆరేడు శాఖల మంత్రుల దగ్గర ప్రైవేట్ వ్యక్తులు రంగంలోకి దిగి ఆయా శాఖలకు చెందిన వ్యవహారాలు..సెటిల్మెంట్స్ చూడటంతో పాటు మంత్రులను కూడా తమ గుప్పిటలో పెట్టుకుంటున్నారు అనే చర్చ టీడీపీ నేతల్లో సాగుతోంది. ఎప్పుడైనా లెక్క తేడా వస్తే ప్రభుత్వంలో కీలక స్థానాల్లో ఉన్న వాళ్ళ జాతకాలే కాకుండా అవినీతి విషయం కూడా మొత్తం బయటకు వచ్చే అవకాశం ఉంది అనే చర్చ టీడీపీ నేతల్లో సాగుతోంది. ప్రభుత్వ పెద్దలతో పాటు మంతులు ఇలా ఎవరి పనుల్లో వాళ్ళు ఉండటంతో కీలక స్థానాల్లో ఉన్న వాళ్ళ కూడా ఆయా మంత్రుల దగ్గర జరుగుతున్న ప్రైవేట్ వ్యవహారాలను పట్టించుకోవటం లేదు అని ఒక సీనియర్ నేత అభిప్రాయపడ్డారు. అధిస్థానం ఒక్కసారి దృష్టి సారిస్తే చాలు వీళ్ళ జాతకాలు అన్ని బయటకు వస్తాయని ఒక మంత్రి అభిప్రాయపడ్డారు. అంతే కాకుండా ఆరేడు కీలక శాఖల వ్యవహారాల్లో అన్ని పనులను సిండికేట్ లే నడిపిస్తున్నాయి అని..గతంలో హవా చెలాయించిన వాళ్లే ఇప్పుడు కూడా ఆయా శాఖల్లో అలవోకగా పనులు చేయించుకోవటంతో పాటు పెత్తనం చెలాయిస్తున్నట్లు టీడీపీ నేతలే చెపుతున్నారు.

పసిఫిక్ మహాసముద్రంలో తొలిసారి 30 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు..

మరింత బలపడుతున్న ఎల్‌నినో

డిసెంబర్ నాటికి గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం...2026 నైరుతి రుతుపవనాల్లో సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతం...అక్టోబర్-డిసెంబర్‌లో దేశంలోని చాలా ప్రాంతాల్లో తక్కువ వర్షాల అంచనా...ఎల్‌నినో ప్రభావం 2027 ఆరంభం వరకు కొనసాగే అవకాశం



పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు చారిత్రక గరిష్ఠానికి చేరాయి. ఎల్‌నినో ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో భూమధ్య రేఖకు సమీపంలోని మధ్య పసిఫిక్ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు తొలిసారి 30 డిగ్రీల సెల్సియస్ మార్కును దాటాయి. అమెరికా జాతీయ సముద్ర, వాతావరణ పరిపాలనా సంస్థ (ఎన్ఓఏఏ) సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఈ వివరాలను వెల్లడించారు. అక్టోబర్ 22న ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రత 30 డిగ్రీలకు చేరినట్లు 'ఇండియా టుడే' తెలిపింది. అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం, ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ఉష్ణమండల ప్రాంతాల్లో సముద్ర ఉపరితల జలాలు సాధారణం కంటే ఎక్కువగా వేడెక్కే సహజ వాతావరణ పరిణామం.

దీనివల్ల సముద్రంపై వీచే గాలులు, మేఘాల కదలికలు, వర్షపాత నమూనాల్లో మార్పులు వస్తాయి. ఈ ప్రభావం పసిఫిక్ ప్రాంతానికే పరిమితం కాకుండా ప్రపంచంలోని పలు దేశాల వాతావరణంపైనా పడుతుంది. కొన్ని ప్రాంతాల్లో కరవు, అధిక ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉండగా.. మరికొన్ని చోట్ల భారీ వర్షాలు, వరదల ముప్పు పెరుగుతుంది. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) అంచనాల ప్రకారం.. 2026 అక్టోబర్–డిసెంబర్ మధ్య ఎల్‌నినో మరింత బలపడే అవకాశం ఉంది. డిసెంబర్ నాటికి ఇది గరిష్ఠ స్థాయికి చేరవచ్చని అంచనా వేస్తున్నారు. ఎల్‌నినో తీవ్రతను అంచనా వేయడానికి శాస్త్రవేత్తలు ఉపయోగించే నినో 3.4 సూచీలో సముద్ర ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే జూన్‌లో 1.6 డిగ్రీలు, ఆగస్టులో 2.5 డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. అక్టోబర్–డిసెంబర్ కాలానికి ఈ వ్యత్యాసం 3.7 డిగ్రీలకు చేరవచ్చని డబ్ల్యూఎంఓ అంచనా వేసింది. ఇది గతంలో నమోదైన గరిష్ఠ స్థాయి కంటే ఎక్కువ. అయితే ఈ సంఖ్యలు సముద్రం వాస్తవ ఉష్ణోగ్రతను కాకుండా, దీర్ఘకాలిక సగటుతో పోలిస్తే ఎంత ఎక్కువగా ఉందో సూచిస్తాయి. భారత్‌పైనా ఈ పరిణామాల ప్రభావం ఉండొచ్చని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. 2026లో నైరుతి రుతుపవనాల సీజన్ సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతంతో ముగిసింది. అక్టోబర్–డిసెంబర్ మధ్య దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది.

అయితే దక్షిణ ద్వీపకల్ప ప్రాంతంలో మొత్తం మీద సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని తెలిపింది. ప్రాంతాలవారీగా పరిస్థితులు మారవచ్చని, ఎల్‌నినో ఒక్కటే భారత వాతావరణాన్ని నిర్ణయించదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు, సముద్రాలు ఇప్పటికే అసాధారణంగా వేడెక్కుతున్న నేపథ్యంలో బలమైన ఎల్‌నినో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలను మరింత పెంచే ప్రమాదం ఉందని డబ్ల్యూఎంఓ హెచ్చరించింది. ఈ ప్రభావం 2027 ఆరంభం వరకు కొనసాగవచ్చని అంచనా వేస్తోంది. అయితే దీని తీవ్రత, వర్షపాతంపై ప్రభావం ప్రాంతాన్ని బట్టి మారుతుంది. అందువల్ల రాబోయే నెలల్లో సముద్ర ఉష్ణోగ్రతలు, గాలుల దిశ, వర్షపాత అంచనాలను శాస్త్రవేత్తలు నిరంతరం పరిశీలించనున్నారు.

జగన్ ట్రాప్ లో టీడీపీ పడిందా? జాతీయ స్థాయిలో ఫోకస్ అయ్యారా?



ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల వేళ జగన్ ట్రాప్ లో టీడీపీ పడినట్లే కనిపిస్తుంది. జాతీయ స్థాయిలో నామినేషన్ల కేంద్రాల వద్ద జరిగిన చర్చనీయాంశమైంది. జాతీయ మీడియాతో పాటు సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెర్స్ కూడా ఈ ఘటనపై టీడీపీకి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారు. ఎన్డీఏ కూటమిలో టీడీపీ ఉండటంతో జాతీయ స్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణలు, నామినేషన్ల చించివేత ఘటనలు నేషనల్ లెవెల్ లో హైలెట్ గా నిలిచాయని చెప్పాలి. జగన్ కోరుకున్నదిదే. అందుకే జగన్ తన అభ్యర్థులను బరిలోకి దింపాలని పార్టీ నేతలకు తెలిపారు. ఈ ఘటనలతో టీడీపీతో పాటు కూటమిలో ఉన్న బీజేపీ పైపు కూడా కొందరు దోషిగా చూడటం మొదలు పెట్టారు. ఇది జగన్ కు ప్లస్ కాగా, టీడీపీకి మైనస్ గా మారింది. బీజేపీ కేంద్ర నాయకత్వం కూడా ఈ ఘటనలతో కొంత ఆలోచనలో పడినట్లు చెబుతున్నారు. జగన్ వేసిన ట్రాప్ లు సునాయాసంగా టీడీపీ పడిపోయిందన్న రాజకీయ విశ్లేషణలు వెలువడుతున్నాయి.ఎన్నికల సమాచారం చూడండి

నామినేషన్ల పర్వంలో...

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల పర్వంలో చోటుచేసుకున్న ఘర్షణలు, రాజకీయ వ్యూహాల వల్ల ప్రస్తుతం ఈ అంశం జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. జగన్ మోహన్ రెడ్డి వ్యూహాత్మకంగా వేసిన ట్రాప్‌లో టీడీపీ పడిందా లేదా అనేది రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు వైసీపీ నేతలను ముందస్తు అరెస్ట్ లు చేయడం, నామినేషన్ల కేంద్రాల్లోకి చొరబడి ప్రత్యర్థుల నామినేషన్ పత్రాలను చింపివేయడం, వాహనాల దగ్ధం, పోలీసు కాల్పులు, రాళ్ల దాడులు వంటివి జాతీయ స్థాయిలో హైలెట్ అయ్యాయి. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో తమ అభ్యర్థులపై దాడులు జరుగుతున్నాయని, గడువు పొడిగించాలని మైనర్ కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

సుప్రీంకోర్టు ఇందులో ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని భావించి, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25 వరకు వాయిదా వేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించడంతో ఈ వ్యవహారం జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించింది.

సామాజిక మాధ్యమాల్లో...

ఆంధ్రప్రదేశ్ లో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని, కేంద్ర బలగాలను రంగంలోకి దించాలని లేదా రాష్ట్రపతి పాలన విధించాలని మైనస్ జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీ స్థాయిలో డిమాండ్ చేయడం వల్ల ఈ రగడ నేషనల్ ఫోకస్ అయింది. పుంగనూరు, కడప వంటి ప్రాంతాల్లో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి, అవినాష్ రెడ్డి కాన్వాయ్‌లపై దాడులు జరిగాయని ఆరోపిస్తూ వైసీపీ ఎంపీలు రాష్ట్రపతికి, లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదులు చేశారు.

అంతే కాదు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు వేసేందుకు వస్తున్న మహిళలను అడ్డుకోవడం, వారిపై దాడులు చేయడం కూడా సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటుండటంతో ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో హైలెట్ అయింది. ఏపీలో ఎప్పుడూ లేనిది ఇలా జరుగుతుండేమిటంటూ కొందరు ఆరా తీస్తున్నారు. తప్పు ఎవరిది? ఎవరు ఎవరిపై దాడులు చేశారన్నది పక్కన పెడితే అధికారంలో ఉన్నది మాత్రం టీడీపీనే.

అందుకే ఖచ్చితంగా శాంతిభద్రతల సమస్య అనేది ప్రభుత్వం మెడకు చుట్టుకునే ప్రమాదం ఉందని చెబుతున్నారు. జగన్ ఇంత దూరం ఆలోచించి తన అభ్యర్థులను బరిలోకి దింపారా? లేదా? అన్నది తెలియదు కానీ, జగన్ ట్రాప్ లో మాత్రం టీడీపీ పడినట్లేనని చాలా మంది భావిస్తున్నారు.

అరుణాచల్ ప్రదేశ్‌లో నిరసనలు తీవ్రరూపం..ఎమ్మెల్యే నివాసం లూటీ, ప్రాజెక్ట్ ఆఫీసు,పోలీస్ స్టేషన్‌కు నిప్పు

ఈశాన్య రాష్ట్రం, చైనా సరిహద్దుల్లోని అరుణాచల్ ప్రదేశ్‌లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన భారీ హైడల్ విద్యుత్ ప్రాజెక్ట్‌కు నిరసనగా తూర్పు సియాంగ్ జిల్లాల్లో చేపట్టిన నిరసనలు ఉద్రిక్తతలకు దారితీశాయి.

ఈ ఘటనలో ఓ ఎమ్మెల్యే ఇంటిని ఆందోళనకారులు లూటీ చేశారు. అలాగే, పోలీస్ స్టేషన్, పవర్ ప్రాజెక్ట్ ఆఫీసుకు నిప్పంటించారు. దీంతో పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణకు దారితీసింది.

ఆ ప్రాంతంలో 144 సెక్షన్ విధించిన పోలీసులు.. కఠిన ఆంక్షలు ప్రకటించారు.అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రతిపాదిత 11,200 మెగావాట్ల సియాంగ్ అప్పర్ మల్టీపర్పసస్ ప్రాజెక్ట్ కి వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలు తీవ్ర హింసాత్మకంగా మారాయి.

తూర్పు సియాంగ్ జిల్లాలోని నిరసనల్లో పాల్గొన్న 'జెన్ జీ'యాక్ట్ గ్రూప్ ఎన్‌హెచ్‌పీసీ కార్యాలయంతో పాటు ఒక పోలీస్ స్టేషన్‌కు నిప్పు పెట్టారని, అలాగే ఇద్దరు ఎమ్మెల్యేలు, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడి నివాసాలపై దాడి చేసి, ధ్వంసం చేయడమే కాకుండా లూటీకి పాల్పడ్డారని పోలీసులు ఆరోపించారు. శుక్రవారం నుంచి మొదలైన హింసాత్మక నిరసనలు.. శనివారం తెల్లవారుజాము వరకు దాదాపు తొమ్మిది గంటల పాటు విడతల వారీగా కొనసాగాయి.


నిరసనకారులు జరిపిన రాళ్లదాడిలో 40 మందికి పైగా పోలీసు సిబ్బంది గాయపడినట్లు పోలీసులు తెలిపారు. టియర్ గ్యాస్ షెల్ తగలడంతో గాయపడిన యువకుడ్ని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితులు అదుపుతప్పి శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందన్న హెచ్చరికలతో తూర్పు సియాంగ్ జిల్లా యంత్రాంగం పాసీఘాట్, మేబో, రుక్సిన్ ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించింది. అక్టోబర్ 24 సాయంత్రం 5 గంటల నుంచి అమల్లోకి వచ్చిన ఆంక్షలు, తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు.

మానవ మెదడు రహస్యాలను డీకోడ్ చేసిన సంచలన పరిశోధన



స్టాన్‌ఫర్డ్ మెడిసిన్ పరిశోధకులు మానవ మెదడు పరిణామానికి సంబంధించి ఒక అద్భుతమైన.. సరికొత్త విషయాన్ని వెల్లడించారు. దశాబ్దాలుగా మానవ మెదడు ఒకే రకమైన ఏకరీతి కణాల నుంచి అభివృద్ధి చెందిందని శాస్త్రవేత్తలు భావిస్తూ వచ్చారు. అయితే ప్రఖ్యాత శాస్త్రవేత్త కైల్ లో నేతృత్వంలోని పరిశోధక బృందం పిండ దశ ప్రారంభంలోనే మెదడు కణాలు రెండు వేర్వేరు స్వతంత్ర మూలాల నుండి ఏర్పడతాయని కనుగొంది. నేచర్ న్యూరోసైన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం.. మెదడు ఆవిర్భావం గురించిన సాంప్రదాయ ఆలోచనలను పూర్తిగా మార్చివేసింది.ఈ పరిశోధన ప్రకారం.. ఒక సమూహం ముందు.. మధ్య మెదడును నిర్మించగా.. మరొక ప్రత్యేక సమూహం వెనుక మెదడును అభివృద్ధి చేస్తుంది. ఈ రెండు ప్రాంతాలు పిండ దశ ప్రారంభం నుంచే భిన్నమైన కణజాల మార్గాల ద్వారా అభివృద్ధి చెందుతాయి. అంటే మనం ప్రస్తుతం చూస్తున్న మానవ మెదడు ఒకే సమ్మేళనంగా కాకుండా.. పరిణామ క్రమంలో ఒకదానికొకటి దగ్గరగా వచ్చి విలీనమైన రెండు వేర్వేరు ప్రాచీన నాడీ వ్యవస్థల సమ్మేళనంగా ఏర్పడిందని ఈ అధ్యయనం స్పష్టం చేస్తోంది. ఈ విస్మయకరమైన పరిణామ క్రమం కేవలం మనుషులకే పరిమితం కాకుండా.. చేపలు, పక్షులు.. సుమారు 550 మిలియన్ సంవత్సరాల క్రితం నాటి సముద్ర జీవులలో కూడా కనిపిస్తుందని పరిశోధకులు నిరూపించారు. అంటే ఈ ద్వంద్వ మూలాల వ్యవస్థ చాలా ప్రాచీనమైనదని.. పరిణామ క్రమంలో కాలక్రమేణా ఈ రెండు వేర్వేరు నాడీ వ్యవస్థలు కలిసిపోయి నేడు ఒకే మెదడులా పనిచేస్తున్నాయని ఈ అధ్యయనం ద్వారా వెల్లడైంది. శాస్త్రవేత్తలు ఇప్పటివరకు ల్యాబ్‌లో వెనుక మెదడు (బ్యాక్ బ్రెయిన్) కణాలను విజయవంతంగా సృష్టించలేకపోయారు. అయితే ఈ కొత్త ఆవిష్కరణతో వెనుక మెదడు కణాలు వేరే మార్గంలో అభివృద్ధి చెందుతాయని గుర్తించి.. మొట్టమొదటిసారిగా ల్యాబ్‌లో మానవ వెనుక మెదడు మోటార్ న్యూరాన్లను విజయవంతంగా పెంచగలిగారు. ఈ పురోగతి వైద్య రంగానికి ఒక మైలురాయిగా నిలిచింది. ఈ పరిశోధన ద్వారా అమియోట్రోఫిక్ లాటరల్ స్క్లెరోసిస్ (ఏఎల్ఎస్) , స్పైనల్ మస్కులర్ అట్రోఫీ (ఎస్.ఎం.ఏ) వంటి తీవ్రమైన నరాల సంబంధిత వ్యాధులపై లోతుగా అధ్యయనం చేయడానికి కొత్త మార్గాలు ఏర్పడ్డాయి. భవిష్యత్తులో ఈ ప్రాణాంతక వ్యాధులకు సరికొత్త చికిత్సలను, పునరుత్పత్తి వైద్య విధానాలను కనుగొనేందుకు ఈ అధ్యయనం ఎంతగానో దోహదపడుతుందని శాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు

మన శరీరం గుండా సెకనుకు లక్షల కోట్ల కణాలు



మనం సాధారణంగా జీవిస్తున్న ఈ సమయంలోనే, ప్రతి సెకనుకు మన శరీరం గుండా దాదాపు 100 ట్రిలియన్ల (లక్షల కోట్లకు పైగా) సూక్ష్మ కణాలు దూసుకుపోతున్నాయని మీకు తెలుసా? వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. ఈ కణాలను 'న్యూట్రినోలు' అని పిలుస్తారు. ఇవి దాదాపు ద్రవ్యరాశి లేకుండా, ఎలాంటి విద్యుదావేశం లేకుండా ఉంటాయి. అందుకే ఇవి మన శరీరంతో ఏమాత్రం చర్య జరపకుండా, ఎలాంటి హాని కలిగించకుండా ప్రయాణిస్తాయి. మనకు వాటి ఉనికి కూడా తెలియదు.ఈ న్యూట్రినోలలో అధిక శాతం సూర్యుడి కేంద్రకంలో జరిగే కేంద్రక సంలీన చర్యల ఫలితంగా పుడతాయి. అక్కడ పుట్టిన ఈ కణాలు దాదాపు కాంతి వేగంతో ప్రయాణించి, కేవలం ఎనిమిది నిమిషాల్లో భూమిని చేరుకుంటాయి. వీటికి పదార్థంతో చర్య జరిపే గుణం చాలా చాలా తక్కువ. అందువల్లనే ఇవి గ్రహాలు, పెద్ద పెద్ద భవనాలు, చివరికి మన శరీరాల గుండా కూడా ఏ ఆటంకం లేకుండా వెళ్ళిపోతాయి. అసలు అక్కడ ఏదీ లేనట్టుగా ఇవి ప్రయాణిస్తాయి.న్యూట్రినోలు మాత్రమే కాకుండా, కాస్మిక్ కిరణాల వల్ల వాతావరణంలో పుట్టే 'మ్యూయాన్'ల వంటి ఇతర కణాలు కూడా మన శరీరాన్ని దాటుతాయి. కానీ వాటి సంఖ్య చాలా తక్కువ. సగటున ఒక చేతి గుండా సెకనుకు ఒకటి లేదా రెండు మ్యూయాన్లు మాత్రమే వెళతాయి. కానీ న్యూట్రినోలు మాత్రం లక్షల కోట్ల సంఖ్యలో మనల్ని దాటి వెళుతూనే ఉంటాయి.ఈ కణాలను గుర్తించడం శాస్త్రవేత్తలకు చాలా కష్టమైన పని. ఎప్పుడో ఒకసారి ఏదైనా న్యూట్రినో ఒక అణువును ఢీకొట్టినప్పుడు మాత్రమే దాని ఉనికిని గుర్తించగలరు. వీటిపై పరిశోధనల కోసం అంటార్కిటికాలోని 'ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ' వంటి భారీ ప్రయోగశాలలను ఏర్పాటు చేశారు. (భౌతికశాస్త్రంలో ఈ ఘనతకే ప్రొఫెసర్ ఫ్రెన్సిస్ హోల్జెన్ ను ఈ ఏడాది ప్రఖ్యాత నోబెల్ పురస్కారం వరించింది).విశ్వంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే శక్తివంతమైన న్యూట్రినోలపై అధ్యయనం చేయడం ద్వారా విశ్వం యొక్క రహస్యాలను తెలుసుకోవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి ఎలాంటి మార్పు చెందకుండా ప్రయాణించే ఈ కణాలను 'విశ్వ సందేశహరులు'గా పరిగణిస్తున్నారు.

బరువు తగ్గాలని భోజనం మానేస్తున్నారా?
బెడిసికొట్టే ప్రమాదం ఉందంటున్న నిపుణులు




బరువు తగ్గాలని చాలామంది భోజనం మానేస్తుంటారు. మరికొందరు పనుల ఒత్తిడితో మధ్యాహ్నం సరిగ్గా తినలేక కాఫీతో సరిపెట్టుకుంటారు. ఇలా చేస్తే కేలరీలు తగ్గి బరువు తగ్గుతామని అనుకుంటారు. కానీ ఈ అలవాటు వల్ల తర్వాత మరింత ఎక్కువగా తినే ప్రమాదం ఉందని పోషకాహార నిపుణులు హెచ్చరిస్తున్నారు.పనులు, మీటింగ్‌లతో బిజిగా ఉండి భోజనానికి సమయం కేటాయించలేని వారు చాలా మందే ఉంటారు. భోజనం మానేస్తే శరీరానికి అందాల్సిన ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, కార్బోహైడ్రేట్లు, పీచు పదార్థాలు అందకుండా పోతాయి. దీనివల్ల పోషకాలు తగినంతగా అందకపోవచ్చు. అంతేకాకుండా, తర్వాతి భోజనం చేసే సమయానికి విపరీతమైన ఆకలి వేయొచ్చు. అప్పుడు ఏది తింటున్నాం? అందులో పోషకాలు సరిపడా ఉన్నాయా? అని ఆలోచించకుండా కడుపు నింపే ఆహారం వైపు మొగ్గు చూపుతాం.ముఖ్యంగా ఆకలి ఎక్కువగా ఉన్నప్పుడు అన్నం, చపాతీలు, పాస్తా, నూడుల్స్ వంటి కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని అవసరానికి మించి తినే అవకాశం ఉంది. ఇలా తరచూ జరిగితే బరువు తగ్గకపోగా పెరిగే ప్రమాదం ఉంది.

ముందుగానే ప్లాన్ చేసుకోండి

రోజంతా బిజిగా ఉన్నా భోజనాన్ని ముందుగానే ప్లాన్ చేసుకోవాలి. ఇందుకోసం కేవలం 10 నిమిషాలు కేటాయించినా సరిపోతుంది. ప్రతి భోజనంలో ప్రోటీన్లు, పీచు పదార్థాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు, మంచి కార్బోహైడ్రేట్లు ఉండేలా చూసుకోవాలి.వండటానికి సమయం లేని రోజుల్లో త్వరగా తినగలిగే ఆరోగ్యకరమైన ఆహారాన్ని ముందే సిద్ధం చేసుకోవడం మంచిది. అలా చేస్తే ఆకలి వేసినప్పుడు ఏది పడితే అది తినకుండా ఉండొచ్చు. భోజనం ఎప్పుడూ ప్రత్యేకంగా, ఎక్కువ సమయం తీసుకునేలా ఉండాల్సిన అవసరం లేదు. పనుల హడావుడిలో కాఫీతో సరిపెట్టి, రాత్రి అతిగా తినే పరిస్థితి రాకుండా చూసుకోవడమే ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

మనిషి మెదడుకు అతిపెద్ద శత్రువు ఇదే



మన దైనందిన జీవితంలో మెదడు ఆరోగ్యాన్ని దెబ్బతీసే అతిపెద్ద అంశం దీర్ఘకాలిక ఒత్తిడి అని, సరైన నిద్ర, ఆరోగ్యకరమైన అలవాట్లతో దాని పనితీరును కాపాడుకోవచ్చని ప్రముఖ న్యూరాలజిస్ట్, న్యూరో సైంటిస్ట్ డాక్టర్ ఫేయ్ బెౌటి స్పష్టం చేశారు. 'విజన్ ఆఫ్ హెల్త్' అనే పాడ్‌కాస్ట్‌లో ఆమె మాట్లాడుతూ.. మెదడు ఆరోగ్యానికి సంబంధించిన అనేక అపోహలను తొలగించి, ఆచరణీయమైన సలహాలు అందించారు. ఈ మేరకు హిందూస్థాన్ టైమ్స్ ఓ కథనం వెలువరించింది.

ఒత్తిడితో జ్ఞాపకశక్తికి ముప్పు

అతిగా పనిచేయడం, తీవ్రమైన ఒత్తిడికి గురవడం, తగినంత విశ్రాంతి లేకపోవడం మెదడుకు అత్యంత హానికరం అని డాక్టర్ ఫేయ్ హెచ్చరించారు. స్వల్పకాలిక ఒత్తిడి మనల్ని అప్రమత్తంగా ఉంచినా, దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల రోజంతా కార్టిసాల్ అనే హార్మోన్ స్థాయిలు పెరిగిపోతాయి. ఇది మెదడులోని భావోద్వేగాలను నియంత్రించే అమిగ్డాలా, జ్ఞాపకశక్తికి కీలకమైన హిప్పోక్యాంపస్, ఏకాగ్రతకు సంబంధించిన ప్రీఫ్రంటల్ కార్టెక్స్‌పై తీవ్ర ప్రభావం చూపుతుంది. కొన్ని సందర్భాల్లో, ఈ ప్రభావం ఎంత బలంగా ఉంటుందంటే.. జ్ఞాపకశక్తి సమస్యలతో బాధపడేవారిని చూసి డిమెన్షియా (మతిమరుపు వ్యాధి) ఏమోనని అనుమానించే పరిస్థితి వస్తుందని ఆమె వివరించారు.

నిద్ర.. 8 గంటల నియమం అపోహే!

మెదడు ఆరోగ్యానికి రోజుకు 8 గంటల నిద్ర అవసరమనేది కేవలం సగటు అంచనా మాత్రమేనని డాక్టర్ ఫేయ్ తెలిపారు. కొందరికి 6-7 గంటలు సరిపోతే, మరికొందరికి 10-11 గంటల నిద్ర అవసరం కావచ్చు. ఎన్ని గంటలు నిద్రపోయాం అనేదానికంటే, నిద్రలో స్థిరత్వం పాటించడం ముఖ్యం. ముఖ్యంగా, ప్రతిరోజూ ఉదయం ఒకే సమయానికి మేల్కొవడం వల్ల శరీర గడియారం (బాడీ క్లాక్) క్రమబద్ధంగా పనిచేస్తుంది. ఉదయాన్నే 10-15 నిమిషాల పాటు సహజ కాంతిలో, వీలైతే బయట గడపడం వల్ల నిద్రలేమి, అలసట, కుంగుబాటు లక్షణాలు తగ్గుతాయని పరిశోధనలు చెబుతున్నాయి. మంచి నిద్ర మెదడులో పేరుకుపోయే హానికరమైన ప్రోటీన్‌లను తొలగించడంలో సహాయపడుతుంది.

మద్యంతో జాగ్రత్త

మద్యం కూడా మెదడుపై ప్రభావం చూపే ఒక డ్రగ్ లాంటిదేనని ఆమె అన్నారు. ఇది శరీర సమతుల్యతను నియంత్రించే సెరిబెల్లమ్, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని ప్రభావితం చేసే ప్రీఫ్రంటల్ కార్టెక్స్‌ను దెబ్బతీస్తుంది. రోజూ రాత్రి భోజనంతో పాటు ఒకటి లేదా రెండు డ్రింకులు తీసుకునే అలవాటు ఉన్నవారిలో కూడా కాలక్రమేణా మెదడుపై గుర్తించదగిన ప్రభావం ఉంటుందని ఆమె హెచ్చరించారు. దీనిని రోజువారీ అలవాటుగా కాకుండా, అప్పుడప్పుడు మాత్రమే తీసుకోవాలని సూచించారు.

మెదడుకు నిరంతర వ్యాయామం

వయసు పెరిగేకొద్దీ మెదడు పనితీరు తగ్గకుండా ఉండాలంటే 'కాగ్నిటివ్ రిజర్వ్'ను పెంచుకోవడం ముఖ్యం. కొత్త భాష నేర్చుకోవడం, చిత్రలేఖనం, కొత్త నైపుణ్యాలు సంపాదించడం, సామాజికంగా చురుగ్గా ఉండటం వంటి కార్యకలాపాలు మెదడుకు సవాలు విసురుతూ దానిని ఆరోగ్యంగా ఉంచుతాయి. మంచి నిద్ర, కాగ్నిటివ్ రిజర్వ్‌ను పెంచుకోవడం అనేవి మెదడు ఆరోగ్యానికి రెండు ప్రధాన ప్రాధాన్యతలని ఆమె పేర్కొన్నారు.అయితే, మెదడు ఆరోగ్యం కోసం చేసే ప్రయత్నాలు మరో ఒత్తిడిగా మారకూడదని డాక్టర్ ఫేయ్ హితవు పలికారు. జీవితంలోని సంతోషకరమైన క్షణాలను ఆస్వాదించకుండా, కేవలం ఆరోగ్యం గురించే అతిగా ఆలోచించడం కూడా మంచిది కాదని ఆమె ముగించారు.

అధిక బరువుతో స్పెర్మ్ కౌంట్ తగ్గుతుందా?.. వంధ్యత్వం తప్పదా?



ఆధునిక జీవనశైలి కారణంగా చాలామంది ఊబకాయం సమస్యతో బాధపడుతున్నారు. అయితే, ఈ అధిక బరువు పురుషుల్లో సంతానోత్పత్తి సామర్థ్యంపై ప్రభావం చూపుతుందా? ఇది తప్పనిసరిగా వంధ్యత్వానికి దారితీస్తుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఊబకాయం పురుషుల పునరుత్పత్తి ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుందన్నది నిజమే అయినా, అది కచ్చితంగా వంధ్యత్వానికి కారణం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పూణేలోని రూబీ హాల్ క్లినిక్‌కు చెందిన ఫెర్టిలిటీ కన్సల్టెంట్ డాక్టర్ తేజస్ గుండేవార్ ఈ అంశంపై పలు కీలక విషయాలు వెల్లడించారు.

స్పెర్మ్ ఆరోగ్యంపై ప్రభావం ఎలా ఉంటుంది?

శరీరంలో కొవ్వు కణజాలం అధికంగా పేరుకుపోయినప్పుడు, అది పురుష హార్మోన్ అయిన టెస్టోస్టెరాన్‌ను ఈస్ట్రోజెన్‌గా మారుస్తుంది. దీనివల్ల టెస్టోస్టెరాన్ స్థాయిలు తగ్గి, స్పెర్మ్ ఉత్పత్తి మందగిస్తుంది. ఇది స్పెర్మ్ సాంద్రత, వాటి కదలిక (మోటిలిటీ), ఆకారం (మార్ఫాలజీ) వంటి వాటిపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. కొన్ని సందర్భాల్లో, ఇది స్పెర్మ్ డీఎన్ఏ ఫ్రాగ్మెంటేషన్‌కు కూడా కారణమవుతుందని డాక్టర్ తేజస్ వివరించారు.సాధారణంగా వృషణాల్లో (టెస్టిస్) స్పెర్మ్ ఉత్పత్తికి శరీర సాధారణ ఉష్ణోగ్రత కంటే కొంచెం తక్కువ ఉష్ణోగ్రత అవసరం. అయితే, ఊబకాయం వల్ల పొట్ట, తొడల చుట్టూ కొవ్వు పెరగడం, శారీరక శ్రమ లేని జీవనశైలి కారణంగా స్క్రోటల్ ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఈ పెరిగిన వేడి స్పెర్మ్ ఉత్పత్తి ప్రక్రియను దెబ్బతీస్తుంది. ఇవే కాకుండా ఇన్సులిన్ రెసిస్టెన్స్, టైప్-2 డయాబెటిస్, అంగస్తంభన సమస్యలు (ఎరెక్టైల్ డిస్‌ఫంక్షన్) వంటివి కూడా సంతానోత్పత్తికి అడ్డంకులుగా మారవచ్చు.

వంధ్యత్వం తప్పనిసరి కాదు

అధిక బరువు లేదా ఊబకాయం ఉన్న ప్రతి పురుషుడిలో వంధ్యత్వం వస్తుందని చెప్పలేమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సంతానోత్పత్తి అనేది వయసు, జన్యుపరమైన అంశాలు, జీవనశైలి, ఇతర ఆరోగ్య సమస్యల వంటి అనేక కారణాలపై ఆధారపడి ఉంటుంది. ఊబకాయం కేవలం ఒక ప్రమాద కారకం మాత్రమేనని గుర్తించాలి.

పరిష్కారం ఏమిటి?

ఈ సమస్యను అధిగమించడానికి జీవనశైలిలో మార్పులు చేసుకోవడం చాలా ముఖ్యమని వైద్యులు సూచిస్తున్నారు. ఆరోగ్యకరమైన బరువును పాటించడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, పోషకాలతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం వంటివి తప్పనిసరి. అలాగే ధూమపానం, అధికంగా మద్యం తాగడానికి దూరంగా ఉండటం ద్వారా హార్మోన్ల సమతుల్యతను కాపాడుకోవచ్చు. ముఖ్యంగా, పిల్లల కోసం ప్లాన్ చేసుకునే ముందే పురుషులు తమ బరువును అదుపులో ఉంచుకోవడం వారి పునరుత్పత్తి సామర్థ్యాన్ని కాపాడుకోవడానికి ఎంతగానో సహాయపడుతుంది.

వర్కవుట్ తర్వాత ఏం తినాలి.. ఖరీదైన పొడర్లు వద్దు.. ఇవే బెస్ట్




జిమ్‌లో గంటల తరబడి చెమటోడ్చిన తర్వాత ఏం తినాలనే సందేహం చాలామందిలో ఉంటుంది. కండరాల రికవరీకి, శక్తిని తిరిగి పొందడానికి ఖరీదైన ప్రోటీన్ షేక్‌లు, సప్లిమెంట్లు తప్పనిసరి అని చాలామంది భావిస్తుంటారు. అయితే, వాటి అవసరం ఏమాత్రం లేదని, ఇంట్లో లభించే సాధారణ, సమతుల్య ఆహారంతోనే చక్కటి ఫలితాలు సాధించవచ్చని ఆరోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. వ్యాయామం చేయడం వల్ల శరీరంపై ఒత్తిడి పడుతుంది. ఈ సమయంలో కండరాల్లోని ప్రొటీన్లు దెబ్బతింటాయి, శరీరంలోని శక్తి నిల్వలు (గ్లైకోజెన్) ఖర్చవుతాయి. వీటిని తిరిగి భర్తీ చేయడానికి సరైన పోషకాహారం చాలా ముఖ్యం. కండరాల మరమ్మతు, పెరుగుదలకు ప్రొటీన్ అత్యంత కీలకం. ఇందుకోసం గుడ్లు, పనీర్, పెరుగు, చికెన్, చేపలు, టోఫు, పప్పుధాన్యాలు వంటివి ఆహారంలో చేర్చుకోవాలి. అలాగే, కోల్పోయిన శక్తిని తిరిగి పొందడానికి కార్బోహైడ్రేట్లు అవసరం. అన్నం, రొట్టె, ఓట్స్, బంగాళాదుంపలు, అరటిపండ్లు వంటివి తీసుకోవడం ద్వారా గ్లైకోజెన్ నిల్వలను నింపుకోవచ్చు.

ఆహారం ఎలా ఉండాలి?

వర్కవుట్ తర్వాత ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు సమపాళ్లలో ఉండేలా చూసుకోవాలి.అన్నం, పప్పు, కూరగాయలతో పాటు కాస్త పెరుగు.రొట్టెతో పాటు చికెన్ లేదా పప్పు కూర.గుడ్లు, హోల్‌మీల్ బ్రెడ్, ఏదైనా ఒక పండు.పనీర్ లేదా టోఫుతో చేసిన కూర, అన్నం.పెరుగులో పండ్లు, గింజలు కలుపుకుని తినడం.వీటితో పాటు వ్యాయామం తర్వాత నీళ్లు ఎక్కువగా తాగాలి. చెమట ద్వారా కోల్పోయిన ద్రవాలను భర్తీ చేయడం చాలా ముఖ్యం. ఆహారం ఎప్పుడు తినాలనే దానిపై కఠినమైన నియమాలేవీ లేవని, వర్కవుట్ ముగిసిన ఒకటి, రెండు గంటల వ్యవధిలో సమతుల్య ఆహారం తీసుకుంటే సరిపోతుందని డైటీషియన్లు చెబుతున్నారు.

క్యాన్సర్ మళ్లీ రాకుండా కొత్త చికిత్స.. ఫేజ్-3 ట్రయల్‌లో కీలక ఫలితాలు



క్యాన్సర్ కణాల వల్ల వ్యాధి మళ్లీ వచ్చే ప్రమాదాన్ని తగ్గించడం ఈ విధానంలోని ముఖ్య ఉద్దేశం.

ఇతర క్యాన్సర్లపైనా పరిశోధనలు

మెలనోమాతోపాటు ఊపిరితిత్తులు, మూత్రాశయం, కిడ్నీ వంటి ఇతర క్యాన్సర్లలోనూ వ్యక్తిగత ఎ=చూ చికిత్సల సామర్థ్యాన్ని పరిశోధకులు అధ్యయనం చేస్తున్నారు. అయితే ఒక్క క్యాన్సర్ రకంలో వచ్చిన ఫలితాలను ఇతర క్యాన్సర్లకు నేరుగా వర్తింపజేయలేం. ప్రతి వ్యాధికి ప్రత్యేకమైన క్లినికల్ పరీక్షలు, భద్రతా పరిశీలనలు అవసరం.

చికిత్స అందుబాటులోకి రావడానికి ఇంకా సమయం

ఈ ఫేజ్-3 ట్రయల్‌లో సానుకూల ఫలితాలు వచ్చినప్పటికీ, చికిత్స వల్ల రోగుల మొత్తం జీవనకాలంపై ఎలాంటి ప్రభావం ఉంటుందో తెలుసుకోవడానికి మరింత పరిశీలన అవసరం. పరిశోధన కొనసాగుతుండగా, నియంత్రణ సంస్థల సమీక్షలు, అనుమతులు కూడా కీలకం. ప్రస్తుతం ఈ థెరపీని అన్ని క్యాన్సర్లను నయం చేసే సార్వత్రిక వ్యాక్సిన్‌గా భావించడం సరికాదు.మొత్తంగా, రోగి కణితి జన్యు లక్షణాలకు అనుగుణంగా చికిత్సను రూపొందించే వ్యక్తిగత ఎంఆర్ఎన్ఎ విధానం క్యాన్సర్ వైద్యంలో కొత్త అవకాశాలను తెరుస్తోంది. ముఖ్యంగా శస్త్రచికిత్స తర్వాత మెలనోమా తిరిగి వచ్చే ప్రమాదాన్ని తగ్గించడంలో ఈ పరిశోధన ఆశాజనక సంకేతాలను అందిస్తోంది. అయితే చికిత్స పొందాలా వద్దా అనే నిర్ణయాన్ని రోగులు తమ క్యాన్సర్ వైద్యులతో చర్చించి తీసుకోవాలి.

క్యాన్సర్ చికిత్స రంగంలో వ్యక్తిగత ఎ=చూ థెరపీ మరో కీలక ముందడుగు పడింది. ముఖ్యంగా ప్రాణాంతక చర్మ క్యాన్సర్ అయిన మెలనోమా చికిత్సలో ఈ విధానం ఆశాజనక ఫలితాలను అందించింది. శస్త్రచికిత్స అనంతరం క్యాన్సర్ తిరిగి వచ్చే ప్రమాదాన్ని తగ్గించడమే లక్ష్యంగా రూపొందించిన ఈ ప్రయోగాత్మక చికిత్సపై పరిశోధకులు దృష్టిసారించారు. తాజా ఫలితాల ప్రకారం, ఇమ్యూనోథెరపీ మందుతో కలిపి వ్యక్తిగతీ ఎంఆర్ఎన్ఎ థెరపీని అందించిన రోగుల్లో క్యాన్సర్ తిరిగి రావడం కానీ, మరణించే ప్రమాదానికి సంబంధించి 42 శాతం తగ్గినట్లు వెల్లడైంది.

1,137 మంది రోగులపై క్లినికల్ ట్రయల్

హై-రిస్క్ మెలనోమాతో బాధపడుతున్న 1,137 మంది రోగులతో మూడో దశ క్లినికల్ ట్రయల్ నిర్వహించారు. వీరికి తొలుత శస్త్రచికిత్స ద్వారా కణితులను తొలగించారు. అనంతరం కొంతమందికి పెంబ్రోలిజుమాబ్ అనే ఇమ్యూనోథెరపీ మందును మాత్రమే అందించగా, మరో బృందానికి దానితోపాటు వ్యక్తిగత ఎంఆర్ఎన్ఎ ఆధారిత చికిత్సను ఇచ్చారు. ఈ రెండు బృందాల ఫలితాలను పోల్చినప్పుడు, కలయిక చికిత్స పొందినవారిలో క్యాన్సర్ తిరిగి వచ్చే, మరణించే ప్రమాదం సాపేక్షంగా 42 శాతం తక్కువగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఆస్ట్రేలియా క్యాన్సర్ పరిశోధకురాలు ప్రొఫెసర్ జార్జినా లాంగ్ నేతృత్వంలోని పరిశోధన ఈ రంగంలో ఆసక్తిని పెంచింది. అయితే, ఈ గణాంకం సాపేక్ష ప్రమాద తగ్గింపును సూచిస్తుంది. ప్రతి రోగికి క్యాన్సర్ ముప్పు 42 శాతం పాయింట్లు తగ్గిందని, అందరికీ ఒకే విధమైన ప్రయోజనం ఉంటుందని దీని అర్థం కాదు.

రోగి కణితి లక్షణాల ఆధారంగా ప్రత్యేకంగా తయారీ

ఈ చికిత్సలో ప్రధాన ప్రత్యేకత ఏమిటంటే.. అందరికీ ఒకే విధమైన వ్యాక్సిన్‌ను ఇవ్వడం కాకుండా, ప్రతి రోగి కణితిలో కనిపించే జన్యు మార్పుల ఆధారంగా చికిత్సను రూపొందించడం. ఇందుకోసం కణితి నమూనాను విశ్లేషించి, క్యాన్సర్ కణాల్లో ఉన్న ప్రత్యేక మార్పులను గుర్తిస్తారు. వాటి ఆధారంగా ఇంటిస్మెరాన్ ఆటోజీన్ అనే ప్రయోగాత్మక ఎ=చూ థెరపీని తయారు చేస్తారు.ఈ థెరపీ శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ క్యాన్సర్‌కు సంబంధించిన ప్రత్యేక లక్షణాలను గుర్తించేలా శిక్షణ ఇవ్వడంలో సహాయపడుతుంది. తద్వారా క్యాన్సర్ కణాలపై దాడి చేసే రోగనిరోధక ప్రతిస్పందనను ప్రేరేపించాలన్నది పరిశోధకుల లక్ష్యం. శస్త్రచికిత్సతో కణితిని తొలగించిన తర్వాత శరీరంలో మిగిలి ఉండే సూక్ష్మ

చంద్రబాబు చేతిలో కీలుబొమ్మలా ఎస్ఈసీ... ప్రభుత్వం, ఎస్ఈసీ, పోలీసులు కుమ్మక్కై ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారు

టీడీపీ దుర్మార్గాలకు వంతపాడిన పోలీసులను ఇప్పటికే గుర్తించాం...చట్టాలను ఉల్లంఘించిన పోలీసులపై న్యాయపోరాటం చేస్తాం... మీడియా కళ్లుగప్పి నామినేషన్ కేంద్రాల్లో టీడీపీ అరాచకాలు...

పోలీసులసమక్షంలోనేనామినేషన్ పత్రాల చించివేతలు ,,, ఫ్యాన్‌గుర్తుకుఓటేసికూటమిప్రభుత్వానికిగుణపాఠంచెప్పాలి : ప్రజలకుమాజీమంత్రి అంబటి రాంబాబు విజ్ఞప్తి



గుంటూరు: స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో తెలుగుదేశం ప్రభుత్వం, పోలీసులు, ఎన్నికల కమిషన్ కుమ్మక్కై రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్రంగా మండిపడ్డారు. గుంటూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ అరాచకాలను, పోలీసుల చర్యలను తీవ్రంగా ఎండగట్టారు. ఎన్నికల ప్రక్రియలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని, నామినేషన్లు వేసే అభ్యర్థులకు రక్షణ కల్పించాలని స్పష్టం చేసినప్పటికీ, రాష్ట్రంలో ఎక్కడా సక్రమంగా నామినేషన్లు వేయని పరిస్థితి నెలకొందని అంబటి రాంబాబు ఆరోపించారు. రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ చంద్రబాబు చేతిలో కీలుబొమ్మలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నామినేషన్ కేంద్రాల్లోకి మీడియాను అనుమతించకుండా, పోలీసుల సమక్షంలోనే ప్రతిపక్ష అభ్యర్థుల నామినేషన్ పత్రాలను చించివేస్తూ ఏకపక్షంగా 'ఏకగ్రీవాలు' చేసుకుంటున్నారని మండిపడ్డారు. అక్రమాలకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్న ఐపీఎస్ అధికారులతో పాటు సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు సహా మొత్తం 54 మంది పోలీసు అధికారులను తాము గుర్తించామని, వీరిపై న్యాయస్థానాలను ఆశ్రయించి న్యాయ పోరాటం చేస్తామని అంబటి రాంబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ అరాచకాలను, దౌర్జన్యాలను ప్రజలందరూ గమనిస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని ఆయన పేర్కొన్నారు. గుంటూరు మేయర్ పదవికి పోటీ చేస్తున్న శ్రీదేవిని, కార్పొరేటర్ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అరాచకాలతో ఏకగ్రీవాలు చేసుకునే దుష్టసాంప్రదాయం:

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను చంద్రబాబు ప్రభుత్వం, పోలీసులు, ఎన్నికల కమిషన్ కుమ్మక్కై పూర్తిగా అపహాస్యం చేశాయి. ప్రతిపక్ష అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకుని, అరాచకాల ద్వారా బలవంతంగా ఏకగ్రీవాలు చేసుకునే దుష్టసంప్రదాయానికి తెరతీశారు. మైస్సార్‌సీపీ నాయకులను ముందస్తుగా ఎటువంటి కారణం లేకుండా గృహనిర్బంధం చేయడం ఈ ప్రభుత్వ అప్రజాస్వామిక విధానానికి నిదర్శనం. మాజీ మంత్రి విడదల రజినిని ఇళ్ల వద్దే అడ్డుకోవడమే కాకుండా, పోలీసులు నెట్టివేయడంతో ఆమె కిందపడిపోయిన ఘటన అత్యంత దుర్మార్గమైనది. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, నంబూరి శంకరరావు వంటి సీనియర్ నాయకులను బయటికి రానీయకుండా గృహనిర్బంధం చేశారు. అభ్యర్థులకు బీ-ఫారాలు అందించకుండా, నామినేషన్ కేంద్రాల వద్దకు వెళ్లకుండా పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు హక్కులు లేకుండా చేసి, పోలీసుల అండతో సాగిస్తున్న ఈ దౌర్జన్యకాండను ప్రజలు గమనిస్తున్నారు.

రాజకీయ స్వార్థం కోసం ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారు:

నామినేషన్లు వేయడానికి వెళ్లిన మైస్సార్‌సీపీ అభ్యర్థులతో పాటు జనసేన, బీజేపీ నాయకులపై కూడా టీడీపీ మూకలు దాడులకు తెగబడ్డాయి. జనసేన నాయకుడు బెల్లంకొండ శ్రీనివాస్ కుటుంబంపై, కడపలో బీజేపీ అభ్యర్థి సురేష్‌పై జరిగిన దాడులే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనాలు. నామినేషన్ కేంద్రాల్లోకి మీడియాను అనుమతించకుండా, వాస్తవాలు బయటకు రాకుండా అధికార పార్టీ కుట్రలు పన్నుతోంది. సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో పోలీసుల తీరు మారకపోవడం దారుణమైన పరిస్థితికి అద్దం పడుతోంది. రక్షణ కల్పిస్తామని ఫోన్లలో చెప్పే పోలీసులు, క్షేత్రస్థాయిలో మాత్రం అభ్యర్థులపై దాడులు జరుగుతుంటే చోద్యం చూస్తున్నారు. నామినేషన్ పత్రాలను చించివేయడం, మహిళా అభ్యర్థుల పట్ల అమర్యాదగా ప్రవర్తించడం ఈ ప్రభుత్వ అరాచక పాలనకు పరాకాష్ట చంద్రబాబు, లోకేష్‌ల రాజకీయ స్వార్థం కోసం పోలీసు వ్యవస్థను పూర్తిగా దుర్వినియోగం చేసి ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారు.

చట్టాల ఉల్లంఘనలపై న్యాయ పోరాటం చేస్తాం:

చట్టాన్ని ఉల్లంఘిస్తూ అరాచకాలకు పాల్పడుతున్న ఐపీఎస్ అధికారులతో సహా మొత్తం 54 మంది పోలీసుల వివరాలను మేము సేకరించాం. సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు సహా తప్పు చేసిన ప్రతి ఒక్క పోలీసు అధికారిపై న్యాయస్థానాలను ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తాం.

రాష్ట్ర ఎన్నికల కమిషన్ చంద్రబాబు చేతిలో కీలుబొమ్మలా మారి, నిష్పక్షపాతంగా వ్యవహరించడంలో పూర్తిగా విఫలమైంది. న్యాయ వ్యవస్థే ఈ రాష్ట్రాన్ని కాపాడాలని, సుప్రీంకోర్టు మరియు హైకోర్టుల ద్వారా ఈ అక్రమాలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తాం. ఇలాంటి దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులతో సాధించే గెలుపును ప్రజలు ఎప్పటికీ అంగీకరించబోరని అధికార పార్టీ గుర్తుంచుకోవాలి. ఈ రాక్షస పాలనకు, పోలీసుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా గుంటూరు మేయర్ స్థానంతో పాటు అన్ని చోట్ల ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలి. ప్రజల ఓటు హక్కు ద్వారానే ఈ అధికార దుర్వినియోగానికి, అరాచక పద్ధతులకు సరైన గుణపాఠం చెప్పాలని అంబటి రాంబాబు ప్రజలకు పిలుపునిచ్చారు.

గెలుపుపై నమ్మకం లేకే టీడీపీ శిఖండి రాజకీయాలు... రాజధానిలో వైయస్ఆర్‌సీపీ కండువాలతో టీడీపీ అభ్యర్థుల నామినేషన్లు.. సిగ్గుచేటు

రాజధాని ప్రాంతంలో వైయస్ఆర్‌సీపీ కండువాలు కప్పుకొని నామినేషన్లు వేయాల్సిన దుస్థితిటీడీపీకిపట్టింది...నామినేషన్ కేంద్రాల వద్ద దాడులు, బెదిరింపులతో అభ్యర్థుల హక్కులను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం.... వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులకు రక్షణ కల్పించలేని పోలీసు వ్యవస్థ ఎందుకు... నామినేషన్లు వేసే హక్కును అడ్డుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి :మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



గుంటూరు: స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులను అడ్డుకోవడం, నామినేషన్ కేంద్రాల వద్ద దాడులు, బెదిరింపులకు పాల్పడటం, మహిళా అభ్యర్థుల పట్ల అవమానకరంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మండిపడ్డారు. రాజధాని ప్రాంతంలో వైయస్ఆర్‌సీపీ కండువాలు కప్పుకొని టీడీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయాల్సిన పరిస్థితి రావడం ఆ పార్టీ దిగజారుడు రాజకీయాల దుస్థితికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా రాజధాని ప్రాంతంలో చోటుచేసుకున్న పరిణామాలు, పోలీసుల వ్యవహారశైలిపై గుంటూరులోని జేకేసీ రోడ్డులో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో నంబూరు శంకరరావు మాట్లాడారు. పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని, ప్రతి అభ్యర్థికి స్వేచ్ఛగా నామినేషన్ వేసే హక్కును కల్పించాలని స్పష్టం చేశారు.

ఇది టీడీపీ శిఖండి రాజకీయాలకు పరాకాష్ట

43-44 ఏళ్ల చరిత్ర ఉందని చెప్పుకునే తెలుగుదేశం పార్టీ, ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో ఎదుర్కోలేక దౌర్జన్యాలకు దిగజారడం సిగ్గుచేటు. రాజధానికి అనుకొని ఉన్న పెదకూరపాడు నియోజకవర్గం, అమరావతి మండలంలోనే వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేసుకోలేని పరిస్థితి తీసుకొచ్చారు. గెలుపుపై నమ్మకం ఉంటే ఎన్నికలను స్వేచ్ఛగా ఎదుర్కోవాలి. కానీ రౌడీలు, గూండాలను రంగంలోకి దించి, కర్రలు, కత్తులు, రాడ్లతో భయభ్రాంతులకు గురిచేసి నామినేషన్లను అడ్డుకోవడమేంటి? వైయస్ఆర్‌సీపీ కండువాలు కప్పుకొని టీడీపీ అభ్యర్థులు నామినేషన్లు వేసే దుస్థితి ఎందుకు వచ్చింది? ఇది టీడీపీ శిఖండి రాజకీయాలకు పరాకాష్ట చంద్రబాబు నాయుడు గారు, మీ పాలనలో రాజధాని పక్కనే ఎన్నికలను సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి ఎందుకు వచ్చిందో సమాధానం చెప్పాలి.

మహిళా అభ్యర్థులకూ రక్షణ లేదా?

నామినేషన్లు వేయడానికి వెళ్లిన మా అభ్యర్థులను అడ్డుకోవడం, కొట్టడం, నామినేషన్ పత్రాలు లాక్కోవడం, ఫోన్లు ధ్వంసం చేయడం, బెదిరింపులకు పాల్పడటం ఏ ప్రజాస్వామ్యంలోనైనా సమర్థించగలమా? అమరావతి నుంచి నామినేషన్ వేయడానికి వెళ్లిన మహిళా అభ్యర్థులపైనా దాడులు జరిగాయని, వారి పత్రాలను లాక్కునే ప్రయత్నాలు జరిగాయని మా దృష్టికి వచ్చింది. కోసూరు నుంచి వెళ్లిన చిన్నబాబును తీవ్రంగా కొట్టారు, ఫోన్ లాక్కొని చెవికి గాయమయ్యేలా దాడి చేశారని చెబుతున్నారు. మా నాయకులను అర్ధరాత్రి ఇళ్ల నుంచి తీసుకెళ్లడం, గృహ నిర్బంధాలు చేయడం, పోలీస్ స్టేషన్ల ఎదుటే బెదిరింపులకు పాల్పడటం ఏమిటి? నామినేషన్లు వేయడానికి వెళ్లిన అభ్యర్థులకు భద్రత కల్పించాల్సిన వ్యవస్థే వారికి అడ్డంకిగా మారితే ప్రజాస్వామ్యానికి రక్షణ ఎక్కడ? ఇలాంటి ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

పోలీసులూ, ఉన్నతాధికారులూ బాధ్యత గుర్తించాలి

ఎస్పీ, కలెక్టర్, ఎన్నికల అధికారులకు మా అభ్యర్థుల జాబితాలు పంపించి, వారికి రక్షణ కల్పించి నామినేషన్లు వేసే అవకాశం ఇవ్వాలని కోరాం. 60 మంది ఎంపీటీసీ అభ్యర్థులు, ఐదుగురు జెడ్పీటీసీ అభ్యర్థుల భద్రత కోసం కూడా విజ్ఞప్తులు చేశాం. అయినా నామినేషన్ల ప్రక్రియలో మా అభ్యర్థులు ఎదుర్కొన్న ఇబ్బందులు ఆందోళన కలిగిస్తున్నాయి. పోలీసులకు ఒకటే చెబుతున్నాం..మీరు ఏ రాజకీయ పార్టీకి బానిసలు కాదు; ప్రజలకు, చట్టానికి జవాబుదారీగా పనిచేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు. ప్రజల పన్నులతోనే మీకు జీతాలు వస్తున్నాయి. అధికారంలో ఉన్నవారు ఐదేళ్లకే మారిపోతారు, కానీ మీరు దశాబ్దాల పాటు ప్రజలకు సేవ చేయాల్సి ఉంటుంది. అధికార పార్టీకి ఒక న్యాయం, ప్రతిపక్షానికి మరో న్యాయం ఉండకూడదు. పోలీసుల వ్యవహారశైలి మారాలి. దాడులు, బెదిరింపులు, అర్ధరాత్రి అరెస్టులు, అసభ్య పదజాలంతో దూషించడం వెంటనే ఆగాలి.

వైయస్ఆర్‌సీపీ కండువాలతో టీడీపీ నామినేషన్లు.. ఇదేం రాజకీయం?

అమరావతి, లకడపాడు, ఇతర ప్రాంతాల్లో వైయస్ఆర్‌సీపీ కండువాలు కప్పుకొని టీడీపీకి చెందిన అభ్యర్థులు నామినేషన్లు వేశారు. పల్నాడు పోలీసుల అధికారిక సామాజిక మాధ్యమ పేజీలోనూ వైయస్ఆర్‌సీపీ కండువాలతో అభ్యర్థులను తీసుకెళ్లిన దృశ్యాలు ఉన్నాయి. మా అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి వెళ్తే అడ్డంకులు, దాడులు. మరోవైపు మా పార్టీ కండువాలతో ఇతర అభ్యర్థులకు నామినేషన్ల అవకాశం..ఇది ఎలాంటి వ్యవస్థ? నిజంగా ప్రజల మద్దతు ఉందని నమ్మితే ఎన్నికలను స్వేచ్ఛగా నిర్వహించండి. ఎవరు గెలుస్తారో ప్రజలే నిర్ణయిస్తారు. ప్రజల తీర్పును ఎదుర్కోలేక ఇలాంటి పద్ధతులకు దిగడం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమే.

ఎన్నికలను స్వేచ్ఛగా నిర్వహించాలి

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా జరిగిన ఘటనలపై ఎన్నికల సంఘం తక్షణమే స్పందించాలి. నామినేషన్లు వేయకుండా అడ్డుకున్న అభ్యర్థులకు న్యాయం చేయాలి. ప్రతి అభ్యర్థికి భద్రత కల్పించి, నామినేషన్ వేసే హక్కును పరిరక్షించాలి. నామినేషన్ల ప్రక్రియలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనైనా ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. ఎన్నికల్లో గెలవడం, ఓడిపోవడం సహజం. దౌర్జన్యాలతో ఎన్నికలను ప్రభావితం చేయాలని చూస్తే ప్రజాస్వామ్యంపై ప్రజలకు నమ్మకం దెబ్బతింటుంది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించండి..ప్రజల తీర్పును గౌరవించండి" అంటూ నంబూరు శంకర్‌రావు డిమాండ్ చేశారు.

స్థానిక ఎన్నికల్లో వెన్నుపోటు పార్టీ రావణకాష్టం...వైయస్సార్‌సీపీ మహిళా అభ్యర్థులపైనా పైశాచికత్వం

మహిళలన్న గౌరవం లేకుండా రాక్షస ప్రవర్తన...గర్భిణీలను సైతం వదిలిపెట్టకుండా దాడులు...జగన్‌గారు ఆధారాలతో సహా అన్నీ బయటపెట్టారు...దీంతో తట్టుకోలేక వెన్నుపోటుపార్టీఅవాకులు,చెవాకులు...మాజీసీఎంఅన్న గౌరవం లేకుండా నీచపు మాటలు...నోటికొచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోబోం : బండి పుణ్యశీల వార్నింగ్



విజయవాడ (స్వర్ణాంధ్రప్రతినిధి) : స్థానిక ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతో, ఎలాగైనా ప్రధాన విపక్షం బరిలో నిలవకూడదన్న ఉద్దేశంతో వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వం పలు చోట్ల విధ్వంసం సృష్టిస్తోందని వైయస్సార్‌సీపీ అధికార ప్రతినిధి బండి పుణ్యశీల ఫైర్ అయ్యారు. అందులో భాగంగా, చివరకు వైయస్సార్‌సీపీ మహిళా అభ్యర్థులను సైతం వదలకుండా, దాడులు చేస్తూ పైశాచికత్వం ప్రదర్శిస్తున్నారని ఆమె ధ్వజమెత్తారు. మహిళలన్న కనీసం గౌరవం కూడా లేకుండా, అత్యంత హేయంగా గర్భిణిపై దాడి చేయడంతో పాటు, మరో మహిళ పట్ల దుశ్శాసన పర్వం చేశారని ఆక్షేపించారు. వెన్నుపోటు పార్టీ చేస్తున్న అరాచకాలను ఆధారాలతో సహా జగన్‌గారు బయట పెట్టడంతో, ఓర్చుకోలేక ఆయనపై అవాకులు చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. వెన్నుపోటు పార్టీ నాయకులు ఇకనైనా నోరు అదుపులో పెట్టుకోవాలని తేల్చి చెప్పారు. లేకపోతే వారికి తగిన గుణపాఠం చెబుతామని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన బండి పుణ్యశీల వార్నింగ్ ఇచ్చారు.

ప్రెస్‌మీట్‌లో బండి పుణ్యశీల ఇంకా ఏం మాట్లాడారంటే..:

స్థానిక ఎన్నికల్లో వెన్నుపోటు పార్టీ రావణకాష్టం:

రాష్ట్రంలో ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, విధ్వంసం చూస్తుంటే మనం అసలు ప్రజాస్వామ్యం అనేది ఉందా? అన్న సందేహం కలుగుతోంది. స్థానిక ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతో, పోటీలో ప్రధాన విపక్షం లేకుండా చేసి, ఎలాగైనా గెలవాలన్న దురుద్దేశంతో పలు రకాల కుట్రలు చేస్తున్నారు. మా పార్టీ నుంచి పోటీ చేస్తారన్న అభ్యర్థులను తొలుత బెదిరించారు. ఆ తర్వాత తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేసే ప్రయత్నం చేశారు. అంతటితో ఆగకుండా, మా పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా దారుణంగా వ్యవహరించారు. వారిపై దాడి చేశారు. వారి చేతుల్లోని నామినేషన్ పత్రాలు లాక్కుని చింపేశారు. ఎక్కడైనా నామినేషన్ వేస్తే, చివరకు ఆర్ఓ చేతిలో నుంచి కూడా లాక్కుని చింపేశారు. ఇవన్నీ పోలీసుల సమక్షంలోనే జరిగాయి. అయినా ఎక్కడైనా నామినేషన్లు ఉంటే, రకరకాల సాకులు చూపి, వాటిని స్క్రూటినీలో తీసేసే కుట్ర చేస్తున్నారు.

అడుగడుగునా మహిళలపై పైశాచికత్వం:

అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలు లాక్కుంటున్నప్పుడు కనీసం మహిళలని కూడా చూడడం లేదు. వారి పట్ల అత్యంత హేయంగా ప్రవర్తించారు. నిండు గర్భిణీని సైతం విడిచిపెట్టలేదు. మరో అభ్యర్థిని చీర లాగేశారు.. అంటూ పలు ఘటనలు ఉదహరించారు. అనంతపురం జిల్లా ధర్మవరం మున్సిపాలిటీలో 32వ వార్డు కౌన్సిలర్ స్థానానికి నామినేషన్ వేయడానికి వెళుతున్న వైయస్సార్ సీపీ మహిళా అభ్యర్థిని, బోయ -- వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన తలారి నళినిపై టీడీపీ నేత శంకర్ దాడి చేసి చీర లాగాడు. చీర లాగేయడమేంటి, మీరేమైనా కీచకులా? చిత్తూరులో నామినేషన్ వేయడానికి వెళ్తున్న యువతిని అసభ్యంగా తాకుతూ, నామినేషన్ పత్రాలను లాక్కోవడానికి టీడీపీ మూకలు ప్రయత్నించాయి. శ్రీసత్యసాయి జిల్లాలో తాడిమర్రి మండల నాయకుడు తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి, ఆయన బంధువుల ఇళ్లలోకి పోలీసులు చొరబడి 9 నెలల గర్భవతిని, ఇతర మహిళలను, వైయస్సార్ సీపీ కార్యకర్తలను దారుణంగా కొట్టారు. మాజీ మంత్రి విడదల రజినీ గారిని మూడు రోజుల పాటు ఇంట్లోనే బంధించి, అభ్యర్థులకు నామినేషన్ పత్రాలు, బీఫామ్ లు కూడా ఇచ్చే పరిస్థితి లేకుండా చేయడమే కాకుండా, ఓ మహిళా ఎన్నో దారుణంగా కిందకు తోసేశారు. చంద్రబాబు భజన చేయడంలో ముందుండే మహిళా హోంమంత్రి వంగలపూడి అనిత గారికి ఇవేవీ కనిపించడం లేదా?. కడపలో ఎమ్మెల్యే మాధవీరెడ్డి.. ప్రెస్ మీట్లో తన మేయర్ అభ్యర్థిని పక్కనబెట్టుకుని, ప్రత్యర్థుల్ని నామినేషన్ వేయనీయకండి, అడ్డుకోండని మాట్లాడుతోందంటే అసలు ఆమె ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధేనా, ఓ మహిళేనా అని అడుగుతున్నాం.

జగన్‌గారిపై నోరెత్తితే ఊరుకునేది లేదు:

గల్లా మాధవి వంటి ఎమ్మెల్యేలు జగన్‌గారి మేనకోడలు పెళ్లి గురించి తెగ బాధపడిపోతున్నారు. రాష్ట్రంలో ఇన్ని దారుణాలు జరుగుతుంటే వాటి గురించి మాట్లాడటం మానేసి, నిస్సిగ్గుగా ఇలాంటి మాటలు మాట్లాడతారా? అసలు మీరు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఎమ్మెల్యేలుగా, ప్రజలకు సమాధానం చెప్పాల్సిన వ్యక్తులేనా అని అడుగుతున్నాం. చంద్రబాబు భజన చేసుకుంటే చాలు, ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదనుకుంటున్నారా? మాదిగ కార్పోరేషన్ ఛైర్ పర్సన్ ఉండవల్లి శ్రీదేవి వంటివారు రాష్ట్రమంతా ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగిపోతున్నాయని చెబుతుంటే జనం నవ్వుకుంటున్నారు. విజయవాడ నగరానికి చెందిన సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బోండా ఉమ ఈసారి కూడా మంత్రి పదవి రాక దసరా టైంలో పూనకాలు వస్తున్నాయి. అందుకే ఆయన జగన్‌గారిపై అవాకులు చెవాకులు పేలుతున్నారు. స్థానిక ఎన్నికల్లో మీరు మా పార్టీ పేరుతో దాఖలు చేసిన ఫేక్ నామినేషన్లతో సహా, ప్రతి అంశాన్ని మా పార్టీ అధినేత, మాజీ సీఎం శ్రీ వైయస్ జగన్ చూపారు. దీంతో దిక్కు తోచక, వాటికి సమాధానం చెప్పలేక పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతున్నారు. 'బొండా ఉమా, నీకు నిజంగా దమ్ము ధైర్యం ఉంటే జగన్‌గారు చెప్పిన వివరాలు, చూపిన ఆధారాలకు సమాధానం చెప్పు. అంతే కానీ నోరు ఉంది కదా అని ఇష్టారాజ్యంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోబోం. మా పార్టీ మహిళా

ఎవరి శాంతి కోసం నేను సంతకం చేయాలి?: నేహా బోరా ఫైర్



ఢిల్లీ పోలీసులు జారీ చేసిన బీస్ బాండ్' (శాంతి పత్రం)పై సంతకం చేసేందుకు అఖిల భారత విద్యార్థి సంఘం (ఎఐఎస్ఎ) జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా నిరాకరించారు. నిరసన తెలిపే ప్రాథమిక హక్కును అణచివేసేందుకే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. మేరకు శనివారం ఢిల్లీలోని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్లమెంటరీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు, ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను ప్రశ్నించడం వంటి అంశాలపై అక్టోబర్ 16న మండీ హౌస్ వద్ద జరిగిన నిరసనలో పాల్గొన్నప్పుడు తనను అదుపులోకి తీసుకున్నారని నేహా బోరా తెలిపారు. అనంతరం, భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 126 కింద ఢిల్లీ పోలీసులు అక్టోబర్ 17న తనకు నోటీసులు జారీ చేశారని చెప్పారు. విచారణ సమయంలో శాంతికి భంగం కలిగించకుండా ఉండేందుకు రూ.10,000 వ్యక్తిగత బాండ్‌తో పాటు ఒకరి పూచీకత్తు సమర్పించాలని ఆ నోటీసులో పేర్కొన్నారని వివరించారు."ప్రజాస్వామ్య నిరసనలను అరికట్టేందుకు శాంతి బాండ్లను ఒక ఆయుధంగా వాడుతున్నారు. ఈ బాండ్‌పై సంతకం చేస్తే, నిరసన తెలిపే రాజ్యాంగబద్ధ హక్కును స్వయంగా వదులుకున్నట్లే అవుతుంది. అందుకే నేను సంతకం చేయబోను" అని నేహా బోరా స్పష్టం చేశారు. ఆందోళన సమయంలో తాము శాంతికి భంగం కలిగించలేదని, పోలీసులే లాఠీచార్జ్ చేయడం, మహిళల దుస్తులు చించడం, జర్నలిస్టులపై దాడికి పాల్పడటం వంటి హింసకు దిగారని ఆమె ఆరోపించారు. "శాంతి అనేది కేవలం ప్రభుత్వానికి మాత్రమే కాదు, ప్రజలకు కూడా ఉండాలి" అని ఆమె వ్యాఖ్యానించారు.పోలీసు నోటీసును సవాల్ చేస్తూ తాను దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసినప్పటికీ, కేసు యోగ్యతలను పరిశీలించలేదని నేహా తెలిపారు. విచారణలో పాల్గొనాలని మాత్రమే కోర్టు సూచించిందని, షోకాజ్ నోటీసులో పేర్కొన్నట్లుగా తాను ఎలాంటి నేరానికి పాల్పడలేదని ఆమె స్పష్టం చేశారు. ఈ కేసులో తాను ఎవరి శాంతి భంగానికి పాల్పడ్డానో చెప్పాలని ఆమె ప్రశ్నించారు.

PRINTED, PUBLISHED AND OWNED BY K. BHATLA, PRINTED AT SRI LAKSHMI OFFSET PRINTERS, GHANTASALA, VIJAYAWADA, AND PUBLISHED FROM VIJAYAWADA. EDITOR: K. GEETHA. PH: 0866-2620870, R.N.I. NO. APTEL/2009/31961. DATE OF PUBLICATION: 26-10-2026. OFFICE ADDRESS: DOOR NO. 39-10-7, OPP. SWARNA BHARATHI MAHILA KALASALA, ESTATE ROAD, BENZ CIRCLE, VIJAYAWADA - 520 008. EDITOR'S E-MAIL ID: SWARNANDHRA@GMAIL.COM

తెలంగాణ బీజేపీ నేతలకు భన్సల్ క్లాస్ - వినేదెవరు?

తెలంగాణ బీజేపీ నేతల పనితీరు, అలసత్వంపై పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ సునీల్ బన్సల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ఆయన, పార్టీ ముఖ్య నేతలు, పదాధికారులతో నిర్వహించిన అంతర్గత సమావేశాల్లో తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పాలనా వైఫల్యాలు, ప్రతిపక్ష బీఆర్ఎస్ బలహీనతలను తమకు అనుకూలంగా మలుచుకోవడంలో నేతలు ఘోరంగా విఫలమవుతున్నారని బన్సల్ మండిపడ్డారు. ఏ ఒక్కరూ క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజా సమస్యలపై పోరాటం చేయడం లేదని, ఉదయం లేస్తే పార్టీ రాష్ట్ర కార్యాలయం, మీడియా సమావేశాలు, హైదరాబాద్‌లోని ఏసీ గదులకే పరిమితమవుతున్నారని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం హైదరాబాద్ కేంద్రంగా రాజకీయాలు నడుపుతామంటే కుదరదని, వెంటనే పల్లెబాట పట్టి బూత్ స్థాయి కమిటీల బలోపేతంపై దృష్టి సారించాలని హెచ్చరికలు జారీ చేశారు.

బీజేపీ నేతలకు ఈ వార్నింగ్‌లు సరిపోవు

వాస్తవానికి తెలంగాణ బీజేపీ నాయకులకు ఇలాంటి ఢిల్లీ తరహా వార్నింగ్‌లు కొత్తేమీ కాదు. గతంలో బండి సంజయ్ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచి, ఆ తర్వాత కిషన్ రెడ్డి హయాం వరకు.. రాష్ట్రానికి వచ్చిన ప్రతి జాతీయ ప్రధాన కార్యదర్శి, కేంద్ర మంత్రులు ఇదే తరహాలో గడ్డిపెట్టి వెళ్లడం ఒక రొటీన్ తంతుగా మారిపోయింది. స్వయంగా అమిత్ షా, జేపీ నడ్డా వంటి అగ్రనేతలు సైతం నాయకుల అంతర్గత కుమ్ములాటలు, వర్గపోరు మానుకుని ప్రజల్లోకి వెళ్లాలి.. గ్రామాల్లో రాత్రి బస చేయాలి అంటూ ఎన్నోసార్లు మార్గదర్శకాలు ఇచ్చారు. అయితే, ఆ ఆదేశాలు అధిష్ఠానం నేతలు విమానం ఎక్కి ఢిల్లీ చేరేవరకే తప్ప.. క్షేత్రస్థాయిలో అమలైన దాఖలాలు ఎక్కడా కనిపించలేదన్నది కాషాయ శ్రేణులే అంగీకరించే చేదు నిజం.

వర్గపోరు .. ఆధిపత్యపోరాటం


క్షేత్రస్థాయికి వెళ్లకపోవడానికి గల అసలు కారణాలను విశ్లేషిస్తే.. రాష్ట్ర నాయకత్వంలో గూడుకట్టుకున్న తీవ్రమైన వర్గపోరు, ఆధిపత్య పోరాటాలే ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. ఎవరికి వారే సొంత కుంపట్లు పెట్టుకుని, పార్టీ క్యాడర్‌ను కాకుండా తమ వ్యక్తిగత అనుచరగణాన్ని ప్రోత్సహించడంలోనే పోటీ పడుతున్నారు. ప్రజల్లో ఆదరణ పొందేలా ప్రజా సమస్యలపై సమగ్ర కార్యాచరణ రూపొందించడం కంటే.. ఢిల్లీలోని పెద్దల వద్ద పైరవీలు చేసుకుని పదవులు నిలుపుకోవడంపైనే నేతలు ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు. ఫలితంగా, గ్రామీణ ప్రాంతాల్లో అసలైన క్యాడర్ దిక్కుతోచని స్థితిలో పడిపోతుంటే, నేతలు మాత్రం హైదరాబాద్ పరిధి దాటి వెళ్లేందుకు ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు.

తెలంగాణ బీజేపీ నేతల్ని దారిలో పెట్టేదెవరు?

తాజాగా సునీల్ బన్సల్ ఇచ్చిన ఈ హెచ్చరికలు కూడా బూడిదలో పోసిన పన్నీరే అవుతాయన్న అభిప్రాయాలు రాజకీయ విశ్లేషకులతో పాటు పార్టీ ద్వితీయ శ్రేణి శ్రేణుల్లోనూ వ్యక్తమవుతున్నాయి. ఎన్నిసార్లు మొట్టికాయలు వేసినా తెలంగాణ కమలనాథుల తీరు మొదటికే మోసం అన్నట్లుగానే ఉంటుందని, ఇప్పుడు కూడా నేతలు గడప దాటి పల్లెకు వెళ్తారన్న నమ్మకం ఏ కోశానా లేదని స్పష్టమవుతోంది. అధికారమే లక్ష్యమంటూ ఢిల్లీ పెద్దలు ఆశలు పెట్టుకుంటుంటే.. రాష్ట్ర నాయకులు మాత్రం తమ వ్యక్తిగత ఇమేజ్, హైదరాబాద్ కేంద్రిత రాజకీయాలకే ప్రాధాన్యతనిస్తూ పార్టీ భవిష్యత్తును అగమ్యగోచరంగా మారుస్తున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

టీజీ-ఐపాస్‌పై సైబర్ దాడి..

నిలిచిపోయిన పారిశ్రామిక సేవలు



తెలంగాణ ప్రభుత్వానికి చెందిన కీలకమైన టీజీ-ఐపాస్ పోర్టల్‌పై సైబర్ దాడి జరిగింది. రాష్ట్రంలో పారిశ్రామిక అనుమతులను సులభతరం చేసే ఈ 'గవర్నమెంట్ టు బిజినెస్' (జీ2బీ) ప్లాట్‌ఫారమ్ సర్వర్‌ను హ్యాకర్లు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. డేటాబేస్‌ను ఎన్‌క్రిప్ట్ చేయడంతో పోర్టల్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ ఘటనపై 'తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో' (టీజీసీఎస్‌బీ) కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది.అక్టోబరు 22న రాత్రి 11:36 గంటలకు ఈ సైబర్ దాడి జరిగినట్లు అధికారులు గుర్తించారు. పోర్టల్ అప్లికేషన్ పనిచేయకపోవడంతో టెక్నికల్ బృందం వెంటనే రంగంలోకి దిగింది. క్లౌడ్4సీ అనే సంస్థ సహకారంతో సర్వర్‌ను రీస్టార్ట్ చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. లోతుగా పరిశీలించగా.. ఎస్‌క్యూఎల్ సర్వర్ ఏజెంట్ సర్వీస్ ఆగిపోయినట్లు తేలింది. పునరుద్ధరణ ప్రయత్నాలు విఫలమవడంతో ఇది సాధారణ సాంకేతిక సమస్య కాదని, హ్యాకింగ్ జరిగిందని నిర్ధారణకు వచ్చారు.సర్వర్‌లో మెషిన్ ఐడెంటిఫయర్‌తో కూడిన ఒక రాన్‌సమ్‌నోట్ కనిపించింది. హ్యాకర్లు తమ ఈ-మెయిల్ అడ్రస్‌ను కూడా అందులో ఉంచారు. డేటాను తొలగించకుండా, డేటాబేస్‌ను ఎన్‌క్రిప్ట్ చేసి నిలిపివేయడంతో దీనిని రాన్‌సమ్‌వేర్ దాడిగా భావిస్తున్నారు. ఈ ఘటనపై పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ సంగా సురేశ్ శనివారం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు స్వీకరించిన టీజీసీఎస్‌బీ అధికారులు, ఐటీ చట్టంలోని సెక్షన్ 43 (కంప్యూటర్ వ్యవస్థలకు నష్టం), సెక్షన్ 66 (సైబర్ నేరాలు) కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ప్రస్తుతం టీజీ-ఐపాస్ సేవలు అందుబాటులో లేవు. హ్యాకర్లు డేటాను కాపీ చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. డేటాబేస్‌ను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి, సోమవారం నాటికి సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

పట్టభద్రుల ఓట్ల వేట.. ప్రచారంతో కాంగ్రెస్ దూకుడు..

అభ్యర్థులపై బీఆర్ఎస్, బీజేపీ మంతనాలు..



తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల హీట్ పెరుగుతోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం కోసం కాంగ్రెస్ పావులు కదుపుతోంది. దీనిలోభాగంగా మిత్రపక్షాల మద్దతును కూడగడుతోంది. ఇప్పటికేజీఓ సపోర్ట్ తీసుకున్న కాంగ్రెస్ ఇప్పుడు సీపీఐతో చర్చలు జరిపింది. సీపీఐ సానుకూలంగా స్పందించిందని టీపీసీసీ చీఫ్ చెప్పారు. హైదరాబాద్-రంగారెడ్డి- మహబూబ్‌నగర్, నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో గెలుపు కోసం సర్వ శక్తులు ఒడ్డుతోంది అధికార పార్టీ. బీఆర్ఎస్, బీజేపీ ఇంతవరకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులను ప్రకటించకపోవడంపై టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ఇక బీఆర్ఎస్ కూడా వేడి పెంచింది. హైదరాబాద్ వేదికగా మొన్న కాంగ్రెస్ కీలక సమావేశం నిర్వహిస్తే.. లేటెస్టుగా బీఆర్ఎస్ కీలక నేతల భేటీ జరిగింది. తెలంగాణభవన్‌లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన బీఆర్ఎస్ ముఖ్య నేతలు సమావేశం అయ్యారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చించారు. మరోవైపు.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలే లక్ష్యంగా తెలంగాణ బీజేపీ కోర్ కమిటీ సమావేశం నిర్వహించింది. టీ బీజేపీ ఇన్‌చార్జి సునీల్ బన్సల్..పార్టీ నేతలకు వార్నింగ్ ఇచ్చారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో పార్టీ వెనుకబడిందన్నారు బన్సల్. ఎన్‌రోల్‌మెంట్‌పై లీడర్లు, కేడర్ స్పెషల్ ఫోకస్ పెట్టాలని ఆదేశించారు. ఇక ఒక్కో స్థానానికి ముగ్గురు అభ్యర్థులతో కూడిన జాబితాను సిద్ధం చేయనున్నారు.

కృష్ణాజిల్లాలో రోడ్డు ప్రమాదం.. ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు, మహిళ మృతి

విజయవాడ-మచిలీపట్నం హైవేపై ఈ రోజు(ఆదివారం) తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. పలువురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే..పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణాజిల్లాలో జగ్గయ్యపేటకు చెందిన ఓ కుటుంబం.. ఈ రోజు తెల్లవారుజామున స్వగ్రామం నుంచి మోపిదేవికి కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో కారు విజయవాడ-మచిలీపట్నం హైవేపై వెళ్తుండగా.. గుడివాడ ఫ్లైఓవర్ సమీపాన గల పామర్రుకు చేరుకోగానే.. హైవేపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒరుసు చిన్న తిరుపతమ్మ(60) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందగా.. మిగిలిన కుటుంబసభ్యులకు స్వల్పగాయాలయ్యాయి. గమనించిన వాహనదారులు హుటాహుటినా క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.

పాకిస్థాన్ వల్లే కశ్మీరీలు బతుకుతున్నారు

ఫరూఖ్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు



జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా కేంద్ర ప్రభుత్వంపై, స్థానిక యంత్రాంగంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. పాకిస్థాన్ వల్లే కశ్మీరీలు ప్రాణాలతో ఉన్నారని, కశ్మీరీల పట్ల భారత ప్రభుత్వం ఉద్దేశాలు సరిగా లేవని సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్లాలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ సందర్భంగా ఫరూఖ్ అబ్దుల్లా మాట్లాడుతూ.. "అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్ కశ్మీర్ అంశాన్ని లేవనెత్తుతోంది. ఆ దేశం దౌత్య ప్రయత్నాల వల్లే ప్రపంచానికి కశ్మీరీల గొంతు వినిపిస్తోంది. అందుకే జమ్మూకశ్మీర్ ప్రజలు ఇప్పుడు బతికి బట్టకట్టగలుగుతున్నారు" అని అన్నారు.ప్రస్తుత లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పనితీరుపై ఫరూఖ్ నిప్పులు చెరిగారు. ఆరోగ్య రంగానికి సంబంధించిన కీలకమైన ఫైళ్లు ఏడాదికి పైగా లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో చదివిన వైద్య విద్యార్థులు రెండేళ్లపాటు ఆసుపత్రుల్లో పనిచేయాలనే నిబంధన ఉందని, లేకపోతే రూ. 40 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని, ఈ ఫైల్‌పై కూడా ఏడాదిగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని విమర్శించారు. ఒకప్పుడు వైద్య సంస్థల డైరెక్టర్లు, కమిటీలు నియామకాలు, పరికరాల కొనుగోళ్లపై నిర్ణయాలు తీసుకునేవారని, ఇప్పుడు ఆ అధికారాలన్నీ తొలగించారని ఆరోపించారు. "మీరు స్వయం ప్రతిపత్తిని అంతం చేశారు కదా అని నేను ఆయన్ను (లెఫ్టినెంట్ గవర్నర్) అడిగితే, నా ముఖం మీదే ఆయన దాన్ని అంగీకరించారు. ఇక ఢిల్లీ నుంచి ఎలాంటి న్యాయం ఆశించగలం?" అని ఫరూఖ్ పేర్కొన్నారు. ప్రజలు తమ హక్కుల కోసం గొంతు విప్పాలని, ధైర్యంగా వారిని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అలా చేయకపోతే తుడిచిపెట్టుకుపోతామని హెచ్చరించారు.పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. "అధికారం ఉన్నప్పుడే పార్టీతో ఉంటారా? పదవుల కోసం విధేయత చూపవద్దు" అని హితవు పలికారు. తాను ప్రజలకు మాత్రమే కాదని, అల్లాకు కూడా జవాబు చెప్పాల్సి ఉంటుందని, అందుకే ప్రజల ముందు నిజమే మాట్లాడతానని ఫరూఖ్ అబ్దుల్లా స్పష్టం చేశారు.

ఏఐ రంగంలో ప్రస్తుత హడావుడి ఓ బుడగ: జోహో శ్రీధర్ వెంబు



ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో ప్రస్తుత పెట్టుబడుల వాతావరణంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం 'ఏఐ'లో కనిపిస్తున్నది బూమ్ కాదని, అదొక "బబుల్" (బుడగ) అని అభివర్ణించారు. ఈ కారణంగా, తమ సంస్థ భారీ మౌలిక సదుపాయాలపై ఇప్పుడే పెట్టుబడులు పెట్టబోదని ఆయన స్పష్టం చేశారు.అమెరికన్ వెంచర్ క్యాపిటలిస్ట్ చమత్ పాలిహాపిటియ 'ఎక్స్'లో చేసిన ఒక పోస్టుకు శ్రీధర్ వెంబు బదులిచ్చారు. ఏఐ కంపెనీల ఆదాయ నాణ్యతను చామత్ తన పోస్టులో ప్రశ్నించారు. ప్రస్తుతం ఏఐపై ఖర్చు చేస్తున్న వాటిలో అధిక శాతం నష్టాల్లో ఉన్న, వెంచర్ క్యాపిటల్ నిధులతో నడిచే కొన్ని కంపెనీలేనని ఆయన వాదించారు. ఈ నేపథ్యంలో వెంబు తన అభిప్రాయాన్ని పంచుకున్నారు."సాధారణంగా మేం ఇతరుల డబ్బుతో భారీ వ్యాపారాలు చేసే పద్ధతికి దూరంగా ఉంటాం. ఏఐలో మౌలిక పరిశోధన, అభివృద్ధి కోసం మేం పెట్టుబడులు పెడుతున్నాం. అయితే, డేటా సెంటర్లు, ప్రత్యేక హార్డ్‌వేర్ వంటి మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెట్టడానికి ఈ బుడగలాంటి వాతావరణం తగ్గేంత వరకు వేచి చూస్తాం" అని శ్రీధర్ వెంబు తన పోస్టులో పేర్కొన్నారు.శ్రీధర్ వెంబు వ్యాఖ్యలు ఏఐ విషయంలో జోహో భవిష్యత్ వ్యూహాన్ని స్పష్టం చేస్తున్నాయి. మార్కెట్ పరిస్థితులు స్థిరపడే వరకు భారీ ఖర్చులు చేయకుండా, ఏఐ పరిశోధన సామర్థ్యాలను పెంచుకోవడంపైనే దృష్టి సారిస్తామని ఆయన పరోక్షంగా సూచించారు. ఏఐ రంగంలోకి వెల్లువెత్తుతున్న భారీ పెట్టుబడులు స్థిరమైన రాబడిని ఇస్తాయా లేదా అనే అంశంపై టెక్ పరిశ్రమలో విస్తృతంగా జరుగుతున్న చర్చకు వెంబు వ్యాఖ్యలు మరింత బలాన్ని చేకూర్చాయి.

'ఇండియా' కూటమి ర్యాలీ వద్దు.. రూ. 10,000 కోట్ల నష్టం వస్తుంది

రాహుల్ గాంధీకి వ్యాపారుల విజ్ఞప్తి



ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న 'ఇండియా' కూటమి నిర్వహించ తలపెట్టిన భారీ ర్యాలీని వాయిదా వేయాలని వ్యాపార వర్గాలు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని కోరాయి. దీపావళి పండగ సీజన్‌లో ఈ ర్యాలీ నిర్వహిస్తే సుమారు రూ.10,000 కోట్ల మేర వ్యాపార నష్టం వాటిల్లుతుందని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సీటీఐ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్ లేఖ రాశారు.పండగ సీజన్‌ను దృష్ట్యాలో ఉంచుకుని నవంబర్ 10 తర్వాత ర్యాలీని నిర్వహించాలని ఆయన ఆ లేఖలో సూచించారు. నవంబర్ 6న ధంతేరస్, నవంబర్ 8న దీపావళి ఉన్న నేపథ్యంలో కొనుగోళ్ల కోసం ప్రజలు భారీగా మార్కెట్లకు వస్తారని, ఈ సమయంలో ర్యాలీ నిర్వహిస్తే వాణిజ్య కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. దీపావళి పండగ వేళ ఢిల్లీ వ్యాప్తంగా బంగారం, వెండి, ఎలక్ట్రానిక్స్, వస్త్రాలు, గృహోపకరణాలు, డ్రై ఫ్రూట్స్, స్వీట్లు, వాహనాలు, స్థిరాస్తి, గిఫ్ట్ ఆర్టికల్స్ వంటి అన్ని రంగాల్లో కలిపి సుమారు రూ.25,000 కోట్ల మేర వ్యాపారం జరుగుతుందని సీటీఐ అంచనా వేసింది.రామ్‌లీలా మైదానానికి ఐదు కిలోమీటర్ల పరిధిలోనే చాందినీ చౌక్, సదర్ బజార్ వంటి సుమారు 20 హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లు ఉన్నాయని, ర్యాలీ కారణంగా విధించే ట్రాఫిక్ ఆంక్షలతో ఈ ప్రాంతమంతా స్తంభించిపోయే ప్రమాదం ఉందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత అక్టోబర్ మాసంలో సెంట్రల్ ఢిల్లీలో జరిగిన పలు ర్యాలీలు, రహదారుల మూసివేత వల్ల ఇప్పటికే వ్యాపారులు రూ.3,000 కోట్ల వరకు నష్టపోయారని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఓటర్ల జాబితా సవరణలో "ఓట్ల చోరీ" జరిగిందన్న ఆరోపణలతో, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండియా' కూటమి ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. అయితే, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును తాము గౌరవిస్తామని, పండగ సీజన్ ముగిసే వరకు వాణిజ్య ప్రాంతాలకు దూరంగా ర్యాలీలు నిర్వహించాలని సీటీఐ రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేసింది.

నకిలీ జెన్యూనిటీ సర్టిఫికెట్ల కలకలం..

జూనియర్ లెక్చరర్ల విద్యార్హతలపై మళ్లీ విచారణ



తెలంగాణలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న జూనియర్ లెక్చరర్ల విద్యార్హత ధ్రువపత్రాలపై ఇంటర్మీడియట్ విద్యాశాఖ మరోసారి విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టింది. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందినవారిని గుర్తించడంపై అధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం సుమారు 800 మంది లెక్చరర్ల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి కావాల్సి ఉండగా.. వీరిలో ఇతర రాష్ట్రాల విశ్వవిద్యాలయాల నుంచి పీజీ చేసిన సుమారు 250 మంది ధ్రువపత్రాలను ప్రత్యేకంగా తనిఖీ చేస్తున్నారు.

ఇప్పటికే నకిలీ సర్టిఫికెట్లు సమర్పించినట్లు విచారణలో నిర్ధారణ అయిన 50 మందిని సర్వీసు నుంచి తొలగించినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన తనిఖీలను రెండు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2023 ఏప్రిల్‌లో సుమారు 3200 మంది కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేశారు. ఆ సమయంలో విద్యార్హత సర్టిఫికెట్ల పరిశీలన సమగ్రంగా జరగలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం సర్వీసు కన్ఫర్మేషన్ ప్రక్రియలో భాగంగా ధ్రువపత్రాలను మరోసారి పరిశీలిస్తుండటంతో ఈ వ్యవహారం ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల విశ్వవిద్యాలయాల నుంచి దూరవిద్య విధానంలో పొందిన పీజీ సర్టిఫికెట్ల ప్రామాణికతపై అధికారులు దృష్టి సారించారు.కొంతమంది లెక్చరర్లు సమర్పించిన విద్యార్హత పత్రాలపై అనుమానాలు వ్యక్తం కావడంతో సంబంధిత విశ్వవిద్యాలయాల నుంచి జెన్యూనిటీ సర్టిఫికెట్లు తీసుకురావాలని అధికారులు సూచించారు. అయితే, కొందరు విశ్వవిద్యాలయాల పేరుతో నకిలీ లెటర్‌హెడ్లు, స్టాంపులను ఉపయోగించి ధ్రువీకరణ పత్రాలు తయారు చేయించి సమర్పించినట్లు తనిఖీల్లో గుర్తించినట్లు సమాచారం. దీంతో ఇంటర్మీడియట్ విద్యాశాఖ సంబంధిత విశ్వవిద్యాలయాలకు లేఖలు రాసి సర్టిఫికెట్ల నిజానిజాలను నిర్ధారించాలని కోరింది. స్పందన రాని కొన్ని చోట్లకు ప్రత్యేక బృందాలను పంపి వివరాలు సేకరించింది. కొన్ని విశ్వవిద్యాలయాలు తాము ఆ సర్టిఫికెట్లను జారీ చేయలేదని, మరికొన్ని తమ వద్ద సంబంధిత కోర్సులే లేవని తెలిపినట్లు అధికారులు గుర్తించారు. విశ్వవిద్యాలయాల నుంచి అందుతున్న నివేదికలు, ఇతర ఆధారాల ఆధారంగా ఇప్పటివరకు 50 మందిపై చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన సర్టిఫికెట్ల పరిశీలనను రెండు నెలల్లో పూర్తి చేసి, నకిలీ పత్రాలు సమర్పించినట్లు నిర్ధారణ అయినవారిపై సర్వీసు పరమైన చర్యలతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశముంది. అయితే.. ప్రతి కేసులోనూ సంబంధిత ధ్రువపత్రాల ప్రామాణికతను అధికారికంగా నిర్ధారించిన తర్వాతే తుది చర్యలు తీసుకోనున్నారు.కాంట్రాక్టు నుంచి రెగ్యులరైన లెక్చరర్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కొనసాగుతోందని ఇంటర్మీడియట్ విద్యాశాఖ డైరెక్టర్ అభిలాష అభినయ్ తెలిపారు. పూర్తిస్థాయి ఆధారాలు సేకరించిన తర్వాత షోకాజ్ నోటీసులు జారీ చేసి.. నిబంధనల ప్రకారం సర్వీసు నుంచి తొలగింపు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇంకా సుమారు 800 మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి కావాల్సి ఉందని, రెండు నెలల్లో ఈ ప్రక్రియను ముగిస్తామని వెల్లడించారు. నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందినవారు ఉన్నట్లు తేలితే వారిని సర్వీసు నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు.

కొత్త ప్రాజెక్ట్‌పై 'కాంతార' బ్యూటీ రుక్మిణి ఎమోషనల్ పోస్ట్



కన్నడ యువ నటి రుక్మిణి వసంత్ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ముఖ్యంగా 'కాంతార: చాప్టర్ 1'లో అవకాశం దక్కించుకున్న తర్వాత దక్షిణాది సినీ పరిశ్రమలో, ప్రత్యేకించి టాలీవుడ్‌లో ఆమెకు విపరీతమైన ఆదరణ పెరిగింది. ఈ క్రమంలోనే ఆమె తాజాగా ఒక కొత్త తెలుగు చిత్రానికి సంతకం చేసింది. 'ఒకే ఒక జీవితం' చిత్రంతో ఆకట్టుకున్న శ్రీ కార్తీక్ ఈ సినిమాలో కథానాయకుడిగా నటిస్తున్నాడు. ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడిస్తూ, చిత్రబృందం ఒక చిన్న గ్లింప్స్‌ను కూడా విడుదల చేసింది.ఈ కొత్త ప్రాజెక్ట్ గురించి రుక్మిణి వసంత్ సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగపూరితమైన పోస్ట్‌ను పంచుకుంది. "తొలిసారి కథ విన్నప్పటి నుంచే ఈ సినిమాపై మా బృందంలో ఎంతో ఉత్సాహం నెలకొంది. సెట్‌లోకి అడుగుపెట్టే ప్రతి క్షణం ఎంతో ఉత్కంఠగా అనిపించింది. ఈ సానుకూల వాతావరణం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. మొదటి రోజు నుంచే మాలో ఈ ఉత్సాహాన్ని నింపిన చిత్రబృందానికి కృతజ్ఞతలు. ఇలాంటి మరిన్ని అద్భుతమైన అనుభవాలు ఎదురుకావాలని ఆశిస్తున్నాను" అని ఆమె పేర్కొంది. ఈ సందర్భంగా షూటింగ్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలను కూడా ఆమె షేర్ చేసింది.ఈ చిత్రంలో రుక్మిణి 'తార' అనే కీలక పాత్రలో కనిపించనుంది. మ్యాడ్ బాయ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, సిరుజి సినీ కార్పొరేషన్ బ్యానర్లపై మిసాయ్ కృష్ణ, దేవ్ రామ్‌నాథ్, శ్రీ కార్తీక్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన పవర్‌ఫుల్ టైటిల్‌ను ప్రకటించనున్నట్లు సమాచారం.


ఆ పాన్ ఇండియా సినిమా నుంచి నిర్మాత ఔట్..

రిలీజ్ అవ్వడం డౌటే..



ఇప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలో ఒక మోస్తరు బడ్జెట్ తో నిర్మితమయ్యే సినిమాలు మొత్తం పాన్ ఇండియా లెవెల్ లోనే ఉంటున్నాయి. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో కచ్చితంగా విడుదల చేయడాన్ని మేకర్స్ అలవాటుగా మార్చుకున్నారు. అన్ని ప్రాంతాల చెందిన నటులను పెట్టుకోవడం.. మార్కెటింగ్ చేసుకోవడం.. ప్రమోషన్లు నిర్వహించడం.. పరిపాటిగా మారిపోయింది.పాన్ ఇండియా లెవెల్ లో తీసిన సినిమాలలో అన్నింటికీ బీభత్సమైన కలెక్షన్లు రావడం లేదు. ఇందులో కొన్ని సినిమాలు మాత్రమే విజయవంతమవుతున్నాయి. ఇక తెలుగులో మీడియం బడ్జెట్ హీరోలు.. హై రేంజ్ హీరోలు .. తమ సినిమాలకు పాన్ ఇండియా ముద్ర వేయడం ఇటీవల కాలంలో పెరిగిపోయింది అయితే ఇప్పుడు తెలుగులో ఓ పాన్ ఇండియా సినిమా చుట్టు విస్తృతమైన చర్చ నడుస్తోంది. ఈ సినిమాను ఇద్దరు నిర్మాతలు కలిసి నిర్మించారు. ఈ సినిమాలో బై లింగ్వల్ హీరోగా గుర్తింపు ఉన్న స్టార్ నటించారు. పెద్ద దర్శకుడు రూపొందించారు. సినిమా షూటింగ్ పూర్తయింది. విడుదలకు సిద్ధమైంది. ఈ తరుణంలో అనూహ్యమైన పరిణామం జరిగింది.ఈ ప్రాజెక్టులో ఇప్పటివరకు ఒక నిర్మాత పేరు కనిపించింది. ఇప్పుడు సినిమా విడుదలకు సంబంధించిన పోస్టర్లలో.. న్యూస్ ఆర్టికల్స్ లో ఆయన పేరు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఆ ప్రాజెక్టు నుంచి నిర్మాత తప్పుకున్నారా.. అనే ప్రచారం నడుస్తోంది. లేదా తెర వెనుక ఏదైనా జరుగుతోందా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ఈ వ్యవహారం వెనుక ఒక ఇంట్రెస్టింగ్ స్టోరీ ఉందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఒక ప్రొడ్యూసర్.. ఫిల్మ్ మేకర్ తో పాటు ఒక నిర్మాతకు సంబంధించి చేసిన కామెంట్స్ ఇండస్ట్రీలో చర్చకు దారి తీస్తున్నాయి. ఆ నిర్మాత మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో మంటలు పుట్టించాయి. దీంతో ఆ మాటలు వెనుక ఉన్న ప్రభావం ఈ ప్రాజెక్టు మీద పడుతోందని సమాచారం.ఆ ఫిల్మ్ మేకర్ నుంచి వచ్చే సినిమాలో విడుదల విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతుంది. ఈ ప్రాజెక్టులోకి వచ్చిన ప్రొడ్యూసర్ ఎటువంటి ప్రత్తిని ఎదుర్కోవాల్సి వస్తుందని ఒత్తిడి పెరిగిపోయింది. ఇలాంటి పరిణామాల మధ్య ఉన్నటువంటి ఆ ప్రొడ్యూసర్ పేరు కనిపించడం లేదు. ఇప్పుడు ఆ సినిమా విడుదల బాధ్యతలను మరో నిర్మాత భుజాలకు ఎత్తుకున్నారా.. లేక ఈ పేరు మార్పు వెనుక ఇంకా ఏమైనా జరుగుతోందా.. మొత్తానికి ఇదంతా కూడా ఒక సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాను తలపిస్తోంది. ఒకవేళ ఈ సినిమా గనుక సొంతంగా విడుదల చేస్తే.. ఆ నిర్మాత ఎటువంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందో తెలియడం లేదు.. వాస్తవానికి ఆ నిర్మాత పేరును ఎందుకు పక్కన పెట్టారు.. ఇది కేవలం చర్చ కోసం తీసుకున్న నిర్ణయమా.. ఇంకా ఏదైనా జరుగుతోందా.. ఈ ప్రశ్నలకు సమాధానం మరి కొద్ది రోజుల్లో తెలుస్తుంది.

సరైన అవకాశం కోసం ఎదురుచూడొద్దు : నటి తమన్నా



సరైన అవకాశం కోసం ఎదురుచూడటం అనేది అతిపెద్ద అబద్ధమని ప్రముఖ నటి తమన్నా అన్నారు. విజయం సాధించాలంటే వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలే కానీ... పరిపూర్ణమైన అవకాశం వస్తుందని ఎదురుచూస్తూ కూర్చోకూడదని ఆమె స్పష్టం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ ప్రయాణం గురించి తమన్నా ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.తాను ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినప్పుడు గొప్ప నటిని కానీ, అద్భుతమైన డ్యాన్సర్‌ను కానీ కాదని తమన్నా గుర్తుచేసుకున్నారు. పరిశ్రమలోకి వచ్చాక అనుభవం ద్వారానే ప్రతి విషయాన్ని నేర్చుకున్నానని తెలిపారు. ఏదైనా కొత్త విషయం నేర్చుకోవడానికి, దాన్ని ఆచరణలో పెట్టడమే ఉత్తమ మార్గమని ఆమె అభిప్రాయపడ్డారు.జీవితంలో మనం చేసే ప్రతి పని ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్పుతుందని, అది మన కెరీర్‌ను తదుపరి స్థాయికి తీసుకెళ్లడంలో సహాయపడుతుందని వివరించారు. ఖాళీగా కూర్చొని మంచి అవకాశం కోసం ఎదురుచూసే బదులు, దొరికిన అవకాశాలను ఉపయోగించుకోవాలని, అదే నిజమైన విజయ రహస్యమని తమన్నా పేర్కొన్నారు. ప్రస్తుతం తమన్నా సినిమాలు, ఓటీటీ వెబ్ సిరీస్‌లతో కెరీర్‌లో చురుగ్గా కొనసాగుతున్నారు.

రాకింగ్ స్టార్ డైలమాలో ఉన్నాడా?



-కేజీఎఫ్- సిరీస్‌తో పాన్ ఇండియా లో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రాకింగ్ స్టార్ యశ్ కెరీర్‌లో కీలకమైన మలుపులో ఉన్నారు. -కేజీఎఫ్ 2- వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత యశ్ ఏ దర్శకుడితో సినిమా చేస్తారనే దానిపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఆ అంచనాల మధ్య మలయాళ మూలాలున్న లేడీ డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో -టాక్సిక్- సినిమాను అనౌన్స్ చేయడం.. ఆ ప్రాజెక్ట్ తెరపైకి రావడం జరిగి పోయాయి. భారీ అంచనాల నడుమ విడుదలైన సినిమా ఆశించిన స్థాయిలో బాక్సాఫీస్ వద్ద మ్యాజిక్ చేయలే కపోవడంతో యశ్ తదుపరి సినిమాల ఎంపికపై సందిగ్ధత నెలకొంది. గీతూ మోహన్‌దాస్‌పై నమ్మకంతో భారీ బడ్జెట్‌తో తెరకెక్కించిన -టాక్సిక- ఫలితం ఆశించిన విధంగా రాకపోవడంతో, రాకింగ్ స్టార్ ఆలోచనా విధానంలో మార్పు వచ్చినట్లు తెలుస్తోంది. క్రియేటివ్ అప్రోచ్‌కు వెళ్లాక జరిగే రిస్క్ ఏంటో? ఈ అనుభవంతో యశ్‌కు క్లారిటీ వచ్చింది. దీంతో తదుపరి చిత్రాల విషయంలో ఎలాంటి ప్రయోగాలు చేయకుండా ఆచితూచి అడుగులు వేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా దర్శకుల ఎంపిక విషయంలో యశ్ గందరగోళంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో యశ్ తదుపరి సినిమాల కోసం ఎవరిని ఎంచుకోవాలనే దానిపై మల్లగుల్లాలు పడుతున్నారుట. మళ్లీ సొంత పరిశ్రమ అయిన కన్నడ దర్శకులకే ప్రాధాన్యత ఇవ్వాలా? లేక కమర్షియల్ మాస్ సినిమాలను అద్భుతంగా డీల్ చేయడంలో పేరున్న టాలీవుడ్ దర్శకులతో పని చేయాలా? అనే మీమాంసలో పడ్డారుట. కన్నడ నేల నుంచి పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగినా? టాలీవుడ్ ఇస్తున్న సపోర్ట్.. ఇక్కడి డైరెక్టర్ల బాక్సాఫీస్ విజన్ రీత్యా టాలీవుడ్ వైపు మొగ్గు చూపడం బెటర్ అనే ఆలోచనలో యశ్ ఉన్నట్లు సమాచారం. టాలీవుడ్ దర్శకులు కమర్షియల్ ఎలిమెంట్స్‌ను, మాస్ మానియాని ఎలివేట్ చేసే తీరు పాన్ ఇండియా ప్రేక్షకులకు నచ్చుతుంది. యశ్ లాంటి హై-వోల్టేజ్ మాస్ ఇమేజ్ ఉన్న హీరోకి తెలుగు టెక్నీషియన్లు .. డైరెక్టర్లు అయితేనే సరైన జస్టిఫికేషన్ చేయగలరని యశ్ సన్నిహితులు కూడా సలహా ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొందరు టాలీవుడ్ టాప్ డైరెక్టర్లు యశ్‌కు కథలను వినిపించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే కన్నడ ఆడియెన్స్ నమ్మకాన్ని నిలబెట్టాలనే బాధ్యత కూడా ఆయనపై ఉండటంతో ఏ నిర్ణయం తీసుకోవాలో? తెలియక సతమతమవుతున్నారు. గీతూ మోహన్‌దాస్‌తో చేసిన ప్రయోగం వికటించడంతో ఇకపై పంథాను మార్చుకోవాలని యశ్ డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. ప్రయోగాల కంటే పక్కా కమర్షియల్ అండ్ యాక్షన్ ఓరియెంటెడ్ స్క్రిప్ట్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నారు. అందుకే కన్నడ నాట కొత్త టాలెంట్‌ను నమ్ముతారా? లేక తెలుగు బాట పట్టి టాలీవుడ్ స్టార్ డైరెక్టర్లతో భారీ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేస్తారా? అనేది సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

గరివిడి లక్ష్మి తో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కొత్తగా.. దీని వెనుక ఉన్నది ఎవరంటే..





పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన గరివిడి లక్ష్మి సినిమా హిట్ టాక్ తెచ్చుకుంది. బుర్రకథ నేపథ్యంలో వచ్చిన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలు పొందింది. రాజా సాబ్ లాంటి ఫ్లాప్ తర్వాత పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఒకరకంగా ఆలోచనలో పడింది. ఆ తర్వాత చాలా గ్యాప్ తీసుకుని గరివిడి లక్ష్మి సినిమాను తెరమీదకి తీసుకొచ్చింది ఈ సినిమా ప్రారంభం నుంచి చివరిదాకా ఆకట్టుకునేలా ఉంది. అంతేకాదు, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ స్థాయిని పెంచింది.పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సినిమా నిర్మాణాన్ని ఒక ఉద్యమం లాగా చేపట్టేందుకు ముందుకు వచ్చింది. అందువల్లే తాను ఈ సంస్థను ప్రారంభించినట్టు టీజీ విశ్వప్రసాద్ అనేక సందర్భాలలో వెల్లడించారు. వంద చిత్రాలు నిర్మించాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. అంతే వేగంతో సినిమాలను వరుసగా నిర్మించుకుంటూ వచ్చారు.. కొన్ని సినిమాలు ఆయన సంస్థ స్థాయిని నిలబడ్డాయి. మరికొన్ని సినిమాలు ఇబ్బందికరంగా మారాయి. మేకింగ్.. కథల ఎంపిక వంటి వ్యవహారాలలో నిర్మాణ సంస్థకు నిలకాడ లేదు అనే అభిప్రాయాలు వినిపించాయి. కొన్ని ప్రాజెక్టులలో దారుణమైన లోపాలు కనిపించిన నేపథ్యంలో విశ్వప్రసాద్ నిర్మాణ విధానాలను పూర్తిగా మార్చివేయాలని అనుకున్నారు. అంతేకాదు కొత్త దిశలో వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలోనే విశ్వప్రసాద్ తన కుమార్తె కృతి ప్రసాద్ కు బాధ్యతలు అప్పగించినట్టు తెలుస్తోంది.కృతి ప్రసాద్ అమెరికాలో పెరిగారు. అక్కడే చదువుకున్నారు. వేగంగా గరివిడి లక్ష్మి లాంటి బుర్రకథ సాంప్రదాయ కళారూపం నేపథ్యమున్న సినిమాను రూపొందించారు. ఫలితంగా ఆ సినిమా స్థిరంగా కలెక్షన్లు వసలూ చేస్తోంది.

గరివిడి లక్ష్మి సినిమా కమర్షియల్ ఫార్మాట్ కు పూర్తిగా దూరంగా ఉంది. భారీ స్టార్ ఎట్రాక్షన్ లేదు. హంగులు లేవు. ఆర్భాటలు అంతకంటే లేవు. ఒక జానపద కళాకారిణి జీవితంలో సంఘర్షణకు ఈ సినిమాలో ప్రాధాన్యం ఇచ్చారు. దర్శకుడు గౌరీ నాయుడు.. కథానాయక ఆనంది.. ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లారు..వాస్తవానికి ఇలాంటి బయోపిక్ ను సినిమాగా రూపొందించాలి అంటే ధైర్యం ఉండాలి. ఇందులో కమర్షియల్ ఎలిమెంట్స్ కు అవకాశం ఉండదు. అయినప్పటికీ కృతి ప్రసాద్ ఈ కథను ఎంచుకున్నారు. దర్శకుడికి పూర్తిస్థాయిలో స్వేచ్ఛ ఇచ్చారు. నిర్మాణ సహకారాన్ని అందించారు తద్వారా సినిమాను గొప్పగా మలిచారు. కృతి ఆలోచనలు ఈ సినిమాలో ప్రతి ఫ్రేమ్లో కనిపిస్తూ ఉంటాయి.పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి బలమైన ఆర్థిక నేపథ్యం ఉంది. బడ్జెట్ కేటాయింపు విషయంలో సంస్థ ఏమాత్రం కాంప్రమైజ్ కాదు. దర్శకులకు అవకాశం ఇవ్వడం మాత్రమే కాదు.. వారి దగ్గర నుంచి ప్రాపర్ అవుట్ పుట్ తీసుకోవడం కూడా ముఖ్యమే. అందువల్లే కృతి పీపుల్ మీడియా ఫ్యాక్టరీలోకి ఎంట్రీ ఇచ్చారు. తండ్రికి తగ్గ కూతురని నిరూపించుకున్నారు. గరివిడి లక్ష్మి సినిమా ద్వారా సంస్థ గౌరవాన్ని మరింత పెంచారు. కృతి ప్రసాద్ వచ్చారు కాబట్టి సంస్థలో వెంటనే మార్పులు జరిగిపోతాయి అనుకోవడం కంటే.. మార్పులు మొదలయ్యాయి అని చెప్పడం ఉత్తమం. అయితే కృతి ప్రసాద్ వచ్చే రోజుల్లో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించే ఇతర సినిమాల్లో కూడా ఎంట్రీ ఇస్తారా.. లేదా తన అభిరుచికి తగ్గట్టు మాత్రమే సినిమాలు నిర్మిస్తారా.. అనే ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్పాలి

ప్రభాస్ బర్త్ డే నాడు.. మైత్రి మూవీస్ కు షాక్ ఇచ్చిన వైజయంతి మూవీస్..



నేడు డార్లింగ్ ప్రభాస్ పుట్టిన రోజు. బాహుబలి సినిమా తర్వాత ప్రభాస్ రేంజ్ ఎక్కడికో వెళ్లిపోయింది. బాహుబలి1, 2 తర్వాత సాహో.. రాధే శ్యామ్, కల్కి, సలార్, ఆది పురుష్, రాజా సాబ్ వంటి సినిమాల్లో ప్రభాస్ కనిపించారు. తన మార్కెట్ రేంజ్ ను ఎక్కడికో తీసుకెళ్లారు. తనతో సినిమా అంటే వసూళ్ల వందల కోట్లు అనే లెక్క అనే బెంచ్ మార్క్ ను ప్రభాస్ సృష్టించుకున్నారు.సాధారణంగా ప్రభాస్ జన్మదినమంటే ఆయన చిత్రాలకు సంబంధించి అప్డేట్స్ విడుదలవుతుంటాయి. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో కల్కి 2, ఫౌజీ, స్పిరిట్, సలార్ 2(ఇంకా షూటింగ్ మొదలవలేదు) వంటి సినిమాలు ఉన్నాయి.

ఇవన్నీ కూడా భారీ బడ్జెట్ తో తీసే సినిమాలు. ఈ సినిమాలన్నిటిమీద అభిమానులకు విపరీతమైన అంచనాలు ఉన్నాయి. పైగా ఈ సినిమాలలో కల్కి.. సలార్ మొదటి పార్ట్ లు విడుదలై.. భారీ విజయాలను నమోదు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమాలకు సంబంధించి అప్డేట్స్ ఇస్తారని అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.అయితే ఇటీవల ఫౌజీ సినిమాకు సంబంధించి మైత్రి మూవీ మేకర్స్ ఒక కీలకమైన విషయాన్ని ప్రకటించారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన దొంగ నా కొడుకు సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్లో ప్రభాస్ సినిమాకు సంబంధించి అప్డేట్ ఇస్తామని వెల్లడించారు. కానీ ఇంతవరకు ఆ నిర్మాణ సంస్థ నుంచి అప్డేట్ రాలేదు. బహుశా సాయంత్రం వరకు వచ్చే అవకాశం ఉంది. అయితే మైత్రి కంటే ముందుగానే వైజయంతి మూవీస్ ప్రభాస్ అభిమానులకు దిమ్మ తిరిగిపోయే కానుక ఇచ్చింది. ప్రభాస్ జన్మదినమైన అక్టోబర్ 23 ఉదయమే కల్కి రెండవ భాగానికి సంబంధించి ఒక చిన్న వీడియోను విడుదల చేసింది.ఈ వీడియోలో ప్రభాస్ 6 అడుగుల ఆజానుబాహుడిలాగా దర్శనమిస్తున్నారు. భైరవ పాత్ర ఎలా ఉంటుందో దర్శకుడు నాగ్ అశ్విన్ 30 సెకండ్ల నిడివి ఉన్న వీడియోలో చూపించారు. ప్రభాస్ ఎత్తైన జుట్టు.. అదే స్థాయిలో కాస్ట్యూమ్ తో కనిపించారు. పైగా ప్రభాస్ ఈ పాత్ర కోసం బరువు తగ్గినట్టు తెలుస్తోంది. అందువల్లే ఆయన చాలా యంగ్ గా కనిపిస్తున్నారు. ఇప్పటికే కల్కి మొదటి భాగం అద్భుతమైన విజయాన్ని అందుకుంది. మొదటి భాగంలో ప్రభాస్ పాత్ర అభిమానులు ఆశించిన స్థాయిలో లేదు అనే విమర్శలు వచ్చాయి. అయితే రెండవ భాగంలో మాత్రం ప్రభాస్ కేంద్రంగానే కథ సాగుతుందని డార్లింగ్ అభిమానులకు నాగ్ అశ్విన్ ఇండికేషన్ ఇచ్చారు. మొత్తానికి డార్లింగ్ అభిమానులు ఆయన పుట్టినరోజు సందర్భంగా కాలర్ ఎగరేసే విధంగా ట్రీట్ ఇచ్చింది వైజయంతి మూవీస్. మరి ఈ విషయంలో మైత్రి మూవీస్ ఎటువంటి వీడియో విడుదల చేస్తుంది.. డార్లింగ్ అభిమానులకు ఎలాంటి ట్రీట్ ఇవ్వబోతోంది.. అనేది చూడాల్సి ఉంది.

సిలిండర్ ధర రూ.7,000..

ఇరాన్ సరిహద్దు మూసివేతతో పాక్‌లో కష్టాలు



పాకిస్థాన్‌లో 12 కిలోల గ్యాస్ సిలిండర్ ధర రూ.7,000. ఇరాన్ సరిహద్దును మూసివేయడంతో ఎల్‌పీజీ సరఫరా నిలిచిపోయింది. కొన్ని ప్రాంతాల్లో రూ.8,200 వరకు పలుకుతోంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పాకిస్థాన్ ప్రజలకు గ్యాస్ ధరల పెరుగుదల భారంగా మారింది. ఇంతకీ అక్కడ ఏం జరిగింది? గ్యాస్ ధరలు ఇంతలా పెరగడానికి కారణమేంటి?

ఇరాన్‌తో సరిహద్దు మూసివేత

పాకిస్థాన్‌కు ప్రతిరోజూ ఇరాన్ నుంచి సుమారు 7,000 మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీని దిగుమతి అవుతుంది. అయితే, గాబ్డ్–రిమ్దాన్, తఫ్తాన్ ఈ రెండు ప్రధాన సరిహద్దు మార్గాలను అక్టోబర్ 17న మూసివేశారు. దీంతో ఇరు దేశాల మధ్య సరుకుల రవాణాకు ఆటంకం ఏర్పడింది. ముఖ్యంగా ఎల్పీజీ సరఫరా నిలిచిపోవడంతో పాకిస్థాన్‌లో గ్యాస్ కొరత పెరిగింది. సరిహద్దు మార్గాల మూసివేతకు రెండు దేశాలు వేర్వేరు కారణాలు చెబుతున్నాయి. భద్రతా సమస్యలు, అక్రమ రవాణాను అరికట్టేందుకు బలూచిస్థాన్ ప్రావిన్స్ ప్రభుత్వం తాత్కాలికంగా ఈ నిర్ణయం తీసుకుంది. మరోవైపు, సాంకేతిక సమస్యల కారణంగా సరిహద్దు మార్గాలను ఇరాన్ మూసివేసింది.

సిలిండర్ ధర రూ.4,500 నుంచి రూ.7,000

సరఫరా తగ్గిపోవడంతో పాకిస్థాన్‌లో ఎల్‌పీజీ ధరలు భారీగా పెరిగాయి. గతంలో 4,500 పాకిస్థానీ రూపాయలుగా ఉండే 12 కిలోల గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.7,000కు చేరింది. కొద్ది రోజుల్లోనే సిలిండర్ ధర దాదాపు రెట్టింపైంది. సరఫరాలో అంతరాయాలు కొనసాగితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. గాబ్డ్–రిమ్దాన్ సరిహద్దు మార్గం ద్వారానే రోజుకు 4,000 మెట్రిక్ టన్నులకు పైగా ఎల్పీజీ పాకిస్థాన్‌లోకి వస్తోంది. ప్రస్తుతం ఈ దిగుమతులు నిలిచిపోయాయని గ్వాదర్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు షంసుల్ హక్ వెల్లడించారు.

ఒక్కో ప్రాంతంలో ఒక్కో ధర..

పాకిస్థాన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే వేర్వేరు ధరలకు గ్యాస్ విక్రయిస్తున్నారు. సరఫరా కొరత కారణంగా వినియోగదారులు అధిక ధరలు చెల్లించాల్సి వస్తోంది. బలూచిస్థాన్‌లో రూ.7,000, లాహోర్‌లో రూ.7,500, స్కర్దూలో రూ.8,200గా ఉంది. గతంలో 12 కిలోల ఎల్పీజీని రూ.250కు కొనుగోలు చేసేవాడినని, ఇప్పుడు రూ.500 నుంచి రూ.600 వరకు చెల్లించాల్సి వస్తోందని లాహోర్‌కు చెందిన ఫర్హాత్ అబ్బాస్ ఇబ్బందులను వివరించాడు.

సరిహద్దుల్లో చిక్కుకుపోయిన వందలాది ట్రక్కులు

సరిహద్దు మూసివేతతో గ్యాస్ సరఫరా మాత్రమే కాకుండా, ఇతర వస్తువుల రవాణా కూడా దెబ్బతింది. వందలాది ట్రక్కులు, ఎల్‌పీజీ ట్యాంకర్లు సరిహద్దులకు ఇరువైపులా నిలిచిపోయాయి. ఇరాన్‌కు పంపాల్సిన బంగాళాదుంపలు, అరటిపండ్లు, బియ్యంతో 1,000కు పైగా పాకిస్థాన్ కంటైనర్లు నిలిచిపోయాయి. పాడైపోయే అవకాశం ఉన్న వస్తువులను పాకిస్థాన్ నుంచి ఎగుమతి చేసేందుకు బుధవారం గాబ్డ్–రిమ్దాన్ సరిహద్దు మార్గాన్ని తిరిగి తెరిచారు. అయితే, ఎల్పీజీ దిగుమతులు ప్రారంభం కాలేదు. సరిహద్దుల వద్ద చిక్కుకుపోయిన ట్రక్కు డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస సదుపాయాలు లేని పరిస్థితుల్లో రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని చెబుతున్నారు. సరిహద్దు తెరుచుకుంటుందని ఎదురుచూస్తూ వారం రోజులకు పైగా అక్కడే ఉన్నట్లు ఓ డ్రైవర్ అబ్దుల్ ఘనీ బలూచ్ ఆవేదన వ్యక్తం చేశాడు.

చలికాలం సమీపిస్తుండటంతో ఆందోళన

పాకిస్థాన్‌లో చలికాలం సమీపిస్తుండటంతో గ్యాస్ కొరతపై ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. వంట అవసరాలతో పాటు ఇతర అవసరాల కోసం ఎల్పీజీపై ఆధారపడే కుటుంబాలకు ధరల పెరుగుదల భారంగా మారింది. గ్యాస్ ధరలు పెరగడం వల్ల ఇతర వస్తువుల ధరలు కూడా పెరిగాయనీ వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. సరిహద్దు సమస్యలు పరిష్కారం కాకపోతే రానున్న రోజుల్లో గ్యాస్ కొరత మరింత తీవ్రమవుతుందని పాకిస్థాన్ ఎల్పీజీ అసోసియేషన్ అధ్యక్షుడు ఇర్ఫాన్ ఖోఖర్ హెచ్చరించారు.

పాకిస్థాన్-ఇరాన్ వాణిజ్యంపైనా ప్రభావం

పాకిస్థాన్, ఇరాన్ మధ్య సరిహద్దు సమస్యలు ఇరు దేశాల వాణిజ్య సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయి. ఫెడరేషన్ ఆఫ్ పాకిస్థాన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ గణాంకాల ప్రకారం.. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇరు దేశాల మధ్య మొత్తం వాణిజ్యం సుమారు 2.8 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇందులో పాకిస్థాన్ నుంచి జరిగిన ఎగుమతుల విలువ సుమారు 684 మిలియన్ డాలర్లు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఈ వారంలో ఇరాన్‌లో పర్యటించి అక్కడి నాయకులతో సరిహద్దు సమస్యలపై చర్చించనున్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని తిరిగి ప్రారంభించేందుకు సంప్రదింపులు జరుపుతున్నామని ఇరాన్ విదేశాంగ శాఖ తెలిపింది.

ఫ్రాన్స్‌లో భారీ భద్రతా ఏర్పాట్లు..

70 వేల మంది పోలీసుల మోహరింపు

ఫ్రాన్స్‌లో మరోసారి హింస చెలరేగకుండా అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. జీవన వ్యయం పెరుగుదలను నిరసిస్తూ శనివారం ఆందోళనకారులు వీధుల్లోకి రానున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా 70 వేల మంది పోలీసు సిబ్బందిని మోహరించనున్నారు. పారిస్‌లోని లూవ్రే సహా పలు ప్రధాన మ్యూజియంలను మూసివేయనున్నారు. గత వారం నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఆందోళనకారులు నిప్పు పెట్టడం, ప్రభుత్వ భవనాల్లోకి చొరబడటం, దుకాణాల అద్దాలు పగలగొట్టడం, దోపిడీలకు పాల్పడటం, పోలీసులతో ఘర్షణ పడటం వంటి ఘటనలకు దిగారు. కొన్నేళ్లలో ఫ్రాన్స్‌లో చోటుచేసుకున్న అత్యంత తీవ్రమైన అల్లర్లుగా వీటిని పేర్కొంటున్నారు. జీవన వ్యయం భారంగా మారడాన్ని నిరసిస్తూ శనివారం మరోసారి ప్రదర్శనలు నిర్వహించేందుకు ఆందోళనకారులు సిద్ధమయ్యారు. విద్యార్థులు, సీజీటీ కార్మిక సంఘం సభ్యులు, 2018--2019లో సామాజిక అన్యాయానికి వ్యతిరేకంగా ఫ్రాన్స్‌ను కుదిపేసిన 'ఎల్లో వెస్ట్' ఉద్యమ కార్యకర్తలు ఈ నిరసనల్లో పాల్గొననున్నారు. భద్రతా కారణాలతో లియోన్, నీస్, మాంట్‌పెల్లియర్ సహా పలు నగరాల్లో కొన్ని నిరసనలకు అధికారులు అనుమతి నిరాకరించారు. అయినప్పటికీ పారిస్, మార్సెయి సహా అనేక ప్రాంతాల్లో ప్రదర్శనలు జరిగే అవకాశం ఉంది

70 వేల మంది పోలీసులతో భద్రత...

శనివారం 70 వేల మంది పోలీసులు, జెండార్మరీ సిబ్బందిని రంగంలోకి దించనున్నట్లు ఫ్రాన్స్ అంతర్గత వ్యవహారాల మంత్రి లారెంట్ నూనెజ్ తెలిపారు. హెలికాప్టర్లు, సాయుధ వాహనాలు, వాటర్ క్యానన్లను కూడా సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. నగర పాలక సంస్థల కార్యాలయాల వంటి ప్రభుత్వ భవనాల వద్ద భద్రత కోసం ప్రత్యేక పోలీసు బృందాలను మోహరించనున్నట్లు వెల్లడించారు. పరిస్థితులకు అనుగుణంగా వేగంగా స్పందించేలా భద్రతా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. "హింస, విధ్వంసానికి పాల్పడాలని తీవ్ర వామపక్ష సంస్థలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా పిలుపునిస్తున్నాయి. దుకాణాలను దోచుకోవాలనే పిలుపులు కూడా మళ్లీ వినిపిస్తున్నాయి. అల్లర్లకు పాల్పడుతున్నవారే ఈ సందేశాలను వ్యాప్తి చేస్తున్నారు" అని నూనెజ్ విలేకరుల సమావేశంలో చెప్పారు. హింసకు పాల్పడేవారి విషయంలో ప్రభుత్వం ఎలాంటి సడలింపులు ఇవ్వదని స్పష్టం చేశారు. నిందితులను అరెస్టు చేసే విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పారిస్‌లో ప్రధాన మ్యూజియంలు మూసివేత...

లూవ్రే, ఓర్సే, పికాసో మ్యూజియంలతో పాటు గ్రాండ్ పలైస్‌ను శనివారం మూసివేస్తున్నట్లు ఫ్రాన్స్ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ అసోసియేటెడ్ ప్రెస్‌కు తెలిపింది. సందర్శకుల భద్రత, సిబ్బంది రక్షణ, కళాఖండాల పరిరక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని తన పరిధిలోని సంస్థలకు సూచించినట్లు వెల్లడించింది. రెండు రోజుల పాటు ఆహ్వానం ఉన్నవారికే ప్రవేశం కల్పించిన ఆర్ట్ బాసెల్ పారిస్ శుక్రవారం ప్రజల సందర్శనకు తెరుచుకుంది. అయితే ఆ రోజు మాత్రమే ప్రదర్శన కొనసాగింది. వారాంతంలో అల్లర్లు చెలరేగే ప్రమాదం ఉండటంతో నిర్వాహకులు శని, ఆదివారాల కార్యక్రమాలను రద్దు చేశారు. ప్రపంచంలోని ప్రముఖ సమకాలీన కళా ప్రదర్శనల్లో ఒకటైన ఆర్ట్ బాసెల్‌లో 211 అంతర్జాతీయ గ్యాలరీలు తమ కళాఖండాలను ప్రదర్శించాల్సి ఉంది. "ఈ నిర్ణయాన్ని తేలిగ్గా తీసుకోలేదు. ఈ ప్రదర్శనతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరి భద్రతే మా ప్రధాన ప్రాధాన్యం" అని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత్ నుంచి ఈ ప్రదర్శన కోసం పారిస్‌కు వచ్చిన కళా సేకరణకర్త సలోని దోషి గత శనివారం మంటలు, భయంతో పరుగులు తీస్తున్న ప్రజలను చూసి ఆందోళనకు గురయ్యారు. పారిస్ సురక్షితమేనా అని స్నేహితులు ఫోన్ చేసి అడగడంతో ఆమె మరింత కలవరపడ్డారు. ప్రదర్శనను మూసివేయాలన్న నిర్వాహకుల నిర్ణయం సరైనదేనని ఆమె అభిప్రాయపడ్డారు. ఎక్సో ఎక్సో గ్యాలరీ యజమానులు ఆంట్వాన్ డొన్జోడ్, ఎలిసా రిగూలే కూడా ఈ నిర్ణయాన్ని సమర్థించారు. "ఫ్రాన్స్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న సామాజిక డిమాండ్ల తీవ్రతను దృష్టిలో ఉంచుకుంటే ఈ నిర్ణయం సమంజసమైనదే. దీన్ని మేం అర్థం చేసుకున్నాం" అని వారు సందేశం ద్వారా తెలిపారు. అయితే కొందరు సందర్శకులు నిరాశ వ్యక్తం చేశారు. "మేం ఈ ప్రదర్శనను చూడటానికే ఇక్కడికి వచ్చాం. వారాంతపు కార్యక్రమాలను రద్దు చేయడంతో లోపలికి వెళ్లలేకపోయాం. ఈ రోజు చాలా రద్దీగా ఉంది. నాకు కళా ప్రదర్శనలంటే ఇష్టం. అందుకే నిరాశగా ఉంది" అని మెక్సికో నగరానికి చెందిన 32 ఏళ్ల ఫాబియాన్ హెర్నాండెజ్ చెప్పారు. పారిస్‌కు దక్షిణంగా సుమారు 110 కిలోమీటర్ల దూరంలోని ఓర్లియాన్స్‌లో శనివారం జరిగే మరో నిరసనపైనా అధికారులు దృష్టి సారించారు. వచ్చే వసంతకాలంలో జరగనున్న అధ్యక్ష ఎన్నికలకు ముందు మెరైన్ లె పెన్ నేతృత్వంలోని జాతీయవాద, వలసల వ్యతిరేక పార్టీ రెండు రోజుల సమావేశాన్ని నిర్వహిస్తోంది. ఈ సమావేశానికి సమీపంలోనే మితవాద కుడిపక్షానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టాలని సుమారు 50 సంస్థలు పిలుపునిచ్చాయి.

ట్రంప్‌పై ఒబామా తీవ్ర విమర్శలు.. అది మోసపూరిత పాలన అంటూ ఫైర్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం ఒహాయోలోని క్లీవ్‌ల్యాండ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. ట్రంప్ అనుసరిస్తున్న విధానాలపై నిప్పులు చెరిగారు. ముఖ్యంగా ఇరాన్‌తో ఉద్రిక్తతలు, సుంకాల విధింపు, అధ్యక్ష పదవిని స్వప్రయోజనాలకు వాడుకోవడం వంటి అంశాలపై ఒబామా తీవ్ర ఆరోపణలు చేశారు. "ఎవరూ కోరని, ఎవరూ ఓటు వేయని అనవసరమైన యుద్ధానికి" ట్రంప్ తెరలేపారని ఒబామా విమర్శించారు. తన హయాంలో కుదుర్చుకున్న అణు ఒప్పందం కారణంగా ఒక్క క్షిపణిని కూడా ప్రయోగించాల్సిన అవసరం లేకుండానే ఇరాన్‌ను అణ్వాయుధాల తయారీ నుంచి నిరోధించగలిగామని ఆయన గుర్తుచేశారు. అయితే, గత ఏడు నెలలుగా సాగుతున్న ఘర్షణల వల్ల మిత్రదేశాలు, అమెరికా సైనిక స్థావరాలపై దాడులు జరిగాయని.. ఈ క్రమంలో అమెరికన్లు ప్రాణాలు కోల్పోవడమే కాకుండా పలువురు గాయపడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హర్మూజ్ జలసంధిపై ఇరాన్‌కు పట్టుచిక్కడం వల్లే చమురు, డీజిల్ ధరలు పెరిగాయని మండిపడ్డారు. ట్రంప్‌కు "సుంకాలంటే అమితమైన ఇష్టం" అని, అయితే వాటి భారం అంతిమంగా వినియోగదారులపైనే పడుతుందని హెచ్చరించినా ఆయన పట్టించుకోలేదని ఒబామా ఎద్దేవా చేశారు. ట్రంప్ పాలనను ఒక "మోసపూరిత వ్యవస్థ" (గ్రిఫ్టర్ ప్రెసిడెన్సీ) గా అభివర్ణించిన ఆయన, అధ్యక్ష పదవిని ట్రంప్ స్వప్రయోజనాల కోసం వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. మీమ్ కాయిన్లు, తన సంతానానికి చెందిన కంపెనీలకు పన్ను చెల్లింపుదారుల నిధులతో కాంట్రాక్టులు కట్టబెట్టడం, వెనిజులాకు చెందిన బిలియనీర్‌కు క్షమాభిక్ష ప్రసాదించడం వంటి అంశాలను ఈ సందర్భంగా ఒబామా ఉదహరించారు. నవంబర్ 3న జరగనున్న మధ్యంతర ఎన్నికలు ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాలకు అడ్డుకట్ట వేయడానికి లభించిన ఆఖరి అవకాశమని ఒబామా పేర్కొన్నారు. ఈ ర్యాలీలో ఒహాయో గవర్నర్ అభ్యర్థి అమీ యాక్టన్, సెనేట్ అభ్యర్థి షెర్రాడ్ బ్రౌన్‌లకు మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. క్లీవ్‌ల్యాండ్ సభ అనంతరం ఆయన మిషిగాన్‌లోని డెట్రాయిట్‌లో జరగనున్న ప్రచార కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు.

హిట్లర్ విడిది చేసిన చారిత్రాత్మక భవనం 'ఈగిల్స్ నెస్ట్'లో అగ్నికీలలు.. 200 మంది రంగంలోకి..



జర్మనీలో నాజీ నియంత అడాల్ఫ్ హిట్లర్ గతంలో ఉపయోగించిన చారిత్రక భవనం భారీ అగ్నిప్రమాదానికి గురైంది. దక్షిణ జర్మనీలోని బవేరియన్ ఆల్ప్స్ పర్వత ప్రాంతంలో ఉన్న 'ఈగిల్స్ నెస్ట్' భవనంలో అక్టోబర్ 23వ తేదీ రాత్రి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో భవనం తీవ్రంగా దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధం ఉండొచ్చన్న అనుమానంతో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదని అధికారులు తెలిపారు. బెర్ఛ్‌టెస్‌గాడెన్ ప్రాంతంలోని పర్వత శిఖరంపై ఉన్న ఈ భవనంలో మంటలు చెలరేగినట్లు శుక్రవారం రాత్రి అధికారులకు సమాచారం అందింది. దీంతో సుమారు 200 మంది అగ్నిమాపక సిబ్బంది, అత్యవసర సేవల సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే, ఎత్తైన పర్వత ప్రాంతం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, మంచు కారణంగా మంటలను అదుపు చేయడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. భవనం పూర్తిగా మంటల్లో కాలిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న 33 ఏళ్ల జర్మనీ పౌరుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఉద్దేశపూర్వకంగా నిప్పు పెట్టారా? అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడికి ఈ ఘటనతో సంబంధం ఉందా, ప్రమాదం వెనుక రాజకీయ కారణాలేమైనా ఉన్నాయా అనే అంశాలపై విచారణ కొనసాగుతోంది. అయితే అగ్నిప్రమాదానికి గల అసలు కారణం ఇంకా నిర్ధారణ కాలేదు. ఈగిల్స్ నెస్ట్ భవనాన్ని 1938లో నాజీ అధికారులకోసం అతిథి గృహంగా నిర్మించారు. జర్మనీలోని బవేరియా ప్రాంతంలో ఈ పర్వతంపై 1,834 మీటర్ల ఎత్తులో నిర్మించిన ఈ విడిది గృహాన్ని అడాల్ఫ్ హిట్లర్ కూడా అప్పుడప్పుడు సందర్శించేవాడు. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం ఈ భవనాన్ని నాజీ చరిత్రకు సంబంధించిన చారిత్రక కట్టడంగా పరిరక్షించారు. 1952 నుంచి ఇక్కడ రెస్టారెంట్, కేఫ్‌తో పాటు ఆ కాలపు చరిత్రను వివరించే ప్రదర్శన కూడా కొనసాగుతోంది. తాజా అగ్నిప్రమాదంతో ఈ చారిత్రక కట్టడం తీవ్రంగా దెబ్బతినడంతో దాని భవిష్యత్తుపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. భవనాన్ని పునరుద్ధరించే అంశాన్ని పరిశీలిస్తామని బవేరియా రాష్ట్ర అధికారులు తెలిపారు.

మక్కాపై దాడి చేయలేదు.. సౌదీ చమురు క్షేత్రాలే మా లక్ష్యం: హౌతీ రెబల్స్

ఇస్లాం పవిత్ర నగరాలైన మక్కా, మదీనాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామన్న వార్తలను యెమెన్‌కు చెందిన ఇరాన్ మద్దతుగల హౌతీ తిరుగుబాటుదారులు ఖండించారు. తమ లక్ష్యం కేవలం సౌదీ అరేబియాలోని విమానాశ్రయాలు, చమురు శుద్ధి కర్మాగారాలు, సైనిక స్థావరాలు మాత్రమేనని స్పష్టం చేశారు. మరోవైపు, మక్కా, మదీనా ప్రాంతాల దిశగా ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకున్నామని, వాటి శకలాలు కింద పడ్డాయని సౌదీ అరేబియా ప్రకటించింది.

శనివారం సౌదీ దళాలు రెండు బాలిస్టిక్ క్షిపణులను గాల్లోనే ధ్వంసం చేశాయి. ఈ క్రమంలో మక్కా సమీపంతో పాటు జెడ్డా, తాయిఫ్, రబీఘ్ ప్రాంతాల్లో క్షిపణి శకలాలు పడ్డాయని సౌదీ సివిల్ డిఫెన్స్ విభాగం తెలిపింది. యన్బు, తాయిఫ్‌లను లక్ష్యంగా చేసుకుని ప్రయోగించిన రెండు క్షిపణులను నాశనం చేశామని సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు పేర్కొన్నాయి. అయితే, ఈ దాడులపై హౌతీ సైనిక ప్రతినిధి యహ్యా సరీ భిన్నమైన ప్రకటన చేశారు. తాము రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయం, యన్బులోని అరామ్‌కో చమురు కేంద్రం, రబీఘ్ ఆయిల్ రిఫైనరీ, పలు చమురు పంపింగ్ స్టేషన్లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్లు తెలిపారు. దమ్మామ్‌లోని కింగ్ ఫహద్ విమానాశ్రయం, నజ్రాన్‌లోని ఎయిర్‌పోర్ట్‌పైనా దాడి చేశామన్నారు. అయితే, ఈ దాడులు లక్ష్యాన్ని చేరుకున్నాయా? లేదా? అనేదానిపై సౌదీ అధికారులు స్పష్టత ఇవ్వలేదు. ఈ ఘర్షణలు యెమెన్ దక్షిణ ప్రాంతానికీ విస్తరించాయి. అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఏడెన్ నగరంలోని కోస్ట్ గార్డ్ ప్రధాన కార్యాలయంపై మూడు బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసినట్లు హౌతీలు ప్రకటించారు. సౌదీ అధికారులు ఉన్న సైనిక శిబిరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపారు. 2022లో ఐక్యరాజ్యసమితి మధ్యవర్తిత్వంతో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ఈ దాడులతో మరింత బలహీనపడింది. యెమెన్‌లో అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వానికి సౌదీ సంకీర్ణ దళాలు మద్దతిస్తుండగా, రాజధాని సనాతో పాటు ఉత్తర యెమెన్‌లో అధిక భాగం హౌతీల నియంత్రణలో ఉంది. కాగా, పవిత్ర నగరాలను లక్ష్యంగా చేసుకోవడం తమ ఉద్దేశం కాదని, అలాంటి వార్తలు అవాస్తవమని హౌతీలు పునరుద్ఘాటించారు.

ఫ్రాన్స్ నిరసనల్లో అరాచకం.. దుకాణాల లూటీ... ఆన్‌లైన్ లో అమ్మకానికి దోపిడీ సొత్తు



ఫ్రాన్స్‌లో ఇటీవల చెలరేగిన అల్లర్ల నేపథ్యంలో చోటుచేసుకున్న దుకాణాల లూటీ వ్యవహారం కొత్త మలుపు తీసుకుంది. నిరసనకారులు, దుండగులు దోచుకున్న ఖరీదైన లగ్జరీ వస్తువులను ప్రముఖ ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లలో అమ్మకానికి పెట్టడం తీవ్ర కలకలం రేపుతోంది. దీంతో అప్రమత్తమైన ఫ్రాన్స్ ప్రభుత్వం, ఈ అక్రమ అమ్మకాలను అడ్డుకునేందుకు కఠిన చర్యలు చేపట్టింది. ఫ్రాన్స్ వాణిజ్య శాఖ మంత్రి సెర్జ్ పాపిన్ ప్రకారం, దేశవ్యాప్తంగా జరిగిన అల్లర్లలో సుమారు 3,000 రిటైల్ దుకాణాలు ధ్వంసం లేదా దోపిడీకి గురయ్యాయి. ముఖ్యంగా పారిస్‌లోని లెస్ హాల్స్ జిల్లాలో ఉన్న హెర్మేస్, లూయిస్ విట్టన్, ది నార్త్ ఫేస్ వంటి ప్రముఖ బ్రాండ్ల ఫ్లాగ్‌షిప్ స్టోర్లు తీవ్రంగా నష్టపోయాయి. దుకాణాల్లో దోపిడీ జరిగిన కొద్ది గంటల్లోనే, డిజైనర్ హ్యాండ్‌బ్యాగులు, ఖరీదైన సౌందర్య సాధనాలు, కాస్మెటిక్స్ వంటివి వింటెడ్, అమెజాన్, లెబాన్‌కాయిన్ వంటి ఆన్‌లైన్ సైట్లలో అమ్మకానికి ప్రత్యక్షమయ్యాయి. ఈ పరిణామంతో ఫ్రాన్స్ ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగింది. వాణిజ్య మంత్రి సెర్జ్ పాపిన్, డిజిటల్ వ్యవహారాల మంత్రి అన్నే లే హెనాఫ్.. వింటెడ్, అమెజాన్, ఈబే, మెటా, టిక్‌టాక్ వంటి సంస్థల ప్రతినిధులతో అత్యవసర వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఆయా ప్లాట్‌ఫామ్‌లపై ఉన్న దొంగసొత్తుకు సంబంధించిన లిస్టింగులను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన వింటెడ్, తమ ప్లాట్‌ఫామ్‌పై దొంగిలించిన వస్తువుల అమ్మకాల పట్ల "జీరో టాలరెన్స్" విధానాన్ని అనుసరిస్తామని తెలిపింది. తమ సైట్‌లో అసాధారణ రీతిలో లగ్జరీ వస్తువుల లిస్టింగులు పెరిగినట్లు గుర్తించామని, అధికారులతో కలిసి పనిచేస్తున్నామని పేర్కొంది. మరోవైపు, ఈబే కూడా తమ వద్ద దొంగసొత్తు అమ్మకాలను నిషేధించామని, అనుమానాస్పద ఖాతాలను గుర్తించేందుకు ప్రత్యేక అల్గారిథమ్‌లు, పరిశోధకుల బృందాలు ఉన్నాయని వెల్లడించింది. అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మాట్లాడుతూ.. దోపిడీలకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఫ్రెంచ్ చట్టాల ప్రకారం, దొంగసొత్తును కలిగి ఉండటం, అమ్మడం లేదా బదిలీ చేయడం వంటి నేరాలకు పాల్పడితే ఐదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు 375,000 యూరోల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

బుర్కినా ఫాసోలో అందాల పోటీలపై ప్రభుత్వం నిషేధం

మరోవైపు ఉరిశిక్షను పునరుద్ధరించిన సైనిక సర్కార్

పశ్చిమాఫ్రికా దేశమైన బుర్కినా ఫాసో సైనిక ప్రభుత్వం సంచలన నిర్ణయాలతో వార్తల్లో నిలిచింది. దేశంలో జరిగే అన్ని రకాల అందాల పోటీలను తక్షణమే నిలిపివేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. దేశ సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక విలువలకు ఈ పోటీలు విఘాతం కలిగిస్తున్నాయని, వాటికి అనుగుణంగా కొత్త నిబంధనలు రూపొందించే వరకు ఈ నిషేధం కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇకపై ఇలాంటి కార్యక్రమాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వబోమని కూడా తేల్చి చెప్పింది. 2022 సెప్టెంబర్‌లో అధికారం చేపట్టిన కెప్టెన్ ఇబ్రహీం ట్రాయోరే నేతృత్వంలోని సైనిక ప్రభుత్వం.. దేశ భద్రత, సాంస్కృతిక గుర్తింపు పేరిట పలు కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే అందాల పోటీలను నిలిపివేసిన ప్రభుత్వం, మరోవైపు దేశంలో ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు ఉరిశిక్షను కూడా పునరుద్ధరించింది. అక్టోబర్ 20న పార్లమెంట్‌లోని 71 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఈ బిల్లును ఆమోదించారు.

ఉగ్రవాదం, దేశద్రోహం, గూఢచర్యం వంటి తీవ్రమైన నేరాలకు మరణశిక్ష విధించేలా కొత్త చట్టాన్ని తీసుకొచ్చారు. 2018లో రద్దు చేసిన మరణశిక్షను తిరిగి ప్రవేశపెట్టడం గమనార్హం. అందాల పోటీలను వద్దన్న ప్రభుత్వం, మరోవైపు యువతుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని ప్రోత్సహించడంపై దృష్టి సారించింది. 'హకిలి మౌసో' పేరుతో జాతీయ స్థాయిలో యువతుల కోసం సైన్స్ పోటీలు నిర్వహించింది. గణితం, భౌతిక, రసాయన శాస్త్రాల్లో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు, విద్యా ప్రోత్సాహకాలు అందించింది. విజేతలను సైనిక పాలకుడు కెప్టెన్ ఇబ్రహీం ట్రాయోరే స్వయంగా అభినందించి, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో రాణించాలని ప్రోత్సహించారు. ప్రభుత్వ నిర్ణయాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉరిశిక్షను పునరుద్ధరించడాన్ని హ్యూమన్ రైట్స్ వాచ్, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి అంతర్జాతీయ సంస్థలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దీనిని రాజకీయ ప్రత్యర్థులపై ప్రయోగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశాయి. అదే సమయంలో, అందాల పోటీలపై నిషేధాన్ని కొందరు స్వాగతిస్తూ, యువతుల తెలివితేటలకు ప్రభుత్వం విలువ ఇస్తోందని ప్రశంసిస్తుండగా, మరికొందరు ఇది మహిళల స్వేచ్ఛను హరించడమేనని విమర్శిస్తున్నారు. మొత్తం మీద, సైనిక పాలనలో బుర్కినా ఫాసో తనదైన పంథాలో ముందుకు సాగుతున్నట్లు ఈ నిర్ణయాలు స్పష్టం చేస్తున్నాయి.

జపాన్‌లో మరో భారీ భూకంపం.. 6.3 తీవ్రతతో ప్రకంపనలు..

జపాన్ దేశంలో మరోసారి భారీ భూకంపం సంభవించి తీవ్ర కలకలం రేపింది. యూరోపియన్–మెడిటరేనియన్ సీస్మోలాజికల్ సెంటర్ వెల్లడించిన కథనం ప్రకారం, జపాన్‌లోని బోనిన్ దీవుల సమీప ప్రాంతంలో రిక్టర్ స్కేలుపై 6.3 తీవ్రతతో బలమైన ప్రకంపనలు నమోదయ్యాయి.

ఈ ఘటనలో ఆస్తి లేదా ప్రాణ నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడి కాలేదు. ఇదే సమయంలో దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలోని వనాటు దీవుల్లోనూ 7.1 తీవ్రతతో మరో భారీ భూకంపం వచ్చినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. జపాన్ భౌగోళికంగా అత్యంత ప్రమాదకరమైన 'పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో విస్తరించి ఉండటమే ఇక్కడ తరచూ ప్రకంపనలు రావడానికి ప్రధాన కారణం. పసిఫిక్, ఫిలిప్పీన్ సీ, యూరేషియన్, ఉత్తర అమెరికా టెక్టానిక్ ప్లేట్లు కలుసుకునే ఈ సంక్లిష్ట ప్రాంతంలో నిరంతరం కదలికలు జరుగుతుంటాయి. భూమి పొరల్లోని ఈ ప్లేట్లు ఒకదానికొకటి ఢీకొనడం లేదా కిందకు జారడం వల్ల ఏర్పడే విపరీతమైన ఒత్తిడి ఒక్కసారిగా విడుదలైనప్పుడు తీవ్ర భూకంపాలు సంభవిస్తాయి.

వస్తోంది తుపాను కాదు.. అతి తీవ్ర తుపాను.. ఏపీకి ఐఎండీ హెచ్చరిక



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఇది వేగంగా బలపడుతూ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తోంది. ఇది రానున్న కొద్ది రోజుల్లో 'అతి తీవ్ర తుపాను'గా మారి రాష్ట్రంపై పెను ప్రభావం చూపనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. అక్టోబర్ 28న బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, యానాం తీర ప్రాంతాలకు 'ప్రీ-సైక్లోన్ వాచ్' జారీ చేసింది.న్యూఢిల్లీలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం శనివారం విడుదల చేసిన ప్రత్యేక బులెటిన్ ప్రకారం.. ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఇది ప్రస్తుతం విశాఖపట్నానికి ఆగ్నేయంగా 820 కిలోమీటర్లు, కాకినాడకు 910 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ వాయుగుండం తొలుత దక్షిణ దిశగా కదిలి, అక్టోబర్ 25న తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. ఆ తర్వాత దిశ మార్చుకుని పశ్చిమ-వాయవ్య దిక్కుగా ప్రయాణించి మరింత శక్తిని పుంజుకోనుంది.వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ వ్యవస్థ అక్టోబర్ 26 నాటికి తుపానుగా, 27 నాటికి తీవ్ర తుపానుగా, 28వ తేదీ ఉదయం నాటికి అతి తీవ్ర తుపానుగా మారుతుంది. అక్టోబర్ 28వ తేదీన ఉదయం 11:30 గంటల ప్రాంతంలో బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉంది. ఆ సమయంలో గాలి వేగం గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వరకు ఉండవచ్చని, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగానికి చేరవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.తుపాను ఏర్పడటానికి, అది బలపడటానికి సముద్రంలో పరిస్థితులు అత్యంత అనుకూలంగా ఉన్నాయని వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 29-30 డిగ్రీల సెల్సియస్ వరకు ఉండటం, మాడెన్-జూలియన్ ఆసిలేషన్ వంటి వాతావరణ అంశాలు ఈ తుపాను తీవ్రతను పెంచేందుకు దోహదం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక వాతావరణ నమూనాలు (మోడల్స్) కూడా ఈ తుపాను ఏపీ తీరం వైపే వస్తుందని, అతి తీవ్రంగా మారుతుందని ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. కొన్ని నమూనాలు ఒడిశా లేదా తమిళనాడు వైపు సూచించినప్పటికీ, అందుకు అవకాశాలు తక్కువ అని భావిస్తున్నారు.ప్రస్తుత అంచనాల కచ్చితత్వంపై వాతావరణ శాఖ స్పందించింది. తుపాను మార్గం, తీవ్రతపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సమాచారాన్ని అందిస్తామని తెలిపింది. తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ సూచనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు, సముద్రపు అలల ఉద్ధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించారు.

పింఛన్ బకాయిలపై హైకోర్టు కీలక తీర్పు.. దరఖాస్తు తేదీ నుంచే చెల్లించాలని ఆదేశం



పింఛన్ దరఖాస్తులను అధికారులు సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచినట్లయితే, ఆ కాలానికి సంబంధించిన బకాయిలను కూడా తప్పనిసరిగా చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు స్పష్టం చేసింది. పరిపాలనాపరమైన జాప్యం కారణంగా దరఖాస్తును ఆలస్యంగా ఆమోదించినప్పటికీ, దరఖాస్తు చేసుకున్న తేదీ నుంచే పింఛన్ బకాయిలను చెల్లించాల్సి ఉంటుందని న్యాయస్థానం తేల్చిచెప్పింది.గుంటూరు జిల్లా పొన్నూరు మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన తాడిశెట్టి తిరుపతమ్మ ఈ మేరకు హైకోర్టును ఆశ్రయించారు. దివ్యాంగుల పింఛన్ పొందుతున్న ఆమె భర్త హరికృష్ణ 2023 జులైలో అనారోగ్యంతో మరణించారు. అనంతరం ఆమె వితంతు పింఛన్ కోసం 2024 మార్చి 16న దరఖాస్తు చేసుకున్నారు. అయితే, అధికారులు ఆ పింఛన్‌ను 2026 ఫిబ్రవరి నుంచి మాత్రమే మంజూరు చేశారు. దీంతో, దరఖాస్తు చేసిన నాటి నుంచి మధ్యంతర కాలానికి సంబంధించిన బకాయిలను చెల్లించాలని కోరుతూ ఆమె కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పింఛన్ దరఖాస్తులను 21 పనిదినాల్లోగా పరిష్కరించాలని ఆయన గుర్తు చేశారు. సకాలంలో స్పందించకుండా ఎన్నికల కోడ్ వంటి కారణాలను సాకులుగా చూపడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద 2024 జులై 1 నుంచి మూడు నెలల బకాయిలతో కలిపి పింఛన్ చెల్లించేందుకు ప్రభుత్వం జారీ చేసిన జీవోను ఈ సందర్భంగా న్యాయస్థానం ప్రస్తావించింది.ఈ నేపథ్యంలో, పిటిషనర్ దరఖాస్తు చేసుకున్న నాటి నుంచే బకాయిలు పొందేందుకు అర్హులని కోర్టు తీర్పునిచ్చింది. కోర్టు ఉత్తర్వులు అందిన ఎనిమిది వారాల్లోగా ఈ ప్రక్రియను పూర్తి చేసి, బకాయిలు చెల్లించాలని అధికారులను ఆదేశించింది.

ఈషా ఔటర్‌రీచ్ మద్దతుతో అన్నదాతల అద్భుతం.. 400 కోట్ల వ్యాపారంతో జాతీయ అవార్డులు..



వ్యవసాయం దండగ కాదు.. పక్కా ప్లానింగ్, ఐక్యత ఉంటే తిరుగులేని లాభాల పండగేనని నిరూపిస్తున్నారు ఆ రైతులు. దళారుల చేతుల్లో మోసపోకుండా, తామే వ్యాపారవేత్తలుగా మారి ఏకంగా రూ.400 కోట్లకు పైగా టర్నోవర్ సాధించడమే కాకుండా జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక అవార్డులను కొల్లగొట్టారు. సద్గురు ఈషా ఔటర్‌రీచ్ మద్దతుతో నడుస్తున్న ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ సాధించిన ఈ అరుదైన విజయం ఇప్పుడు దేశవ్యాప్తంగా అన్నదాతలకు ఆదర్శంగా నిలుస్తోంది.దేశ రాజధాని న్యూఢిల్లీలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో జరిగిన ఎఫ్‌పీవో ఎక్సలెన్స్ అవార్డ్స్ కార్యక్రమంలో సద్గురుకు చెందిన ఈషా ఔటర్‌రీచ్ మద్దతుతో నడుస్తున్న మూడు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఘన పురస్కారాలు అందుకున్నాయి. దేశవ్యాప్తంగా వేలాది ఎఫ్‌పీవోల నుంచి వచ్చిన దరఖాస్తులను మూడు దశల్లో పరిశీలించిన నిపుణుల కమిటీ.. మార్కెట్ లింకేజీ, స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, వ్యాపార సామర్థ్యం ఆధారంగా ఈ పురస్కారాలకు ఎంపిక చేసింది. ఈషా మద్దతు గల రైతు సంస్థలు వరుసగా నాలుగో ఏడాది ఈ జాతీయ అవార్డులను దక్కించుకోవడం విశేషం.

అవార్డులు గెలుచుకున్న సంస్థలు ఇవే..

తెంచెరిమలై ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ : రైతుల పంటలకు విస్తృతమైన మార్కెట్ అవకాశాలు కల్పించినందుకు గానూ మార్కెట్ లింకేజ్ కేటగిరీలో ఈ సంస్థ అవార్డు దక్కించుకుంది.పొన్నడ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్: వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీ, పర్యావరణ అనుకూల స్థిరమైన పద్ధతులను అవలంబించినందుకు టెక్నాలజీ -- సస్టైనబిలిటీ కేటగిరీలో అవార్డును గెలుచుకుంది. సెన్నియాండవర్ ఎఫ్‌పీవో : మార్కెట్ విస్తరణలో చూపిన ప్రతిభకు గానూ మార్కెట్ లింకేజ్ కేటగిరీలో ప్రత్యేక గుర్తింపు పురస్కారాన్ని అందుకుంది.

కొబ్బరి రైతులకు పెరిగిన లాభాలు..

ఈ విజయంపై సెన్నియాండవర్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ప్రతినిధి సెల్వరాజ్ స్పందిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. తమ సంస్థలో 750 మంది రైతు సభ్యులు ఉన్నారని, సుమారు 240 మంది రైతుల నుంచి తాము నేరుగా కొబ్బరి కాయలను సేకరిస్తున్నామని తెలిపారు. "బయట మార్కెట్ వ్యాపారుల కంటే మా సంస్థ రైతులకు కొబ్బరి కాయకు లేదా కిలోకు రూ.3 నుంచి రూ.4 అదనంగా చెల్లిస్తోంది. ఇది చిన్న, సన్నకారు రైతుల ఆదాయాన్ని పెంచడంలో ఎంతో ఉపయోగపడుతోంది. ఈషా సహకారంతో ఇతర రాష్ట్రాలు, అంతర్జాతీయ మార్కెట్లకు కూడా ఉత్పత్తులను విస్తరించేందుకు అడుగులు వేస్తున్నాం" అని ఆయన వెల్లడించారు.

సామూహిక వ్యవసాయంతో అన్నదాతల సాధికారత:

ఈషా ఔటర్‌రీచ్‌కు చెందిన సేవ్ సాయిల్ ఫార్మర్స్ మూవ్‌మెంట్ ద్వారా చిన్న, సన్నకారు రైతులను ఏకం చేసి ఎఫ్‌పీవోలుగా తీర్చిదిద్దుతున్నారు. రైతులకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక, మార్కెటింగ్ మద్దతు అందిస్తూ వారిని వ్యాపారవేత్తలుగా మారుస్తున్నారు. రైతులు తమ ఉత్పత్తులకు మంచి ధర పొందేలా చేయడమే ఈ చొరవ ముఖ్య ఉద్దేశం. 2013లో ప్రారంభమైన వెల్లియంగిరి ఉళవన్ ఎఫ్‌పీవోతో మొదలైన ఈ ప్రస్థానం.. ప్రస్తుతం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో 25 ఎఫ్‌పీవోలకు విస్తరించింది.

రూ. 400 కోట్లకు పైగా టర్నోవర్.. 17 వేల మంది రైతులు:

ఈషా ఔటర్‌రీచ్ నెట్‌వర్క్ పరిధిలోని గణాంకాలు గ్రామీణ వ్యవసాయ రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులను స్పష్టం చేస్తున్నాయి. 25 ఎఫ్‌పీవోల పరిధిలో 17,000 మందికి పైగా రైతు సభ్యులు ఉన్నారు. ఇందులో 60 శాతానికి పైగా చిన్న, సన్నకారు రైతులే కాగా, 15 శాతం మంది మహిళా రైతులు భాగస్వాములుగా ఉన్నారు. 8 జిల్లాల్లోని దాదాపు 580 గ్రామాల్లో 54,000 ఎకరాలకు పైగా భూమిలో ఈ రైతులు సాగు చేస్తున్నారు. కొబ్బరి, కాఫీ, అరటి, చిరుధాన్యాలు సహా 15 రకాల పంటలను సాగు చేస్తున్నారు. ఈ 25 ఎఫ్‌పీవోలు కలిసి ఇప్పటివరకు రూ.400 కోట్లకు పైగా ఉమ్మడి టర్నోవర్‌ను నమోదు చేయడం విశేషం.

ఆయుధ పూజరోజూ ఏకే 47తో కాల్పులు.. ఎస్పీ అంకితా శర్మకు షాక్!



దసరా వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఆయుధ పూజ తర్వాత చత్తీస్‌గఢ్ రాష్ట్రం రజ్‌నంద్‌గావ్ ఎస్పీ అయినా అంకితా శర్మ చీరకట్టులోనే ఏకే 47 గన్‌తో గాల్లో కాల్పులు జరిపారు. అయితే ఇందుకు సంబంధించిన వీడియో.. సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో అది కాస్త వివాదానికి దారి తీసింది. ఈ వీడియోపై స్పందించిన ఉన్నతాధికారులు ఆయుధాల వినియోగంలో భద్రతా నిబంధనలు ఉల్లంఘించారన్న ఆమెకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.వివరాల్లోకి వెళ్తే.. అక్టోబర్ 20న దసరా పండగ సందర్భంగా పోలీస్ లైన్స్‌లో సంప్రదాయ ఆయుధ పూజ నిర్వహించారు. అయితే పూజ తర్వాత స్థానిక ఎస్పీ అంకితా శర్మ ఒక ఏకే-47 గన్ తీసుకొని గాల్లోకి కొన్ని రౌండ్స్ కాల్పులు జరిపారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారి తీవ్ర చర్చకు దారి తీసింది. ఆమె చర్యను కొందరు సపోర్ట్ చేయగా.. మరికొందరు వ్యతిరేకించారు. దీంతో ఈ వీడియో పోలీస్ శాఖ గౌరవానికి భంగం కలిగించిందని పోలీస్ ప్రధాన కార్యాలయం ఆందోళన వ్యక్తం చేసింది. భద్రతా నియమాలను ఎందుకు పాటించలేదో చెప్పాలని అంకితా శర్మను ఇచ్చిన నోటీసుల్లో పేర్కొంది.మరోవైపు.. ఈ ఘటనపై రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఆర్.కే. విజ్ మాట్లాడుతూ ఆయుధ పూజలో భాగంగా కాల్పులు జరపాల్సిన అవసరం లేదని అన్నారు. ఇలాంటి చర్యలతో ప్రమాదాలు జరిగే ఛాన్స్ ఉందని హెచ్చరించారు. అయితే,కొందరు నెటిజన్లు మాత్రం అంకితా శర్మకు సపోర్ట్‌గా నిలిచారు. ఆయుధాల వినియోగంలో లోపాలు ఉంటే సరిదిద్దాలని, వాటి ఆధారంగా ఆమె వృత్తిపరమైన సేవలను తక్కువ చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు.

డ్రగ్స్ మాఫియాపై కేంద్రం సర్జికల్ స్ట్రైక్.. 38 చోట్ల ఏకకాలంలో దాడులు.. 'ఆపరేషన్ ట్రైడెంట్'తో 18 మంది అంతర్జాతీయ స్మగ్లర్ల అరెస్ట్



భారతదేశాన్ని 'డ్రగ్స్ రహిత భారత్'గా మార్చే లక్ష్యంతో కేంద్ర హోంశాఖ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ ట్రైడెంట్' (ఖాజూవతీఖ్అశీఅ ఎతీఅనవత్) భారీ విజయాన్ని సాధించింది. భారత్-మయాన్మార్-బంగ్లాదేశ్ సరిహద్దుల గుండా సాగుతున్న అంతర్జాతీయ డ్రగ్స్ నెట్‌వర్క్‌ను తుడిచిపెట్టేందుకు కేంద్ర ఏజెన్సీలతో పాటు ఈశాన్య రాష్ట్రాల పోలీసులు సంయుక్తంగా ఈ సుదీర్ఘ ఆపరేషన్ నిర్వహించారు. 2029 డిసెంబర్ 31 నాటికి దేశంలో డ్రగ్స్ రవాణాకు పూర్తిగా చరమగీతం పాడాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ విరోచిత చర్యలకు శ్రీకారం చుట్టింది.

3 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు.. రూ.100 కోట్ల హవాలా గుట్టురట్టు:

ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా మణిపూర్, అసోం, మిజోరం రాష్ట్రాల్లోని 38 సున్నితమైన ప్రాంతాల్లో భద్రతా బలగాలు ఏకకాలంలో విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో అంతర్జాతీయ డ్రగ్స్ కార్టెల్‌కు చెందిన 18 మంది ప్రధాన స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. అంతేకాకుండా, ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న దాదాపు రూ.100 కోట్ల హవాలా లావాదేవీల గుట్టును రట్టు చేయడమే కాకుండా, దానికి సంబంధించిన 1,424 బ్యాంక్ ఖాతాలను అధికారులు తక్షణమే సీజ్ చేశారు.

500 డిటొనేటర్ల స్వాధీనం.. విధ్వంస చర్యల కుట్ర సైతం భగ్నం:

అరెస్టు చేసిన స్మగ్లర్ల నుంచి డ్రగ్స్‌తో పాటు 500 డిటొనేటర్లను అధికారులు స్వాధీనం చేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. డ్రగ్స్ విక్రయాల ద్వారా వచ్చే సొమ్మును విధ్వంసకర కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారనే అనుమానాలకు ఈ రికవరీ బలమైన నిదర్శనంగా నిలిచింది. సరిహద్దుల్లో చొరబాట్లను అరికట్టడంతో పాటు డ్రగ్స్ మూలాలను కట్ చేయడమే ధ్యేయంగా కేంద్రం ఈ తీవ్రమైన చర్యలు కొనసాగిస్తోంది.

బార్‌లో రివాల్వర్‌తో హల్‌చల్.. బిల్లు డబ్బులు ఇవ్వకపోతే కాల్చేస్తానంటూ..



హైదరాబాద్ సోమాజిగూడలోని ఓ ప్రముఖ బార్ అండ్ రెస్టారెంట్‌లో రివాల్వర్‌తో ఓ వ్యక్తి హల్‌చల్ చేయడం తీవ్ర కలకలం రేపింది. బిల్లు చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వకపోతే కాల్చి చంపుతానంటూ బౌన్సర్లు, కస్టమర్లను సదరు వ్యక్తి బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బార్ సిబ్బంది ఫిర్యాదుతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సదరు వ్యక్తిని అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 12:30 గంటల సమయంలో సోమాజీగూడలోని హెడ్‌క్వార్టర్స్ బార్ అండ్ రెస్టారెంట్ రెండో అంతస్తులో కొందరు కస్టమర్ల మధ్య వాగ్వాదం చెలరేగింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది జోక్యం చేసుకుని ఇరువర్గాలను బయటకు పంపించేశారు. అనంతరం వారిలో మహమ్మద్ షానవాజ్ అనే వ్యక్తి సెల్లార్‌లో పార్క్ చేసి ఉన్న మహీంద్రా థార్ వాహనం వద్దకు వెళ్లి అందులో ఉన్న రివాల్వర్ తీసుకుని తిరిగి రెస్టారెంట్‌లోకి ప్రవేశించేందుకు యత్నించాడు.గ్రౌండ్ ఫ్లోర్‌లో విధులు నిర్వర్తిస్తున్న బౌన్సర్ గణేశ్ అతడిని అడ్డుకుని సెల్లార్ వైపు తీసుకెళ్లాడు. అయితే ఇతర కస్టమర్ల వెంట మళ్లీ సెల్లార్‌లోకి ప్రవేశించిన షానవాజ్.. చేతిలోని రివాల్వర్ చూపిస్తూ సిబ్బందితో పాటు కస్టమర్లను తీవ్రంగా బెదిరించాడు. తాను బిల్లు కోసం చెల్లించిన డబ్బులను వెంటనే తిరిగి ఇవ్వకపోతే కాల్చి చంపేస్తానని హెచ్చరించడంతో అక్కడున్న వారంతా భయాందోళనలకు గురయ్యారు.

నాన్ వెజ్ ప్రియులకు బిగ్ షాక్.. భారీగా పెరిగిన చికెన్ ధరలు



తెలుగు రాష్ట్రాల్లోని మాంసప్రియులకు పండుగల సీజన్ సందర్భంగా గట్టి షాక్ తగిలింది. గత కొన్ని రోజులుగా క్రమంగా పెరుగుతున్న చికెన్ ధరలు ఈ వారం మరింతగా ఎగబాకాయి. పండుగల సందర్భంగా డిమాండ్ విపరీతంగా పెరగడం, పౌల్ట్రీ ఉత్పత్తి తగ్గి సరఫరాలో జాప్యం ఏర్పడటమే ఈ సడన్ హైక్‌కు ప్రధాన కారణమని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. హైదరాబాద్‌లో కేజీ స్కిన్‌లెస్ చికెన్ ధర రూ. 290 నుంచి రూ. 300 వరకు చేరుకోగా, కరీంనగర్, వరంగల్ ప్రాంతాల్లోనూ రూ. 300 మార్కును తాకింది. ఏపీలోని విజయవాడలో ఏకంగా రూ. 310 వద్ద విక్రయాలు జరుగుతుండటంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మటన్, కోడిగుడ్ల రేట్లకు కూడా రెక్కలు:

చికెన్‌తో పాటు సామాన్యులకు అందుబాటులో ఉండే కోడిగుడ్లు, మటన్ ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. ప్రాంతాన్ని బట్టి కేజీ మటన్ ధర రూ. 800 నుండి రూ. 1100 వరకు పలుకుతుండగా, హైదరాబాద్, విజయవాడ జోన్లలో 12 కోడిగుడ్ల రిటైల్ ధర రూ. 80కు చేరుకుంది. ఇవాళ ఆదివారం కావడంతో పండుగ వేళ నాన్ వెజ్ వండుకోవాలని భావించిన ప్రజలు ఉదయం నుంచే మార్కెట్లలోని చికెన్, మటన్ సెంటర్ల వద్ద భారీగా బారులు తీరారు. పెరిగిన ధరల వల్ల సామాన్య, మధ్యతరగతి కుటుంబాల నెలవారీ బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం పడుతోంది.

రాబోయే రోజుల్లో ధరలు ఇంకా పెరిగే అవకాశం:

పౌల్ట్రీ రవాణా వ్యయం పెరగడం, ఫారాల్లో కోళ్ల ఉత్పత్తి మందగించడంతో పండుగల రద్దీ తీరేవరకు ధరల మంట తగ్గేలా లేదని పౌల్ట్రీ యజమానులు అంచనా వేస్తున్నారు. రాబోయే రోజుల్లో దసరా, దీపావళి వరుస పండుగలు ఉండటంతో చికెన్, కోడిగుడ్ల రేట్లు మరిన్ని రికార్డులను తాకే అవకాశముందని భావిస్తున్నారు. పెరుగుతున్న నిత్యవసరాల ధరలతో పాటు నాన్ వెజ్ రేట్లు కూడా ఊహించని రీతిలో పెరగడంతో సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయ గుర్తింపునిచ్చిన బీజేపీపై వరుస విమర్శలు... తమిళనాట హాట్ టాపిక్‌గా అన్నామలై వ్యవహారం

బీజేపీ పై వరుస దాడులతో తమిళనాడు రాజకీయంలో 'వి ద లీడర్స్' ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, మాజీ ఐపీఎస్ కె. అన్నామలై వ్యవహారం అత్యంత హాట్ టాపిక్‌గా మారింది. తనకు రాజకీయ గుర్తింపు నిచ్చిన సొంత పార్టీపైనే విమర్శల బాణాలు ఎక్కుపెడుతూ... కేంద్ర ప్రభుత్వం నిరసనలను హ్యాండిల్ చేస్తున్న తీరును ఎండగడుతూ.. జాతీయవాదాన్ని పదే పదే లేవనెత్తడాన్ని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఒకప్పుడు ద్రవిడ పార్టీలపై బీజేపీ తరఫున తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన ఆయన ఈ తరహా మార్పు, విమర్శల తీవ్రత అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. తమిళనాడుకు చెందిన ఏ ఇతర నాయకులు కూడా అన్నామలై స్థాయిలో బీజేపీపై విరుచుకుపడటం లేదు. ఈ వరుస దాడుల వెనుక ఉన్న అసలు కారణం ఏమిటి? తనను తాను ఒక బలమైన నాయకుడిగా నిలబెట్టుకోవాలనే తపనా? ఇది ఏదైనా వ్యూహమా? లేక రాజకీయంగా దిక్కుతోచని స్థితికి నిదర్శనమా? అనేది చర్చనీయాంశంగా మారింది.కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసనలను కేంద్రం హ్యాండిల్ చేసిన తీరుపై అన్నామలై ఇటీవల చేసిన విమర్శలు చర్చనీయాంశమయ్యాయి. నిరసనకారుల రాజకీయ విధానాలు ఎలా ఉన్నప్పటికీ... వారి ప్రజాస్వామ్య హక్కులను, చట్టబద్ధమైన ప్రక్రియలను విస్మరించకూడదని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రకటన బీజేపీకి మద్దతు ఉందని పలువురు చేసిన విమర్శలకు.. తాను ఆ సంస్థకు మద్దతు ఇవ్వడం లేదని, కానీ బీజేపీ అయినా కాంగ్రెస్ అయినా "తప్పు ఎవరు చేసినా" ప్రశ్నిస్తానని అన్నామలై స్పష్టం చేశారు.

బీజేపీకి అనుకూలంగా వ్యాఖ్యలు

'వి ద లీడర్స్' మూవ్‌మెంట్ జనరల్ సెక్రటరీ, మీడియా ఇంఛార్జ్ అస్టైర్ కె. స్వామినాథన్ స్పందిస్తూ... అన్నామలై కేవలం బీజేపీనే లక్ష్యంగా చేసుకుంటున్నారనే ప్రచారాన్ని తోసిపుచ్చారు. 'ఆయన వ్యక్తం చేసే ప్రతి స్వతంత్ర రాజకీయ అభిప్రాయాన్ని తిరుగుబాటుగానో, నిరాశగానో భావించడం అంటే ఆయన లేవనెత్తిన అసలు అంశాలను పక్కదారి పట్టించడమే' అని స్వామినాథన్ చెప్పారు. 2011లో నిరసన తెలిపే హక్కులపై ప్రధాని మోదీ చెప్పిన మాటలను అన్నామలై ప్రస్తావించడం వెనుక ఉద్దేశం... అధికారంలో ఎవరున్నా ప్రజాస్వామ్య సూత్రాలు మారకూడదని గుర్తుచేయడమేనని ఆయన తెలిపారు.అయితే అన్నామలై వ్యాఖ్యలను ఆయన ఎదుర్కొంటున్న ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నుంచి వేరు చేసి చూడలేం. బీజేపీని వీడిన తర్వాత, కనీసం ఏడాది 'వి ద లీడర్స్' సంస్థను బలోపేతం చేసి, ఆ తర్వాత రాజకీయ పార్టీని స్థాపించి 2031 అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం కావాలని ఆయన ప్రణాళిక వేసుకున్నారు. అయితే ఈ ప్రయోగం మొదలైన నాలుగు నెలల్లోనే ఆయన తన వేగాన్ని అకస్మాత్తుగా పెంచినట్లు కనిపిస్తోంది.తనపై ఉన్న 'బీజేపీ బి-టీమ్' అనే ముద్రను తొలగించుకోవడమే అన్నామలై వ్యూహంలో అత్యంత కీలకమైన అంశంగా కనిపిస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బీజేపీని లేదా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ద్వారా ఆయన ఆ ముద్రను చెరిపేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని అంటున్నారు.గతంలో బీజేపీతో ఉన్న సంబంధమే ప్రస్తుతం తమిళనాడు వ్యాప్తంగా తన రాజకీయ ప్రభావాన్ని విస్తరించడానికి ప్రతిబంధకంగా మారిందని అన్నామలై భావిస్తున్నట్లు తెలుస్తోంది.



ముందే ప్లాన్ మారుస్తున్న అన్నామలై?

'వి ద లీడర్స్' ప్రచారానికి వస్తున్న సభ్యుల సంఖ్యను పరిశీలిస్తే అన్నామలై వ్యూహంలో వచ్చిన మార్పుకు కారణం అర్థమవుతుంది. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సిద్ధాంతాలతో ప్రారంభమైన ఈ రాజకీయ ఉద్యమం... పార్టీగా మారడానికి ముందు 50 లక్షల మంది సభ్యులను చేర్పించాలని ఆశయంగా పెట్టుకుంది. అయితే ప్రారంభంలో ఉన్న ఉత్సాహం తగ్గడంతో ఇప్పటివరకు దాదాపు 20 లక్షల మంది మాత్రమే నమోదయ్యారు.అన్నామలై రాజకీయ భవిష్యత్తు అనేది ఆయన వ్యక్తిగత ప్రతిష్ఠను ఎన్నికల్లో పోటీపడే స్థాయికి తీసుకెళ్లడంపైనే ఆధారపడి ఉంది. మరో ఐదేళ్లు అంటే 2031 వరకు వేచి చూస్తే... జనాలు ఈ ఉద్యమంపై ఆసక్తి కోల్పోయే ప్రమాదం ఉంది. సమయం గడుస్తున్న కొద్దీ మద్దతుదారులు ఇతర పార్టీల వైపు లేదా కొత్త ప్రత్యామ్నాయాల వైపు వెళ్లే అవకాశం కూడా ఉంది. అందుకే అన్ని విధాలుగా ఆలోచించి.. 2027లో జరగబోయే తమిళనాడు స్థానిక సంస్థల ఎన్నికల్లో 'వి ద లీడర్స్' పోటీ చేస్తుందని ఆయన అక్టోబరు 14న ప్రకటించారు.ఆ మర్నాడే కోయంబత్తూరులో 'అబ్దుల్ కలాం సెంటర్ ఫర్ ఎథిక్స్ అండ్ పాలిటిక్స్'ను ప్రారంభించారు. క్షేత్రస్థాయి నాయకులకు శిక్షణ ఇవ్వడమే ఈ సంస్థ లక్ష్యం. ఇది 2 రోజుల ఫౌండేషన్ కోర్స్, 4 వారాల నాయకత్వ శిక్షణ, 100 రోజుల ఫీల్డ్ ప్రోగ్రామ్‌ను అందిస్తుంది. మొదటి విడతలో సామాజిక సేవా కార్యక్రమాల్లో ఉన్న 100 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. భవిష్యత్తులో కనీసం లక్ష మంది వాలంటీర్లకు శిక్షణ ఇవ్వాలనేది లక్ష్యం. ఇక్కడ శిక్షణ పొందిన వారిలో కొందరు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉంది.విశ్లేషకుల రామన్ అభిప్రాయం ప్రకారం... 2031 ఎన్నికల ఆశయాన్ని పక్కనబెట్టి ముందే ఎన్నికల బరిలోకి దిగడం చూస్తుంటే, క్రమంగా తగ్గుతున్న క్రేజ్ వల్లే అన్నామలై ఈ నిర్ణయం తీసుకున్నారనిపిస్తోంది. అన్నామలై మద్దతు కేవలం పశ్చిమ తమిళనాడు ముఖ్యంగా ఆయన సామాజిక వర్గం ఎక్కువగా ఉన్న కోయంబత్తూరు ప్రాంతానికే పరిమితమైందని అంటున్నారు. మరోవైపు, తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ యువ ఓటర్లలో విస్తృతమైన ఆదరణ పొందుతున్నారు.అయితే ఈ విశ్లేషణను అన్నామలై వర్గం ఖండిస్తోంది. తమ ఉద్యమం స్వతంత్రంగా ముందుకు సాగుతోందని చెబుతోంది. కానీ రాజకీయ పరీక్ష మాత్రం వేగంగా దగ్గరపడుతోంది.

బీజేపీపై విమర్శలతో ఎదగగలరా?

అన్నామలై ముందున్న సవాలు కేవలం బీజేపీ నుంచి వేరుగా కనిపించడం మాత్రమే కాదు. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు నిర్మించుకున్న రాజకీయ గుర్తింపు కంటే మెరుగైన ప్రత్యామ్నాయాన్ని ప్రజలకు చూపించగలనని నిరూపించుకోవాల్సి ఉంది. ఈ మాజీ ఐపీఎస్ అధికారి రాష్ట్రంలో బీజేపీకి ప్రధాన ముఖచిత్రంగా మారి డీఎంకే, అన్నాడీఎంకే, ద్రవిడ రాజకీయ నమూనాపై తీవ్రస్థాయిలో పోరాడారు. పార్టీ జాతీయ నాయకత్వం కూడా ఆయనకు ప్రాధాన్యతనిచ్చి తమిళనాడు రాజకీయాల్లో కొత్త తరం నాయకుడిగా ప్రొజెక్ట్ చేసింది. అయితే ఆయన సొంత ఇమేజ్, ఆయన చుట్టూ ఉన్న వ్యవస్థాగత బలం కంటే ఎక్కువగా విస్తరించింది. అన్నామలై బీజేపీలో ఉన్నప్పుడు ఆయనతో కలిసి పనిచేసిన జెవిసి శ్రీరామ్ మాట్లాడుతూ... అన్నామలై ఎదుగుదలకు బీజేపీ ఎంతగానో తోడ్పడిందని అన్నారు.

సీఎం విజయ్.. అన్నామలైకి అతిపెద్ద సవాలా?

రాష్ట్రంలో అన్నామలై ఎదుర్కొంటున్న మరో రాజకీయ సవాల్ ఉంది. మాజీ ముఖ్యమంత్రులు జయలలిత, ఎం. కరుణానిధి మరణాల తర్వాత తమిళనాడులో కొత్త తరం నాయకుడికి ఏర్పడిన ఖాళీలో ఇప్పుడు పోటీ పెరిగింది. విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఇప్పటికే ఎన్నికల్లో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీంతో సాంప్రదాయ పార్టీలకు ప్రత్యామ్నాయం కోరుకునే ఓటర్ల దృష్టిని ఆకర్షించడంలో రాజకీయాల్లోకి వచ్చిన నటుడు విజయ్, అన్నామలైకి ప్రత్యక్ష పోటీదారుగా మారారు. ధనుష్ వంటి ఇతర నటుల రాజకీయ అరంగేట్రంపై వస్తున్న ఊహాగానాలు ఈ అనిశ్చితిని మరింత పెంచుతున్నాయి.అన్నామలైకి ఉన్న వాగ్ధాటి, ప్రభుత్వాన్ని ప్రశ్నించే తీరు ఆయన పార్టీ బలం కంటే ఎక్కువ ప్రభావాన్ని చూపేలా చేస్తాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.అయితే బీజేపీ వెలుపల ఆ బలం ఇంకా పూర్తిగా నిరూపితం కాలేదు. అన్నామలై బీజేపీని, మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రారంభించినప్పటికీ... సీఎం విజయ్‌కు సరైన రాజకీయ సవాలు విసరాల్సి ఉంది.

కేవలం దేనిని వ్యతిరేకిస్తున్నారో కాకుండా, తమిళనాడు కోసం తాము ఏం భిన్నంగా చేస్తారో ఆయన ఉద్యమం స్పష్టం చేయాల్సి ఉంది.బీజేపీని తన సైద్ధాంతిక శత్రువుగా బహిరంగంగా ప్రకటించిన ముఖ్యమంత్రి విజయ్... కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై నేరుగా విమర్శలు చేయడానికి సాహసించడం లేదు. చెన్నైలోని ప్రధాన ప్రత్యర్థిని లక్ష్యంగా చేసుకుంటూ, ఢిల్లీలోని అధికార పార్టీ పట్ల కొంత సయోధ్య వైఖరినీ అవలంబిస్తున్నట్లు కనిపిస్తున్నారు. అన్నామలైకి మాత్రం బీజేపీ ఒక తప్పించుకోలేని అంశంగా మారింది. అందుకే ఆయన టీవీకే కంటే కూడా బీజేపీనే ఎక్కువగా టార్గెట్ చేస్తున్నారు.కాబట్టి, అన్నామలై బీజేపీపై చేస్తున్న దాడులు ఒక రకంగా రాజకీయ నిరాశ, మరొక రకంగా వ్యూహం రెండూనూ. తన క్రేజ్‌ను, మద్దతుదారులను నిలబెట్టుకోవడానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధపడుతూనే... తనపై ఉన్న 'బీజేపీ బి-టీమ్' ముద్రను చెరిపేసుకోవడానికి ఆయన ప్రయత్నిస్తున్నారు. అయితే ప్రజలు ఈ సందేశాన్ని ఎలా స్వీకరిస్తారనేదే ఇక్కడ కీలకం.

ఎన్నికల ముందు యూపీలో పరిస్థితులెలా వున్నాయి?

దేశ రాజకీయాల్లో అత్యంత కీలకమైన రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ (యూపీ) ఒకటి. 403 అసెంబ్లీ స్థానాలు, భారీ ఓటరు సంఖ్య, జాతీయ రాజకీయాలపై చూపే ప్రభావం కారణంగా ఇక్కడ జరిగే ఎన్నికలు దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తాయి. 2027లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం మరోసారి అధికారాన్ని నిలబెట్టుకుంటుందా? లేక సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని ప్రతిపక్ష కూటమి బీజేపీకి గట్టి సవాల్ విసురుతుందా? అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 2017లో అధికారంలోకి వచ్చిన బీజేపీ, 2022లోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి యోగి ఆదిత్యనాథ్‌ను రెండోసారి ముఖ్యమంత్రిగా కొనసాగించింది. ఇప్పుడు మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో పార్టీ ముందుకు సాగుతుండగా, ప్రతిపక్షాలు ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మలుచుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. అయితే, ఎన్నికల ఫలితాన్ని ముందుగానే నిర్ణయించడం సాధ్యం కాదు. ప్రభుత్వ పనితీరు, నిరుద్యోగం, రైతుల సమస్యలు, కుల సమీకరణాలు, సంక్షేమ పథకాలు, స్థానిక నాయకత్వం వంటి అంశాలు ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేయనున్నాయి.

2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మార్చిన రాజకీయ లెక్కలు

యోగి ప్రభుత్వానికి మూడోసారి అధికారం దక్కుతుందా అనే చర్చకు ప్రధాన కారణం 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలే. ఆ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ 33 స్థానాలకే పరిమితమైంది. సమాజ్‌వాదీ పార్టీ 37, కాంగ్రెస్ ఆరు స్థానాల్లో విజయం సాధించాయి. 2019లో 62 స్థానాలు గెలుచుకున్న బీజేపీకి ఈ ఫలితాలు రాజకీయంగా ఎదురుదెబ్బగా నిలిచాయి.ఈ పరిణామం బీజేపీ వ్యూహాల్లో మార్పులకు దారితీసింది. పార్టీ నాయకత్వం బూత్ స్థాయి నుంచి సంస్థాగత బలాన్ని సమీక్షిస్తూ, గత ఎన్నికల్లో మద్దతు తగ్గిన ప్రాంతాలపై దృష్టి సారిస్తోంది. మరోవైపు, లోక్‌సభ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని అసెంబ్లీ ఎన్నికల్లోనూ కొనసాగించాలని సమాజ్‌వాదీ పార్టీ ప్రయత్నిస్తోంది.అయితే, లోక్‌సభ ఎన్నికల ఫలితాలే అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను నిర్ణయించవు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరు, స్థానిక అభ్యర్థులు, కూటములు, ప్రాంతీయ సమస్యలు అసెంబ్లీ ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తాయి.

యోగి ప్రభుత్వానికి కలిసొచ్చే అంశాలేంటి?

యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి ప్రధానంగా నాయకత్వం, శాంతిభద్రతలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎన్నికల్లో చర్చనీయాంశాలు కానున్నాయి. బీజేపీ తన పాలనలో నేరాల నియంత్రణ, రహదారుల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, మతపరమైన పర్యాటక కేంద్రాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చినట్లు ప్రచారం చేస్తోంది.అయోధ్యలో రామమందిర నిర్మాణం, నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు బీజేపీ రాజకీయ ప్రచారంలో ముఖ్యమైన అంశాలు. యోగి నాయకత్వాన్ని ముందుంచి ఎన్నికలకు వెళ్లేందుకు పార్టీ సిద్ధమవుతోంది. అలాగే, జాతీయ స్థాయిలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభావం, ఎన్డీయే మిత్రపక్షాల మద్దతు కూడా బీజేపీ వ్యూహంలో భాగం.అయితే, అభివృద్ధి పనులు చేపట్టడం ఒక్కటే ఓటర్ల మద్దతును నిర్ధారించదు. ఆ పనుల వల్ల తమ జీవితాల్లో వచ్చిన మార్పును ప్రజలు ఎలా అంచనా వేస్తారన్నదే కీలకం. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న సంతృప్తి, అసంతృప్తి నియోజకవర్గాలవారీగా భిన్నంగా ఉండవచ్చు.

నిరుద్యోగం.. యువత అసంతృప్తి సవాలుగా మారుతాయా?

బీజేపీ ప్రభుత్వానికి ప్రధాన సవాళ్లలో ఉద్యోగాల కల్పన, యువత ఆకాంక్షలు, పోటీ పరీక్షల నిర్వహణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లో యువ ఓటర్ల అభిప్రాయాలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.ప్రభుత్వం అభివృద్ధి, పెట్టుబడులు, సంక్షేమ పథకాల గురించి వివరిస్తుండగా, ప్రతిపక్షాలు ఉద్యోగాలు, ధరలు, రైతుల సమస్యలు, ప్రభుత్వ నియామకాల్లో పారదర్శకత వంటి అంశాలను ముందుకు తీసుకొస్తున్నాయి. యువతకు ఉద్యోగ అవకాశాలు ఎంతవరకు అందుబాటులోకి వచ్చాయి? ప్రభుత్వ నియామకాలపై నిరుద్యోగుల్లో ఎంత సంతృప్తి ఉంది? అనే ప్రశ్నలు ఎన్నికల ప్రచారంలో ప్రాధాన్యం పొందవచ్చు.అలాగే, రైతుల ఆదాయం, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు, గ్రామీణ మౌలిక సదుపాయాలు కూడా ముఖ్యమైన అంశాలుగా నిలవనున్నాయి. వీటిపై ప్రజల అనుభవాలు, ప్రభుత్వ చర్యలపై వారి అభిప్రాయాలు ఎన్నికల సమీకరణాలను ప్రభావితం చేయవచ్చు.



అఖిలేశ్ యాదవ్ వ్యూహం ఏమిటి?

2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో సమాజ్‌వాదీ పార్టీ తన రాజకీయ వ్యూహాన్ని మరింత విస్తరించేందుకు ప్రయత్నిస్తోంది. పార్టీ సంప్రదాయ మద్దతుదారులైన యాదవులు, ముస్లింలతో పాటు ఇతర వెనుకబడిన వర్గాలు, దళితులు, యువతలో మద్దతు పెంచుకోవడంపై అఖిలేశ్ యాదవ్ దృష్టి సారిస్తున్నారు.'పిచ్చా, దళిత్, అల్పసంఖ్యాక్' (గ్రాణూ) అనే సామాజిక సమీకరణాన్ని పార్టీ ప్రధానంగా ముందుకు తీసుకెళ్తోంది. కులాలవారీగా జనాభా ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం, ఉద్యోగాలు, యువత సమస్యలను ఎన్నికల చర్చలో భాగం చేయాలన్నది ఎస్పీ వ్యూహంగా కనిపిస్తోంది.అయితే, లోక్‌సభ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని అసెంబ్లీ ఎన్నికల్లోనూ పునరావృతం చేయడం సమాజ్‌వాదీ పార్టీకి సులభమైన విషయం కాదు. 403 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బలమైన స్థానిక నాయకత్వం, బూత్ స్థాయి కార్యకర్తలు, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాల్లో పార్టీ తన బలాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుంది.కాంగ్రెస్‌తో పొత్తు కొనసాగుతుందా? సీట్ల పంపకం ఎలా ఉంటుంది? రెండు పార్టీల మధ్య ఓట్ల బదిలీ ఎంతవరకు జరుగుతుంది? అనే అంశాలు కూడా ప్రతిపక్ష వ్యూహానికి కీలకం కానున్నాయి.

అయోధ్య కేంద్రంగా రాజకీయ పోరు

2024లో ఫైజాబాద్ లోక్‌సభ స్థానంలో సమాజ్‌వాదీ పార్టీ విజయం సాధించడం బీజేపీకి కీలక రాజకీయ పరిణామంగా నిలిచింది. రామమందిరం ఉన్న అయోధ్య ప్రాంతంలోనూ బీజేపీకి ఎదురుదెబ్బ తగలడంతో, అభివృద్ధి, మతపరమైన అంశాలు మాత్రమే ఎన్నికల్లో విజయాన్ని నిర్ధారించవని ప్రతిపక్షాలు వాదించాయి. 2027 ఎన్నికల నేపథ్యంలో యోగి ఆదిత్యనాథ్, అఖిలేశ్ యాదవ్ మధ్య అయోధ్య నుంచి పోటీ చేయడంపై సవాళ్లు, ప్రతిసవాళ్లు రాజకీయ చర్చకు దారితీశాయి. అయితే, వీరిద్దరూ అక్కడి నుంచి పోటీ చేస్తారనే విషయం ఇంకా ఖరారైన అభ్యర్థిత్వంగా పరిగణించకూడదు.అయోధ్యలో రహదారులు, మౌలిక సదుపాయాలు, స్థానిక వ్యాపారుల సమస్యలు, భూసేకరణపై అభిప్రాయాలు వంటి అంశాలు కూడా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కూడా మతపరమైన గుర్తింపు రాజకీయాలతో పాటు ప్రజల రోజువారీ సమస్యలు ఎన్నికల ప్రచారంలో ప్రాధాన్యం పొందే అవకాశం ఉంది.

సర్వేలు ఏం చెబుతున్నాయి?

అక్టోబర్ 2026లో ప్రచురితమైన న్యూస్18 నెట్‌వర్క్ సర్వే కథనం ప్రకారం, సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు ఉత్తరప్రదేశ్‌లోని 75 జిల్లాల్లో 30,925 మందిని సర్వే చేశారు. ఈ సర్వేలో ఎన్డీయేకు 66.6 శాతం, సమాజ్‌వాదీ పార్టీ--కాంగ్రెస్ కూటమికి 26.4 శాతం, బహుజన్ సమాజ్ పార్టీకి 5.4 శాతం మద్దతు లభించినట్లు వెల్లడించారు. శాంతిభద్రతలు, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలపై ప్రభుత్వానికి అనుకూల అభిప్రాయాలు ఉన్నాయని కూడా ఆ కథనం పేర్కొంది. ఉద్యోగాలకు సంబంధించిన ఆందోళనలు బీజేపీకి సవాలుగా ఉండవచ్చని తెలిపింది.అయితే, ఈ గణాంకాలను తుది ఎన్నికల ఫలితాలుగా చూడకూడదు. ఇది ఒక నిర్దిష్ట కాలంలో నిర్వహించిన సర్వే మాత్రమే. సర్వే పద్ధతి, నమూనా ఎంపిక, ప్రశ్నల రూపకల్పన, ఓటర్ల అభిప్రాయాల్లో కాలానుగుణ మార్పులు ఫలితాల అంచనాపై ప్రభావం చూపవచ్చు. ఇతర సర్వేలు భిన్నమైన చిత్రాన్ని చూపించే అవకాశం కూడా ఉంది.

బీఎస్పీ పాత్రను విస్మరించలేం

మాయావతి నేతృత్వంలోని బహుజన్ సమాజ్ పార్టీ 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క స్థానానికే పరిమితమైంది. అయినప్పటికీ, దళిత ఓటర్లలో పార్టీకి ఉన్న సంప్రదాయ మద్దతు కారణంగా 2027 ఎన్నికల్లో దాని పాత్రను పూర్తిగా విస్మరించలేం.బీఎస్పీ ఒంటరిగా పోటీ చేయాలని ప్రకటించిన నేపథ్యంలో, ఆ పార్టీ సాధించే ఓట్ల శాతం ఏయే నియోజకవర్గాల్లో ఎవరికి ప్రయోజనం కలిగిస్తుందన్నది ఆసక్తికరంగా మారనుంది. దళిత ఓటర్ల మద్దతు ఏ పార్టీ వైపు ఎంతవరకు మళ్లుతుంది? మాయావతి ప్రచారం ఏ ప్రాంతాల్లో ప్రభావం చూపుతుంది? అనే అంశాలు ఎన్నికల సమీకరణాల్లో భాగం కానున్నాయి.

యోగి మూడోసారి అధికారంలోకి వస్తారా?

యోగి ఆదిత్యనాథ్‌కు మూడోసారి అధికారాన్ని నిలబెట్టుకునే అవకాశం ఉందా అనే ప్రశ్నకు ఇప్పుడే ఖచ్చితమైన సమాధానం చెప్పడం సాధ్యం కాదు. బీజేపీకి సంస్థాగత బలం, నాయకత్వం, సంక్షేమ పథకాలు, శాంతిభద్రతలపై ప్రచారం వంటి అనుకూల అంశాలు ఉన్నాయి. మరోవైపు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎదురైన పరాజయం, నిరుద్యోగం, స్థానిక స్థాయిలో ప్రభుత్వ వ్యతిరేకత, కుల సమీకరణాలు, ప్రతిపక్షాల ఐక్యత వంటి అంశాలు సవాళ్లుగా మారవచ్చు.

సమాజ్‌వాదీ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన విజయాన్ని అసెంబ్లీ స్థాయిలో నిలబెట్టుకోవడం, కాంగ్రెస్‌తో సమన్వయం సాధించడం, విస్తృత సామాజిక మద్దతును పొందడం కీలకం. బీజేపీకి కూడా గత విజయాలపై ఆధారపడకుండా స్థానిక సమస్యలను పరిష్కరించడం, అభ్యర్థుల ఎంపికలో జాగ్రత్త వహించడం, కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం అవసరం. 2027 ఉత్తరప్రదేశ్ ఎన్నికలు యోగి ఆదిత్యనాథ్ నాయకత్వానికి, అఖిలేశ్ యాదవ్ ప్రతిపక్ష వ్యూహానికి కీలక పరీక్షగా నిలవనున్నాయి.

మూడోసారి అధికారంలోకి రావాలన్న బీజేపీ లక్ష్యం ఒకవైపు, ప్రభుత్వాన్ని మార్చాలన్న ప్రతిపక్షాల ప్రయత్నం మరోవైపు కొనసాగుతున్నాయి. చివరకు ఓటర్లు ఏ అంశానికి ప్రాధాన్యం ఇస్తారు, ఎన్నికల నాటికి రాజకీయ సమీకరణాలు ఎలా మారతాయి, అభ్యర్థుల ఎంపిక ఎలా జరుగుతుంది అన్నదానిపైనే ఫలితం ఆధారపడి ఉంటుంది.

ప్రపంచాన్ని భయపెడుతున్న మరో కొత్త వైరస్ ... తొలిసారి మనుషులకు సోకడంతో వైద్య రంగం షాక్



ప్రపంచాన్ని కోరనా మహమ్మారి ఎంతగా వణికించిందో అందరికీ తెలిసిందే. ఆ వైరస్ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది మృత్యువాత పడ్డారు. అయితే, ప్రస్తుతం మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. మనుషులలో ఎప్పుడూ చూడని ఒక కొత్త వైరస్ ఫ్రాన్స్‌లో తొలిసారిగా వెలుగుచూడటం ఇప్పుడు తీవ్ర కలకలం రేపుతోంది. సాధారణంగా మూగజీవాలకు మాత్రమే సోకే 'షమోండా వైరస్' ఒక వ్యక్తిలో బయటపడటమే కాకుండా, ఆ వ్యక్తి మరణించాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా కీటకాల ద్వారా మనుషులకు వ్యాపిస్తున్న ఈ వైరస్ భవిష్యత్తులో కొత్త మహమ్మారిగా మారుతుందా అనే భయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఈ వింత వైరస్ వ్యాప్తి వైద్య రంగాన్ని తీవ్ర ఉత్కంఠకు గురిచేస్తోంది.ఫ్రాన్స్‌లో మొట్టమొదటిసారిగా మానవుడిలో 'షమోండా వైరస్' వెలుగుచూడడం వైద్య వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ వైరస్ బారిన పడిన ఒక వ్యక్తి ఈ నెలలో మృతి చెందగా, ఆయన మరణానికి ఈ వైరస్ ఏమైనా కారణమా అనే కోణంలో ప్రస్తుతం సమగ్ర దర్యాప్తు జరుగుతోంది. యూరోపియన్ సెంటర్ ఫర్ డిసీజ్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఈ విషయాన్ని అధికారికంగా ధృవీకరించింది.సాధారణంగా బన్యావైరస్ కుటుంబానికి చెందిన ఈ షమోండా వైరస్.. పశువులు, గొర్రెలు, మేకలు, గుర్రాల వంటి జంతువులలో 'మిడ్జెస్' అనే కీటకాల కాటు ద్వారా వ్యాపిస్తుంది. గత వేసవిలో యూరోపియన్ దేశాల్లోని పశువులలో తొలిసారిగా బయటపడిన ఈ వైరస్, జంతువులలో డయేరియా, ఆకలి మందగించడం, పాలు ఉత్పత్తి తగ్గడం వంటి సమస్యలను కలిగిస్తుంది.ఫ్రాన్స్‌లో ఈ వైరస్ సోకిన వ్యక్తికి ఇదివరకే తీవ్ర అనారోగ్యం ఉండడంతో పాటు రోగనిరోధక శక్తి బలహీనపడి ఉందని ఈసీడీసీ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ వ్యక్తి మృతికి ఈ వైరస్ ఏ మేరకు కారణమైందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదని, దీనికి సంబంధించిన ఇన్వెస్టిగేషన్ ఎలా సాగుతోందనే అంశంపై వైద్య నిపుణులు లోతైన పరిశోధనలు చేపట్టారు.ఈ ఘటనపై స్పందించిన లివర్‌పూల్ విశ్వవిద్యాలయానికి చెందిన పాండమిక్ ఇన్‌సైట్స్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ టాం సోలమన్.. సాధారణ ప్రజలకు దీనివల్ల ముప్పు చాలా తక్కువని స్పష్టం చేశారు. ఇప్పటివరకు జంతువులలో మాత్రమే సంచరిస్తున్న ఈ వైరస్ మనుషులకు సోకడం అత్యంత అరుదని, అలాగే మనుషుల నుంచి మనుషులకు ఈ వైరస్ వ్యాప్తి చెందుతుందనేందుకు ఎలాంటి ఆధారాలు లేవని చెప్పారు.మిడ్జ్ అనే కీలకం ద్వారా సంక్రమించే ఈ వైరస్ ను తొలిసారి 1960ల్లో నైజీరియాలో కనుగొన్నారు. ఇది ఈ ఏడాది ఐరాపా దేశాలకూ విస్తరించింది. ప్రస్తుతానికి ఈ వైరస్ వల్ల వచ్చే పెద్దముప్పు ఏమీ లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు.

సమాధానం చెప్పే దమ్ములేక జగన్‌పై వ్యక్తిగత దాడి ...ఫేక్ ప్రచారంతో నిజాలను చెరిపేయలేరు : సజ్జల రామకృష్ణారెడ్డి

నామినేషన్లు అడ్డుకోవడమేనా చంద్రబాబు చెప్పే ప్రజాస్వామ్యం...వైఎస్ కుటుంబాన్ని రాజకీయాల్లోకి లాగడం చంద్రబాబు దిగజారుడుతనం...వ్యక్తిత్వ హననం కాదు.. దమ్ముంటే పాలనపై చర్చకు రావాలి...నామినేషన్ల అడ్డగింతలు, దాడులపై స్వతంత్ర విచారణ జరపాలి...సీసీటీవీ ఫుటేజీ,నామినేషన్ స్వీకరణ రసీదులు, తిరస్కరణ కారణాలను పరిశీలించాలి...పోలీసుల చర్యలు, గృహనిర్బంధాలు, ముళ్ల కంచెల ఏర్పాటుపై విచారణ జరపాలి...వైఎస్సార్‌సీపీ పేరుతో దాఖలు చేసిన నకిలీ నామినేషన్లకు ఎస్ఈసీ సమాధానం చెప్పాలి

విజయవాడ (స్వర్ణాంధ్రప్రతినిధి) : వైఎస్ జగన్ గారు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక చంద్రబాబు అసలు విషయాన్ని పక్కదారి పట్టిస్తూ అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించకుండా, ఎన్నికల ప్రక్రియలో చోటుచేసుకుంటున్న దారుణాలను కప్పిపుచ్చేందుకు వాస్తవాలను వక్రీకరించి కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని సజ్జల ఆరోపించారు. నామినేషన్ల అడ్డగింతపై ఉన్న ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీని పరిశీలించకుండా అధికారుల నివేదికలతోనే సరిపెట్టుకోవడం ద్వారా అసలు వాస్తవాలను కప్పిపుచ్చే పరిస్థితి ఏర్పడుతోందని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా అమలు చేసి నిజాలను వెలుగులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలను చించివేయడం, సరైన పత్రాలు సమర్పించినా తిరస్కరించారన్న ఆరోపణలపై సమాధానం చెప్పకుండా జగన్ గారిపై వ్యక్తిత్వ హననానికి దిగడం ఏమిటని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నాయకులను గృహనిర్బంధం చేయడం, పోలీసులతో అడ్డంకులు సృష్టించడం, సుప్రీంకోర్టు మార్గదర్శకాల తర్వాత కూడా ముళ్ల కంచెలు వేయడంపై ప్రభుత్వం, పోలీసు శాఖ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ పేరుతో టీడీపీ నకిలీ నామినేషన్లు దాఖలు చేసిందన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని కోరారు. నామినేషన్ల అడ్డగింతపై వచ్చిన ఫిర్యాదులను సీసీటీవీ ఫుటేజీ, నామినేషన్ రసీదులు, తిరస్కరణ కారణాలతో పరిశీలించకుండా రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారుల నివేదికలతోనే సరిపెట్టుకోవడం సరికాదన్నారు. గతంలో ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించిన చంద్రబాబు, ఇప్పుడు ఎన్నికల ప్రక్రియపై మాట్లాడే ముందు తన గత వైఖరిపై సమాధానం చెప్పాలని అన్నారు. రెండున్నరేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పకుండా జగన్ గారి కుటుంబం, ఆస్తుల గురించి మాట్లాడటం, ఎల్లో మీడియా ద్వారా తప్పుడు వార్తలు ప్రచారం చేయించడం చంద్రబాబు రాజకీయ పద్ధతిగా మారిందని విమర్శించారు. తనపై వస్తున్న ఆరోపణలకు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై చంద్రబాబు ఆధారాలతో సమాధానం



చెప్పాలని, వ్యక్తిగత విమర్శలతో అసలు సమస్యల నుంచి తప్పించుకోలేరని సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు.



జగన్ గారు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే:

మైనర్ జగన్ గారు లేవనెత్తిన అసలు ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్న చిత్తశుద్ధి చంద్రబాబు లో లేదని స్పష్టమవుతోంది. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారన్న ఆరోపణలపై సమాధానం చెప్పాల్సింది పోయి, జగన్ గారిపై వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగడం అత్యంత ముఖ్యం, కానీ ఆ ప్రాథమిక అంశాన్నే పక్కనపెట్టి రాజకీయ నాటకాలు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ రౌడీయిజం చేసిందని ఆరోపిస్తున్న చంద్రబాబు, తమ అభ్యర్థులకు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారన్న ప్రశ్నకు మాత్రం ఎందుకు సమాధానం చెప్పడం లేదు? ఎక్కడెక్కడ నామినేషన్లు తిరస్కరించారు, ఎక్కడ పత్రాలు చించివేశారు, ఎక్కడ అభ్యర్థులను అడ్డుకున్నారు అనే అంశాలపై విచారణకు సిద్ధంగా ఉన్నారా? జగన్ గారు ఆధారాలతో ప్రశ్నలు లేవనెత్తితే వాటికి సమాధానం చెప్పకుండా వ్యక్తిత్వ హననానికి దిగడం చంద్రబాబు చూస్తే ఆయనలో భయం కనిపిస్తోంది. అసలు సమస్య నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి చంద్రబాబు చేసే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారు.

ప్రజాస్వామ్యంపై ప్రజలకు నమ్మకం కలిగేలా ఎన్నికల సంఘం వ్యవహరించాలి:

మా ప్రధాన ప్రశ్న ఒక్కటే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి వెళ్తే వారిని ఎందుకు అడ్డుకున్నారు? నామినేషన్ పత్రాలు చించివేశారన్న ఆరోపణలు ఎందుకు వచ్చాయి, పత్రాలు సమర్పించినట్లు రసీదులు ఉన్న చోట కూడా తిరస్కరణలు ఎందుకు జరిగాయి? నామినేషన్లు వేయకుండా అడ్డుకున్న విధానాలకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని చెబుతున్నప్పుడు, వాటిని పరిశీలించి వాస్తవాలను వెల్లడించాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులపై ఉంది. వైఎస్సార్‌సీపీ నాయకులను గృహనిర్బంధం చేయడం, రాకపోకలకు అడ్డంకులు కల్పించడం, సుప్రీంకోర్టు మార్గదర్శకాల తర్వాత కూడా ముళ్ల కంచెలు వేయడం వంటి చర్యలపై పోలీసు శాఖ సమాధానం చెప్పాలి. వైఎస్సార్‌సీపీ పేరుతో టీడీపీ వ్యక్తులే నకిలీ నామినేషన్లు దాఖలు చేశారన్న ఆరోపణలు వచ్చినప్పుడు, ఆ పత్రాలను పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు అందినప్పుడు సీసీటీవీ ఫుటేజీ, నామినేషన్ రసీదులు, తిరస్కరణ కారణాలు, సంబంధిత రికార్డులను స్వయంగా పరిశీలించాలి. అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకోవడమే కాకుండా, ఫిర్యాదులపై స్వతంత్ర విచారణ జరిపి ప్రజాస్వామ్యంపై ప్రజలకు నమ్మకం కలిగించాలి.

సుప్రీంకోర్టు మార్గదర్శకాలఅమలులోనిర్లక్ష్యంపై సమాధానం చెప్పాలి:

రాష్ట్ర ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధమైన సంస్థగా వ్యవహరించాలి తప్ప, అధికారుల నివేదికలను యథాతథంగా స్వీకరించి ఫిర్యాదులను ముగించే సంస్థగా మిగిలిపోకూడదు. ఫిర్యాదులు వచ్చినప్పుడు సీసీటీవీ దృశ్యాలు, నామినేషన్ పత్రాలు, స్వీకరణ రసీదులు, తిరస్కరణకు ఇచ్చిన కారణాలు పరిశీలించకుండా నిష్పక్షపాత ఎన్నికలు ఎలా సాధ్యమవుతాయి? ఎన్నికల షెడ్యూల్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, వాటికి సంబంధించిన సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయడంలో ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా దానిపై సమాధానం చెప్పాల్సిందే. సుప్రీంకోర్టు ప్రస్తావించిన మార్గదర్శకాలను పాటించకుండా, జరిగిన పరిణామాలను కప్పిపుచ్చే ప్రయత్నం జరుగుతోందన్న మా ఆందోళనను తేలికగా తీసుకోకూడదు. గతంలో నిమ్మగడ్డ రమేష్‌కుమార్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా ఉన్న సమయంలో ఎన్నికల నిర్వహణపై జరిగిన పరిణామాలు, ఆ తర్వాత నీలం సాహ్ని బాధ్యతలు చేపట్టిన సందర్భాన్ని కూడా చంద్రబాబు గుర్తుచేసుకోవాలి.

రెండున్నరేళ్ల పాలనా వైఫల్యాలపై సమాధానం చెప్పకుండా..:

చంద్రబాబు రెండున్నరేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏవి అమలు చేశారో, రాష్ట్రానికి ఏం చేశారో ముందుగా చెప్పాలి. ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం ఉంటే ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్ల దశలోనే అడ్డుకోవాల్సిన అవసరం ఏముంది? ప్రజల ముందుకు వెళ్లి తమ పనితీరును వివరించాల్సిన ప్రభుత్వం, ప్రత్యర్థులను పోటీ నుంచి తప్పించే షార్ట్‌కట్ రాజకీయాలకు పాల్పడుతోంది. తనపై వస్తున్న విమర్శలకు వాస్తవాలతో సమాధానం ఇవ్వకుండా, జగన్ గారి వ్యక్తిత్వం, కుటుంబం, ఆస్తుల గురించి మాట్లాడటం చంద్రబాబు చౌకబారు రాజకీయాలకు నిదర్శనం. జగన్ గారి కుటుంబాన్ని, వ్యక్తిగత జీవితాన్ని రాజకీయ వివాదాల్లోకి లాగడం ద్వారా ఎన్నికల అక్రమాలపై ఉన్న ప్రశ్నలు మాయమైపోవు. చంద్రబాబు పర్యటనలు, హడావుడి, నైతిక విలువల గురించి చేసే ప్రసంగాలు ప్రజలకు జవాబుదారీతనాన్ని చూపించాలి తప్ప, అసలు సమస్యల నుంచి తప్పించుకునే సాధనాలుగా మారకూడదు. ప్రతిపక్షంపై వ్యక్తిగత దాడులు చేయడం ద్వారా బాధ్యత నుంచి తప్పించుకోలేరు.

చంద్రబాబు ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీలు నడుపుతున్నాడు:

జగన్ గారి గురించి తప్పుడు కథనాలు సృష్టించి ప్రచారం చేయడంలో చంద్రబాబు ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీలా వ్యవహరిస్తున్నారు. అబద్ధాలను పదేపదే చెప్పినంత మాత్రాన అవి నిజాలు కావు. చంద్రబాబు ప్రెస్‌మీట్‌లో చెప్పిన ఆరోపణలన్నీ నిజాలేనని భావించడానికి ఆధారాలు చూపించాలి. జగన్ గారిపై వ్యక్తిత్వ హననం చేయడం, ఎల్లో మీడియా ద్వారా తప్పుడు వార్తలను ప్రచారం చేయడం, వాటినే మళ్లీ రాజకీయ వేదికలపై చదివి వినిపించడం వల్ల ప్రజలు వాస్తవాలను మరిచిపోరు. జగన్ గారి కుటుంబం, ఆస్తులు, ఇళ్లు లేదా ప్యాలెస్‌ల గురించి మాట్లాడే ముందు చంద్రబాబు తన కుటుంబం, తన ఆస్తులు, తన నివాసాలు, తన రాజకీయ ప్రవర్తనపై వచ్చే ప్రశ్నలకు కూడా సమాధానం చెప్పాలి. తన తమ్ముడు రామమూర్తి నాయుడు గురించి సహా కుటుంబ సంబంధిత అంశాలను రాజకీయ విమర్శల్లోకి తెస్తున్నప్పుడు, ఎవరి వ్యక్తిగత జీవితాన్ని ఎవరు రాజకీయ ఆయుధంగా ఉపయోగిస్తున్నారో ప్రజలు ప్రశ్నిస్తారు. మైనర్ కుటుంబం ప్రజాసేవ, విలువలు, ప్రజలతో ఉన్న అనుబంధం విషయంలో చంద్రబాబు కుటుంబంతో పోల్చలేనిది. అందుకే వ్యక్తిగత దూషణలతో ప్రజలను డైవర్ట్ చేయాలని చూస్తున్నాడని సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు.

ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా చంద్రబాబుకు దాసోహం : లేళ్ల అప్పిరెడ్డి

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల స్క్రూటినీలో కూటమి పక్షపాతిగా ఆయన చర్యలు...కుట్రపూరితంగానే వైఎస్సార్సీపీ అభ్యర్థుల నామినేషన్ తిరస్కరణ... టీడీపీ నేతలే నకిలీ నామినేషన్లు వేస్తూ ఫేక్ ప్రక్రియను సాగిస్తున్నారు...కుప్పంలో జరుగుతున్న దారుణాలకు చంద్రబాబు ఏం సమాధానం చెబుతారు.. ఎస్ఈసీ పోస్టాఫీసులా వ్యవహరిస్తే ఎలా.. కూటమి అరాచకాలు, అక్రమాలపై వైసీపీ చేసిన ఫిర్యాదులపై చర్యలేవీ..

విజయవాడ: రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పూర్తిగా దాసోహం అయ్యారని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ధ్వజమెత్తారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల స్క్రూటినీలో అధికార పార్టీకి పక్షపాతిగా వ్యవహరిస్తూ వారికి అనుకూలంగా చర్యలు తీసుకోవడం దారుణమని దుయ్యబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, స్క్రూట్నీలో కూటమి పక్ష పాతంగా అధికారుల వ్యవహరిస్తున్న తీరుపై స్టేట్ ఎలక్షన్ కమిషన్ కు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితో పాటుగా పలువురు నాయుకులు అధికారులను కలసి ఆధారాలతో ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తూ, అధికార పార్టీ సాగిస్తున్న ఆరాచకాలపై ఎన్ని ఫిర్యాదులు చేసినా రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ఏమాత్రం స్పందించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణలో కొత్త కొత్త నిబంధనలు తెరపైకి తెస్తూ, అధికార పార్టీ ముసుగులో, చట్టాల లోసుగులను వాడుతూ అభ్యర్థిత్వాలను తిరస్కరణకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల పేరుతో టీడీపీ నేతలే నకిలీ నామినేషన్లు వేస్తూ ఎస్ఈసీ సహకారంతో ఫేక్ నామినేషన్ల ప్రక్రియను సాగిస్తున్నారని లేళ్ల అప్పిరెడ్డి స్పష్టం చేసారు. సాక్షాత్తు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు జారీ చేసిన ఆదేశాలను సైతం ఖాతరు చేయకుండా కూటమికి బానిసలుగా పని చేస్తున్న అధికారులను మైఎస్సార్సీపీ ప్రభుత్వం వచ్చాక ఎట్టిపరిస్థితుల్లోనూ చట్టం ముందు నిలబెడతామని తేల్చి చెప్పారు. ఈ ప్రెస్ మీట్ లో ఆయన ఇంకా ఏం మాట్లాడరంటే...

వైఎస్సార్సీపీ ఫిర్యాదులపైచర్యలేవీ..? క్షేత్రస్థాయిలో ఎస్ఈసీ పరిశీలన చేయరా..?

ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలు, అధికార పార్టీ నాయకుల ప్రవర్తన, అధికారుల తీరుపై మేము ప్రతిరోజూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేస్తున్నాం. అయితే మా ఫిర్యాదులను స్వీకరించి కిందిస్థాయి అధికారులకు పంపిస్తున్నామని చెప్పడం తప్ప, వాటిపై సమర్థవంతమైన చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘం కేవలం పోస్టాఫీసులా వ్యవహరిస్తే ఎలా?మేం చేసిన ఫిర్యాదులపై ఎస్ఈసీ గానీ, ఆయన సిబ్బంది గానీ ఎన్నడైనా, ఎక్కడైనా సరే క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించి తెలుసుకున్న దాఖలాలు కూడా లేవు. నామినేషన్ల పరిశీలన సమయంలో అభ్యర్థులు సమర్పించిన పత్రాలు, ఆస్తిపన్ను వివరాలు, ఓటరు జాబితా వివరాలు, స్వీయ ధ్రువీకరణ పత్రాలు తదితర అంశాలను పరిశీలించాలి. కానీ ఇప్పుడు నిబంధనలను తమకు అనుకూలంగా అన్వయించుకుంటూ, చిన్నచిన్న సాంకేతిక కారణాలతో నామినేషన్లను తిరస్కరిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. ఓటరు సీరియల్ నంబర్‌లో అంకె మారిందనే కారణంతో అభ్యర్థిని అనర్హుడిగా ప్రకటించడం, రుణాలపై వడ్డీ బకాయిలున్నాయనే సాకుతో నామినేషన్ తిరస్కరించడం, ప్రభుత్వ పథకం కింద ఇల్లు పొందిన అభ్యర్థి వివరాలు చూపలేదంటూ అభ్యంతరాలు వ్యక్తం చేయడం వంటి చర్యలు ఎస్ఈసీ కూటమి పక్షపాతిగా వ్యవహరిస్తుందనేందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ పేరుతో నామినేషన్లు వేసిన కొందరు వ్యక్తులకు తెలుగుదేశం పార్టీ నాయకులతో సంబంధాలున్నాయనే ఆధారాలు లభించాయి. కుప్పం వంటి ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన వ్యక్తుల రాజకీయ నేపథ్యం, వారి అనుబంధాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక పార్టీకి చెందిన వ్యక్తులు మరో పార్టీ పేరుతో నామినేషన్లు వేసి, ఆ తర్వాత వాటిని ఉపసంహరించుకుంటే అసలు పోటీలో ఉన్న అభ్యర్థులను అడ్డుకోవడానికి అది ఒక మార్గంగా మారే ప్రమాదం ఉంది. ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘం స్వతంత్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలి. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

కుప్పంలో చంద్రబాబు కుట్రలు బహిర్గతం

ఎన్నికల విలువలు, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుగా తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో జరుగుతున్న పరిణామాలపై సమాధానం చెప్పాలి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి వెళ్లినప్పుడు అడ్డంకులు ఎదురవుతున్న ఘటనలను చూసాం. పార్టీ అభ్యర్థులను తీసుకెళ్లే ప్రయత్నాలపై దాడులు జరిగాయని కూడా ఫిర్యాదులు వచ్చాయి. మరోవైపు వైఎస్సార్‌సీపీ పేరుతో నామినేషన్లు వేసిన వారి రాజకీయ నేపథ్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశాలపై ఎన్నికల సంఘం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా విచారణ చేపట్టాలి. ముఖ్యమంత్రి దేశంలో ప్రధానమంత్రిని, రాష్ట్రపతిని నిర్ణయించడంలో తన పాత్ర గురించి గొప్పగా చెప్పుకోవచ్చు. కానీ వైఎస్సార్‌సీపీ తరఫున ఎవరు పోటీ చేయాలో నిర్ణయించే హక్కు మాత్రం ఆయనకు లేదు. ఇతర పార్టీల అభ్యర్థులను నిర్ణయించే సంస్కృతిని తీసుకురావద్దని చంద్రబాబుకు స్పష్టం చేస్తున్నాం.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలేమయ్యాయి..?

ఎన్నికల ప్రక్రియలో చోటుచేసుకున్న ఘటనలపై సుప్రీంకోర్టు దృష్టి సారించిన నేపథ్యంలో, రాష్ట్ర ఎన్నికల సంఘం మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. సమస్యాత్మక ప్రాంతాల్లో జరిగిన ఘటనలపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవ పరిస్థితులను న్యాయస్థానానికి నివేదించాలి. నామినేషన్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్న ఆదేశాలను సమర్థంగా అమలు చేయాలి. నామినేషన్ కేంద్రాల్లోకి రాజకీయ నాయకులు ప్రవేశించి అధికారులపై ప్రభావం చూపుతున్నారనే ఆరోపణలు వస్తున్నప్పుడు, అక్కడి పరిస్థితులను పారదర్శకంగా పర్యవేక్షించాలి. కేవలం కిందిస్థాయి అధికారులు ఇచ్చే నివేదికలపై ఆధారపడకుండా, అవసరమైన చోట రాష్ట్ర ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి విచారణ జరపాలి. ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను కూడా ప్రజలకు వెల్లడించాలి.



తప్పు చేసిన అధికారులను వదిలిపెట్టం

రాష్ట్రంలో మైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల ప్రక్రియలో జరిగిన అక్రమాలు, అధికారుల వ్యవహారశైలి, రాజకీయ ఒత్తిళ్లకు లొంగి తీసుకున్న నిర్ణయాలపై చట్టపరమైన పరిధిలో విచారణ జరిపిస్తాం. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించినట్లు, అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు నిర్ధారణ అయితే వారిని చట్టం ముందు నిలబెట్టేందుకు చర్యలు తీసుకుంటాం. అధికారులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను విస్మరించవద్దు. నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలి. ఇకనైనా సరే రాష్ట్ర ఎన్నికల సంఘం తన రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను నిర్వర్తించి, స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాత ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలి. లేకుంటే ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుంది అని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి హెచ్చరించారు.

రూ.500 కోట్ల ఆడియో కలకలం.. మహారాష్ట్ర మిత్రపక్షాల్లో మాటల మంటలు

మహారాష్ట్ర అధికార కూటమిలో ఓ ఆడియో క్లిప్ తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. మరాఠా రిజర్వేషన్ల ఉద్యమ నేత మనోజ్ జారంగే పాటిల్‌కు, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నుంచి రూ. 500 కోట్లు అందినట్లు ఆరోపణలు రావడంతో మిత్రపక్షాలైన బీజేపీ, ఏక్‌నాథ్ షిండే వర్గం శివసేన మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఈ డబ్బును ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కుమారుడైన ఎంపీ శ్రీకాంత్ షిండే ద్వారా చేరవేశారని ఆ ఆడియోలో ఉండటం వివాదాన్ని మరింత రాజేసింది.గురువారం జాల్నాలో జరిగిన ప్రెస్ మీట్‌లో మనోజ్ జారంగే పాటిల్ ఈ ఆడియో క్లిప్‌ను బయటపెట్టారు. అందులో గుర్తు తెలియని మహిళ మాట్లాడుతూ 'శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే ద్వారా బీజేపీ పంపిన రూ. 500 కోట్లు ఆయనకు అందాయి' అని పేర్కొంది. అయితే, దీనిని జారంగే ఖండించారు. తాను ఎలాంటి డబ్బు తీసుకోలేదని స్పష్టం చేశారు. తనను గానీ, మరాఠా ఉద్యమాన్ని గానీ అప్రతిష్టపాలు చేసేందుకే ఈ క్లిప్ సృష్టించారని ఆరోపించారు. ఈ ఆడియో క్లిప్ ప్రామాణికత ఇంకా నిర్ధారణ కాలేదు.ఈ ఆరోపణలను ఏక్‌నాథ్ షిండే, శ్రీకాంత్ షిండే తీవ్రంగా ఖండించారు. "నేను 500 కోట్లు ఇవ్వలేదు, తీసుకోలేదు" అని ఉప ముఖ్యమంత్రి తేల్చిచెప్పారు. మరోవైపు, శ్రీకాంత్ షిండే వ్యంగ్యంగా స్పందిస్తూ.. అంత పెద్ద మొత్తంలో డబ్బు ఎక్కడుందో తానే వెతుకుతున్నానని, అంత భారీ నగదును తరలించడం ఎంత కష్టమో ఆలోచించాలని అన్నారు.ఈ వివాదం మరో మలుపు తీసుకుంది. శివసేన సీనియర్ నేత రామ్‌దాస్ కదమ్ సంచలన ఆరోపణలు చేశారు. ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను రాజకీయంగా దెబ్బతీసేందుకు బీజేపీలోని కొందరు కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. బీజేపీ ఎమ్మెల్సీలు ప్రవీణ్ దారేకర్, ప్రసాద్ లాడ్‌లను ప్రస్తావిస్తూ, జారంగే పాటిల్‌తో లాడ్ ఉన్న ఫొటోలను ప్రదర్శించారు. అయితే, బీజేపీ నేతలు ఈ ఆరోపణలను ఖండించారు.వివాదం ముదరడంతో శివసేన ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిసింది. అనంతరం, ఫడ్నవీస్ ఈ ఆడియో క్లిప్‌పై ఫోరెన్సిక్ విచారణకు ఆదేశించారు. మరోవైపు, ఈ వ్యవహారంపై దర్యాప్తు జరపాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు శివసేన లేఖ రాసింది. ప్రస్తుతం ఇరుపక్షాల నేతలు వివాదాన్ని చల్లార్చే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, ఈ ఘటన మహాయుతి కూటమిలోని అంతర్గత విభేదాలను మరోసారి బయటపెట్టింది.



కుక్క కరిచిన ఆవు మృతి.. పాలు తాగిన 450మందికిటీకాలు..పాలతో రేబిస్ సోకుతుందా?

ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జిల్లాలో చోటుచేసుకున్న ఒక ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వీధి కుక్క కరవడంతో అనారోగ్యానికి గురైన ఒక ఆవు ఇటీవల మృతి చెందింది. అయితే ఆ ఆవు ఇచ్చిన పాలను స్థానికులు ప్రసాదం తయారీకి, ఇతర గృహ అవసరాలకు ఉపయోగించారు. దీంతో ఆ పాలను వినియోగించిన రెండు గ్రామాల ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ముందుజాగ్రత్త చర్యగా సుమారు 450 మంది స్థానిక ఆరోగ్య కేంద్రాల్లో రేబిస్ టీకాలు వేయించుకున్నారు. ఈ ఘటనతో "రేబిస్ సోకిన జంతువుల పాలు తాగితే మనుషులకు ఆ వ్యాధి వస్తుందా?" అనే సందేహం అందరిలోనూ మొదలైంది. సాధారణంగా రేబిస్ అనేది ఒక ప్రాణాంతక వైరల్ వ్యాధి. రేబిస్ బారిన పడిన జంతువులు కరిచినా లేదా వాటి లాలాజలం మనుషుల గాయాలకు, కళ్లు, నోరు వంటి శ్లేష్మ పొరలకు తగిలినా ఈ వైరస్ వ్యాపిస్తుంది. అయితే, పాలు లేదా పాల ఉత్పత్తుల ద్వారా రేబిస్ వ్యాపిస్తుందనడానికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవు అని 'జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం' స్పష్టం చేసింది. ఇప్పటివరకు నిర్వహించిన పరిశోధనల్లో పాల ద్వారా ఈ వ్యాధి సోకినట్లు దాఖలాలు లేవని, కాబట్టి ఆ పాలు తాగినంత మాత్రాన టీకాలు తీసుకోవాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. అయినప్పటికీ, రేబిస్ ఉన్నట్లు అనుమానం ఉన్న జంతువుల పాలను వాడకపోవడమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

పాదరసాన్ని బంగారంగా మార్చేశాం.. అమెరికా స్టార్టప్ సంచలన ప్రకటన

అణు సంలీన చర్యలో వెలువడిన న్యూట్రాన్లతో ఈ అద్భుతం సాధించామని వెల్లడి...సెర్న్ గత రికార్డును పది రెట్లు అధిగమించామన్న సంస్థ ...ప్రయోగ వివరాలు, ఉత్పత్తి అయిన బంగారం పరిమాణంపై గోప్యత ...వాణిజ్య స్థాయిలో బంగారం ఉత్పత్తికి ఇంకా చాలా సమయం పట్టవచ్చని నిపుణుల విశ్లేషణ



శతాబ్దాలుగా రసవాదులు కన్న కల... పనికిరాని లోహాలను విలువైన బంగారంగా మార్చాలన్న ఆశయం... సైన్స్ ఫిక్షన్ కథల్లో చదివిన అద్భుతం... ఇప్పుడు వాస్తవరూపం దాల్చింది. శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన 'మ్యారథాన్ ఫ్యూజన్' అనే స్టార్టప్, అణు సంలీన టెక్నాలజీని ఉపయోగించి పాదరసాన్ని స్థిరమైన బంగారంగా మార్చినట్లు ప్రకటించి సంచలనం సృష్టించింది. తాము సాధించిన ఈ ప్రక్రియను 'హై-రేట్ ఆల్కెమీ'గా అభివర్ణించిన ఈ సంస్థ, ప్రపంచ ప్రఖ్యాత పరిశోధన సంస్థ 'సెర్న్' రికార్డును సైతం 10 రెట్లు అధిగమించామని చెబుతోంది.

ప్రక్రియ ఎలా పనిచేస్తుంది?

రసాయనిక పద్ధతులతో ఒక మూలకాన్ని మరో మూలకంగా మార్చడం అసాధ్యం. కానీ, అణు కేంద్రకంలో మార్పులు తీసుకురావడం ద్వారా ఇది సాధ్యమేనని శాస్త్రవేత్తలు ఎప్పుడో నిరూపించారు. ఈ ప్రక్రియనే 'న్యూక్లియర్ ట్రాన్స్‌మ్యూటేషన్' అంటారు. మ్యారథాన్ ఫ్యూజన్ సరిగ్గా ఇదే చేసింది.

గత నెలలో జరిగిన ప్రయోగంలో, డ్యూటీరియం-ట్రిటియం అనే ఇంధనాలను ఉపయోగించి అణు సంలీన చర్యను ప్రారంభించారు. ఈ చర్యలో అత్యధిక శక్తి కలిగిన న్యూట్రాన్లు పుట్టుకొస్తాయి. ఈ న్యూట్రాన్లను పాదరసం ప్రత్యేక ఐసోటోప్ అయిన మెర్క్యురీ-198పైకి ప్రసరింపజేశారు. దీనివల్ల అది రేడియోధార్మికత కలిగిన మెర్క్యురీ-197గా మారింది. ఈ ఐసోటోప్ సుమారు 64 గంటల వ్యవధిలో సహజంగా క్షీణించి, స్థిరమైన గోల్డ్-197గా రూపాంతరం చెందింది. అలా పాదరసం కాస్తా మేలిమి బంగారంగా మారిపోయింది.

సెర్న్‌తో పోలిక.. కానీ ప్రశ్నలు అనేకం

నిజానికి ఇలా ఒక మూలకాన్ని మరో మూలకంగా మార్చడం ఇదే మొదటిసారి కాదు. 2025లో సెర్న్‌లోని లార్జ్ హాడ్రాన్ కొలైడర్‌లో సీసం నుంచి సుమారు 29 పికోగ్రాముల (ఒక గ్రాములో లక్ష కోట్ల వంతు) బంగారం ఉత్పత్తి అయినట్టు ప్రకటించారు. అయితే, మ్యారథాన్ ఫ్యూజన్ తమ ఉత్పత్తి రేటు దానికంటే 10 రెట్లు ఎక్కువని చెబుతోంది.అయితే, ఈ ప్రకటనలో కొన్ని కీలకమైన వివరాలు లోపించాయి. ప్రయోగంలో ఎంత పరిమాణంలో బంగారం ఉత్పత్తి అయింది, దాని స్వచ్ఛత ఎంత, ఈ ప్రక్రియకు అయిన ఖర్చు వివరాలను సంస్థ వెల్లడించలేదు. కేవలం ప్రయోగానికి సంబంధించిన కొన్ని గ్రాఫ్‌లను మాత్రమే సోషల్ మీడియాలో పంచుకుంది. దీంతో ఈ ప్రకటనపై శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఆసక్తితో పాటు అనేక ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.

భవిష్యత్తు అంచనాలు.. వాస్తవ సవాళ్లు

మ్యారథాన్ ఫ్యూజన్ 2025లోనే విడుదల చేసిన ఒక పరిశోధన పత్రంలో, వాణిజ్య స్థాయిలో ఒక గిగావాట్ సామర్థ్యం గల ఫ్యూజన్ పవర్ ప్లాంట్ ద్వారా ఏటా సుమారు రెండు టన్నుల బంగారం ఉత్పత్తి చేయవచ్చని అంచనా వేసింది. ఇది నిజమైతే ప్రపంచ బంగారం మార్కెట్‌పై పెను ప్రభావం చూపుతుంది. అయితే, ఇవి కేవలం సిమ్యులేషన్ల ఆధారంగా చేసిన అంచనాలు మాత్రమే. వాణిజ్య స్థాయిలో ఫ్యూజన్ రియాక్టర్లు అందుబాటులోకి రావడానికి ఇంకా దశాబ్దాల సమయం పట్టవచ్చు. అంతేకాక, ఈ పద్ధతిలో తయారైన బంగారంలో రేడియోధార్మిక అవశేషాలు ఉండే అవకాశం ఉందని, దానిని సురక్షితంగా మార్చేందుకు 14 నుంచి 18 ఏళ్ల నిల్వ ఉంచాల్సి రావచ్చని నివేదికలు చెబుతున్నాయి.కేవలం బంగారం తయారీ మాత్రమే కాకుండా, క్యాన్సర్ నిర్ధారణ, చికిత్సలో ఉపయోగపడే కాపర్-64, కాపర్-67 వంటి అత్యంత విలువైన వైద్య ఐసోటోపులను కూడా జింక్ నుంచి ఉత్పత్తి చేసినట్టు మ్యారథాన్ ఫ్యూజన్ ప్రకటించింది.మొత్తం మీద, ఒక మూలకాన్ని బంగారంగా మార్చడం శాస్త్రీయంగా సాధ్యమేనని మరోసారి నిరూపితమైంది. కానీ, దీనిని వాణిజ్యపరంగా లాభదాయకమైన, భారీ ఉత్పత్తి ప్రక్రియగా మార్చడానికి ఇంకా చాలా పరిశోధనలు, స్వతంత్ర ధ్రువీకరణ అవసరం. అప్పటి వరకు, ఆధునిక రసవాదం ఒక అద్భుతమైన శాస్త్రీయ ప్రయోగంగానే మిగిలిపోనుంది.

బీజేపీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో భయం పట్టుకుంది అందుకేనా?



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి భయం పట్టుకుంది. మూడు పార్టీల మధ్య సమన్వయం కుదురుతుందా? అన్నది వారి భయానికి కారణం. ఎందుకంటే గత శాసనసభ ఎన్నికల్లో తమ సీట్లను పొత్తులో భాగంగా తీసుకున్నారని పలు చోట్ల టీడీపీ నేతలు గుర్రుగా ఉన్నారు. దీంతో ఈ ఎన్నికల్లో వాళ్లు రివెంజ్ తీసుకుంటారేమోనన్న ఆందోళన బీజేపీ నేతల్లో స్పష్టంగా కనిపిస్తుంది. అనేక నియోజకవర్గాల్లో బీజేపీకి, టీడీపీ నేతలకు మధ్య సయోధ్య లేకపోవడంతో ఈ అనుమానాలకు ప్రధాన కారణంగా చూడాలి.అయితే స్థానిక సంస్థల ఎన్నికలలోనూ పొత్తులో భాగంగా తమ సీట్లలో కమలం పార్టీ వాళ్లు వచ్చి కూర్చున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. బీజేపీకి ఆంధ్రప్రదేశ్ లో ఓటు బ్యాంకు తక్కువే. టీడీపీ, జనసేనలపైనే ఆధారపడి గెలవాల్సి ఉంటుంది. ఒక ఉదాహరణ చూస్తే బీజేపీ నేతలు కూడా అలాగే ఉన్నారు. కోస్తా జిల్లాకు చెందిన ఒక బీజేపీ శాసనసభ్యుడు వైసీపీ నుంచి వచ్చిన వారిని నేరుగా టీడీపీలోకి పంపడం ఈ సందర్భంగా కొందరు గుర్తు చేసుకుని మరీ ఆందోళన చెందుతున్నారు.


లోలోపల మాత్రం...

కూటమిగా పోటీ చేస్తున్నప్పటికీ ఎక్కడో లోపల బ్యాక్ స్టాబింగ్ జరుగుతుందన్న ఆందోళన మాత్రం నెలకొని ఉంది. ఆంధ్రప్రదేశ్ జరుగుతున్న పట్టణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కలిసి కూటమిగా పోటీ చేస్తున్నాయి.బీజేపీ ఇటీవల తన అభ్యర్థుల తొలి జాబితాను కూడా విడుదల చేసింది అనంతపురం మేయర్ అభ్యర్థిగా కోట్ల అజేష్ బాబు సహా పలు మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానాలకు పేర్లు ఖరారు చేసింది. కానీ ఓట్ల బదిలీ అనేది ఈ ఎన్నికల్లో ప్రధాన అంశంగా మారనుంది. ఇప్పుడు పదవి బీజేపీకి అప్పగిస్తే భవిష్యత్ లో ఇదే స్థానాన్ని బీజేపీ కోరుకునే అవకాశముందని కూడా టీడీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు. అందుకే ఈ ఎన్నికల్లో సహాయ నిరాకరణ చేస్తారని, ప్రచారంలో నేతలు పాల్గొన్నా ఓటు బ్యాంకు తమకు బదిలీ కావడంపై అనేక సందేహాలను బీజేపీ రాష్ట్ర నేతలే వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. అయితే స్థానికంగా ఉన్న నేతలను సమన్వయం చేసుకుని వెళ్లాలని చంద్రబాబు సూచించినట్లు తెలిసింది.

సమన్వయ కమిటీలు..

జిల్లా నియోజకవర్గాల స్థాయిలో ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీలు కూడా ఎంత మాత్రం తమకు అనుకూలంగా ఓట్లు వచ్చే విధంగా వ్యవహరిస్తారన్న అనుమానాలను కమలనాధులను పట్టిపీడిస్తున్నాయి. అయితే ఎవరికీ చెప్పుకోలేని బాధ. పార్టీ అగ్రనాయకత్వం మాత్రం పార్టీ పట్ల అనుకూలంగానే ఉంది. కానీ టీడీపీలోని కింది స్థాయి నాయకులు మమాత్రం కలసి రావడం లేదు. శాసనసభ ఎన్నికలు వేరు. స్థానిక సంస్థల పోరు వేరు. రేపు పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ కార్యకర్తలు ఏ మాత్రం తమతో కలసి వస్తారన్న దానిపై కూడా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ నాయకత్వం కేవలం కూటమిలో పొత్తులో భాగంగా సీట్లు తెచ్చుకోవడంతో సరిపోదు. రేపు పోటీ చేసిన చోట్ల విజయం దక్కకపోతే అది బీజేపీ నేతల వైఫల్యంగానే చూస్తారు. టీడీపీ రాష్ట్ర నాయకత్వంలో మాత్రం కూటమిలోనూ అన్ని పార్టీలు వంద శాతం స్ట్రయిక్ రేట్ సాధించాలని భావిస్తుంది. ఒకవేళ అది రాకపోతే ప్రత్యర్థులకు బలం ఇచ్చినట్లవుతుంది. కానీ లోకల్ గా ఇలా ఆలోచించే నేతలు ఎందరున్నారన్నదే ఇప్పుడు ప్రశ్న. బీజేపీ లోలోపల భయపడుతున్నది మాత్రం ప్రత్యర్థి కంటే కూటమి నుంచే నని స్పష్టంగా చెప్పక తప్పదు.

చిన్న శ్రీను కూతురు నామినేషన్‌పై వివాదం... ఆమె బీసీ కాదంటూ వైసీపీ నేతల ఫిర్యాదు



ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇటీవల టీడీపీలో చేరిన విజయనగరం జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుమార్తె సిరి సహస్ర రెండు జెడ్పీటీసీ స్థానాల నుంచి నామినేషన్ వేసిన సంగతి తెలిసిందే. ఆమె కొత్తవలస, తెర్లాం జడ్పీటీసీ స్థానాలకు నామినేషన్ దాఖలు చేశారు. అయితే, సిరి నామినేషన్‌పై వివాదం నెలకుంది. ఆమె అసలు పేరు ముస్కాన్ జైన్ అని, తండ్రి పేరు రమేష్ జైన్ అని వైసీపీ ఆరోపిస్తోంది. ఓసీ కులానికి చెందిన వ్యక్తి, బీసీ సర్టిఫికెట్ సమర్పించడంపై వైసీపీ ఫిర్యాదు చేయడంతో ఉత్కంఠ రేపుతోంది. బీసీ రిజర్వేషన్ స్థానంలో ఓసీ వ్యక్తిని ఎలా పోటీలో కొనసాగిస్తారని వైసీపీ ప్రశ్నిస్తోంది.'న్యాయస్థానం ఆదేశాలకు విరుద్ధంగా తహసీల్దార్ బీసీ సర్టిఫికెట్ ఎలా ఇస్తారు..? అభ్యంతరాలు తెలిపిన తర్వాత ఎన్నికల అధికారులు నామినేషన్ ఎలా స్వీకరిస్తారు? ఆమె నామినేషన్ తిరస్కరించాలి' అని వైసీపీ డిమాండ్ చేస్తోంది. దీనిపై కోర్టును ఆశ్రయిస్తామని విజయనగరం వైసీపీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తెలిపారు.తెర్లాం జెడ్పీటీసీకి వైసీపీ నుంచి నామినేషన్ వేసిన అభ్యర్థి అక్టోబరు 24న రిటర్నింగ్ అధికారికి దీనిపై ఫిర్యాదు చేశారు. మజ్జి సిరి సహస్ర ఓపెన్ కేటగిరీ (ఓసీ)కి చెందిన వ్యక్తి అయినందున ఆమె నామినేషన్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.“మజ్జి సిరి సహస్ర అసలు పేరు ముస్కాన్ జైన్. ఆమె తండ్రి రమేష్ కుమార్ జైన్. వారి కులాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కడా బీసీగా గుర్తించలేదు... మజ్జి శ్రీనివాసరావు, సునీత దంపతులకు ఆమెను దత్తత ఇచ్చారనే వాదన ఆమె కులాన్ని మార్చదు.. కాబట్టి ఆమె ఎలాంటి బీసీ రిజర్వుడ్ సీటుకు అర్హురాలు కాదు... తాను తూర్పు కాపు అనే మెనుకబడిన తరగతికి చెందినట్లు పేర్కొంటూ నామినేషన్ దాఖలు చేశారు.. ఇది చట్టప్రకారం చెల్లదు... బీసీ వర్గానికి చెందిన వ్యక్తిగా నామినేషన్ ఫీజు రూ. 6000 కు బదులుగా రూ. 3000 మాత్రమే చెల్లించారు. పోటీ చేసే అభ్యర్థులకు ఇచ్చిన హ్యాండ్‌బుక్‌లోని చాప్టర్ ఎ రూల్ 2 (అ) లో స్పష్టంగా పేర్కొన్న ఎన్నికల నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన నామినేషన్ ఫీజు రూ. 6000 చెల్లించడంలో విఫలమయ్యారు. కాబట్టి ఆమె నామినేషన్‌ను తిరస్కరణకు అర్హమైనది... ఆమె బీసీకి చెందినట్లు కులధ్రువీకరణ పత్రాలు దాఖలు చేసినప్పటికీ, అవి చట్టప్రకారం చెల్లవు.. వాటిని తిరస్కరించాలి" అని తెర్లాం జెడ్పీటీసీ స్థానానికి పోటీచేసిన వైసీపీ అభ్యర్థి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో మజ్జి శ్రీనివాసరావు కుమార్తె నామినేషన్‌పై ఉత్కంఠ నెలకొంది.

ఎంపీటీసీ సీటు వేలంపాట.. వైసీపీ అభ్యర్థిని చెప్పుతో కొట్టిన మాజీ ఎమ్మెల్యే?

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల సమరంలో తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గంలోని ఊహించని ట్విస్ట్ ఎదురైంది. కోరుకొండ మండలం బుచ్చంపేట ఎంపీటీసీ స్థానం వద్ద జరిగిన పరిణామాలు ఇప్పుడు అనేక రాజకీయ ప్రశ్నలను తెరపైకి తెస్తున్నాయి. ఎన్నికల్లో పోటీ లేకుండా ఊరి ఆలయ అభివృద్ధి కోసం రూ. 16.80 లక్షలకు ఎంపీటీసీ సీటును ఏకగ్రీవం చేసేలా బహిరంగ వేలంపాట జరిగిందనే ప్రచారం స్థానికంగా తీవ్ర దుమారం రేపింది. ఈ క్రమంలో వైఎస్సార్సీపీ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణకు సిద్ధపడటం, ఆ తర్వాత జరిగిన హైడ్రామా నియోజకవర్గంలో తీవ్ర రాజకీయ వేడిని రాజేసింది.

అర్ధరాత్రి రంగంలోకి జక్కంపూడి...అభ్యర్థిపై దాడి ఆరోపణలు

తమ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి అనపర్తి మణికంఠ పోటీ నుంచి తప్పుకుంటున్నాడన్న సమాచారంతో వైఎస్సార్సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అర్ధరాత్రి తన అనుచరులతో కలిసి బుచ్చంపేటకు చేరుకున్నారు. ఊరి పెద్దల నిర్ణయం మేరకు ఏకగ్రీవానికి అంగీకరించానని అభ్యర్థి చెప్పడంతో, తమకు చెప్పకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని తెలుస్తోంది. ఈ క్రమంలో మణికంఠపై రాజా చేయి చేసుకున్నారని, ఆయన అనుచరులు చెప్పుతో కొట్టారని ఆరోపణలు రావడం, దీనిపై స్థానికులు ఎదురుతిరగడంతో తోపులాట జరిగి వాతావరణం ఉద్రిక్తంగా మారింది. ఆ తర్వాత వీఆర్వో ఫిర్యాదుతో జక్కంపూడి రాజాతో పాటు మరో పదిమందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పార్టీ లైన్ వర్సెస్ వేలంపాట రాజకీయం:

వైఎస్సార్సీపీ కేడర్ వాదన! ఈ వివాదంపై వైఎస్సార్సీపీ వర్గాల నుంచి భిన్నమైన వాదన వినిపిస్తోంది. పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల ప్రకారం స్థానిక సంస్థల్లో ఎక్కడా ఏకగ్రీవాలకు తలొగ్గకుండా గట్టి పోటీ ఇవ్వాలనేది జక్కంపూడి రాజా శైలి అని ఆయన మద్దతుదారులు అంటున్నారు. రాజానగరం పరిధిలో పార్టీకి క్షేత్రస్థాయిలో బలం ఉన్నప్పటికీ, ఎంపీటీసీ సీటును అధికార కూటమికి ఏకగ్రీవంగా వదిలేస్తే కేడర్ మనోధైర్యం దెబ్బతింటుందనే రాజా స్వయంగా రంగంలోకి దిగారని చెబుతున్నారు. నామినేషన్ వెనక్కి తగ్గకుండా చూడాలనే తాపత్రయంతోనే ఆయన అక్కడకు వెళ్లారని, కానీ ఈ ఎపిసోడ్ దాడి కేసుల వరకు వెళ్లడం గమనార్హం.

ప్రతిపక్ష అభ్యర్థి వద్దకు కూటమి అగ్రనేతలు..

మరోవైపు ఈ ఘటన తెలియగానే జనసేన సిట్టింగ్ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి అర్ధరాత్రి రెండు గంటల సమయంలో బుచ్చంపేటకు చేరుకోవడం విశేషం. దెబ్బతిన్న వైఎస్సార్సీపీ అభ్యర్థి మణికంఠను వారు పరామర్శించి, రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. అయితే, ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి కోసం అధికార కూటమికి చెందిన అగ్రనేతలు నేరుగా క్యూ కట్టడం వెనుక కేవలం బాధితుడికి అండగా నిలబడటమే ఉందా? లేక ఏకగ్రీవ ఒప్పందం చేజారకుండా చూసుకునే వ్యూహం ఉందా? అనే చర్చలు స్థానికంగా మొదలయ్యాయి.

ప్రజాస్వామ్యమా.. ధన బలమా?

రాజానగరంలో మిగిలిన ప్రశ్నలు! ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వేలంపాటల పేరిట ఏకగ్రీవాలు ఖరారు చేసుకోవడం సరైనదేనా అనే ప్రశ్న సగటు ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఒకవైపు అధికార కూటమి బలాన్ని ప్రదర్శిస్తూ ఏకగ్రీవాలకు ప్రయత్నిస్తుంటే, మరోవైపు ప్రతిపక్షంలో చలనం తీసుకురావడానికి రాజా లాంటి నేతలు ప్రయత్నించినా.. అది కాస్తా భౌతిక దాడులు, పోలీసు కేసులకు దారితీయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి బుచ్చంపేట రచ్చ రాజానగరం నియోజకవర్గంలో అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్రస్థాయి రాజకీయ పోరుకు దారితీసింది.

సెన్సార్ బోర్డులో భారీ డేటా లీక్.. ఆన్‌లైన్‌లో 500 సినిమాల స్క్రిప్ట్‌లు, కట్ ఆర్డర్లు

'కేంద్ర ఫిల్మ్ సర్టిఫికేషన్ బోర్డు' (సీబీఎఫ్‌సీ)లో భారీ భద్రతా వైఫల్యం వెలుగుచూసింది. సుమారు 500కు పైగా ఫీచర్ ఫిల్మ్‌లతో సహా ఇతర చిత్రాలకు సంబంధించిన అత్యంత కీలకమైన సర్టిఫికేషన్ రికార్డులు ఆన్‌లైన్‌లో లీక్ కావడం సినీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. సినిమాల సెన్సార్ అనుమతుల కోసం నిర్మాతలు దరఖాస్తు చేసుకునే అధికారిక ఆన్‌లైన్ వ్యవస్థ 'ఈ-సినీప్రమాణ్' పోర్టల్ నుంచే ఈ సమాచారం బయటకు పొక్కినట్లు తెలింది. ఈ ఘటన సెన్సార్ బోర్డు పనితీరు, డిజిటల్ భద్రతా ప్రమాణాలపై తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తోంది.లీకైన సమాచారంలో సినిమాల పూర్తి కాపీలు లేనప్పటికీ, వాటికి సంబంధించిన అత్యంత సున్నితమైన డాక్యుమెంట్లు ఉన్నాయి. వీటిలో సినిమాల షూటింగ్ స్క్రిప్ట్‌లు, సెన్సార్ బోర్డు సూచించిన కట్‌ల జాబితా (కట్ ఆర్డర్లు), థియేటర్లలో విడుదల కోసం సమర్పించిన ఇతర ముఖ్యమైన పత్రాలు ఉన్నట్లు సమాచారం. ఒక సినిమా కథ, పాత్రల వివరాలు, తొలగించిన సన్నివేశాలు వంటివి విడుదలకు ముందే బయటకు రావడం వల్ల నిర్మాతలకు ఆర్థికంగా, సృజనాత్మకంగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.ఈ కీలక డాక్యుమెంట్లన్నీ 'ఇంటర్నెట్ ఆర్కైవ్' అనే వెబ్‌సైట్‌లో కొద్ది రోజుల పాటు డౌన్‌లోడ్‌కు అందుబాటులో ఉన్నట్లు తెలిసింది. ఈ విషయం వెలుగులోకి రావడంతో ఇంటర్నెట్ ఆర్కైవ్ యాజమాన్యం వెంటనే స్పందించి, ఆ సమాచారాన్ని తమ ప్లాట్‌ఫామ్ నుంచి పూర్తిగా తొలగించింది. అంతేకాకుండా ఈ వ్యవహారాన్ని సైబర్ భద్రతా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆ సంస్థ నిర్ధారించింది.ఈ డేటా లీక్ ఘటనపై సెన్సార్ బోర్డు స్పందించింది. తమ పోర్టల్‌లోకి అనధికారిక యాక్సెస్ జరిగిందన్న ఆరోపణలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నామని ఒక ప్రకటనలో తెలిపింది. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు పోర్టల్‌కు సంబంధించిన పూర్తిస్థాయి సెక్యూరిటీ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. ప్రాథమిక దర్యాప్తులో ఏ నిర్మాత ఖాతా కూడా హ్యాకింగ్‌కు గురైనట్లు ఆధారాలు లభించలేదని సీబీఎఫ్‌సీ స్పష్టం చేసింది. దర్యాప్తు పూర్తయితే గానీ ఈ భద్రతా వైఫల్యానికి గల కచ్చితమైన కారణాలు, నష్టంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం లేదు.



ఎన్నికల సంఘానికి మరో షాక్- తాజా విభేదాల వేళ సుప్రీంకోర్టులో కీలక పిల్



కేంద్ర ఎన్నికల సంఘంలో విభేదాలపై తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో మరోసారి ఈసీపై సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలైంది. ఎన్నికల సంఘం పనితీరుపై స్వతంత్ర విచారణ జరిపించాలని కోరుతూ ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. న్యాయవాది విశాల్ తివారీ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఎన్నికల సంఘం పనితీరులో బయటపడుతున్న సంస్థాగత లోపాలను పరిశీలించేందుకు భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి లేదా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో స్వతంత్ర నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో ఆయన కోరారు. కేంద్ర ఎన్నికల సంఘంలో ఇద్దరు కమిషనర్లు వివేక్ జోషి, సుఖ్ బీర్ సింగ్ సంధూ ..ఈసీలో విధుల కేటాయింపు విషయంలో డిప్యూటీ కమిషనర్ మనీష్ గార్గ్ పై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా, దాన్ని తిరిగి ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ కే పంపిన వ్యవహారం కలకలం రేపుతోంది. దీనిపై మీడియాలో విస్తృతంగా కథనాలు కూడా వచ్చాయి. అయితే కేంద్రం మాత్రం దీనిపై మౌనం వహిస్తోంది. అలాగే ఈసీ కూడా స్పందించలేదు. మరోవైపు ఢిల్లీలో సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోసం నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈసీఐ పని తీరుపై స్వతంత్ర విచారణ కోసం పిల్ దాఖలు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు ఇదే పిల్ లో ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు, రాజకీయ పార్టీలు మతపరమైన గుర్తింపులు, మత చిహ్నాలను ఉపయోగించకుండా, మతం ఆధారంగా ఓట్లు కోరడం, మతపరమైన విద్వేష ప్రసంగాలు చేయడం, మత సామరస్యానికి విఘాతం కలిగించే విధంగా ప్రచారం నిర్వహించడాన్ని నిషేధించేలా ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేయాలని కూడా పిటిషనర్ కోరారు. ఎన్నికల ప్రక్రియలో ఎన్నికల సంఘం స్వతంత్రత, పారదర్శకతను బలోపేతం చేయడంతో పాటు, ఎన్నికల ప్రచారంలో మతపరమైన అంశాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని పిటిషన్‌లో న్యాయవాది విశాల్ తివారీ కోరారు. దీనిపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టాల్సి ఉంది.

